


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 216

శుక్రవారం 27-10-2023



ఇంగ్లండ్ మళ్లీ బోల్తా

శ్రీలంక చేతిలో 8 వికెట్ల తేడాతో ఓడిన డిఫెండింగ్ చాంపియన్ - 13లో



సాత్విక్‌-చిరాగ్‌ జోడీకి షాక్‌

ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ ప్రిక్వార్టర్స్‌లో ఓటమి - 13లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం వద్ద సామాజిక సాధికార యాత్రకు స్వాగతం పలుకుతున్న జనసందోహానికి అభివాదం చేస్తున్న మంత్రులు, వైఎస్సార్‌సీపీ నేతలు



గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలో ట్రాక్టర్లు, బైక్ ర్యాలీతో సామాజిక సాధికార యాత్రకు స్వాగతం పలుకుతున్న ప్రజలు



శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో నిర్వహించిన సభకు హాజరైన అశేష జనసందోహం

వెల్లివిరిసిన సామాజిక చైతన్యం

జగన్నినాదాల మధ్య 'సామాజిక సాధికార యాత్ర'కు శ్రీకారం

- ఇచ్ఛాపురం, తెనాలి, శింగనమలలో ఘనంగా ప్రారంభమైన వైఎస్సార్‌సీపీ బస్సు యాత్ర
- తొలి రోజు యాత్ర, బహిరంగ సభలకు వేలాదిగా తరలివచ్చిన పేదలు.. అడుగడుగునా ఘన స్వాగతం.. సీఎం జగన్‌కు జేజేలు
- వెల్లువలా వచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలు.. వైఎస్ జగన్ చేపట్టిన సంక్షేమాన్ని వివరించిన మంత్రులు
- గత టీడీపీ ప్రభుత్వ పాలనలో ఈ వర్గాలకు జరిగిన అన్యాయాన్ని వివరించిన నేతలు
- వైఎస్ జగన్‌కు మళ్లీ పట్టం కట్టాలని పిలుపు.. మద్దతు పలికిన ప్రజలు.. నేడు గజపతినగరం, నరసాపురం, తిరుపతిలో యాత్ర

- వివరాలు 2లో

మన ప్రభుత్వంలో జరిగిన సామాజిక న్యాయం ప్రతిధ్వనించాలి

- పేదవాడి విజయానికి బాటలు వేయాలి
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

2లో

సాక్షి ఫ్యామిలీ 1
విజయవాడ
శుక్రవారం ॥ 27-10-2023

ఫ్యాషన్





ఓవర్ స్టైల్

ఎవర్‌గ్రీన్ డ్రెస్‌గా ఎప్పటికీ శారీ ముందు వరసలో ఉంటుందని తెలిసిందే. అయితే, చీరకట్టు అందం గురించి రొటీన్ మాటలు కాదు ఇంకాస్త సృజనను జోడించి స్టైలిష్ లుక్ తీసుకురావాల్సిందే అనుకునేవారిని ఇట్టే ఆకట్టుకుంటోంది శారీ ఓవర్ కోట్. పట్టు చీరల మీదకు ఎంబ్రాయిడరీ లాంగ్ జాకెట్స్ ధరించడం తెలిసిందే. కానీ, అవి సంప్రదాయ వేడుకలకే పరిమితం. వెస్ట్రన్ పార్టీలకూ శారీ స్టైల్‌ను పరిచయం చేయాలనుకుంటే ఈ ఇండోవెస్ట్రన్ స్టైల్‌ని హ్యాపీగా ట్రై చేయచ్చు. శారీ మీదకు ఓవర్‌కోట్‌ను ధరించి కాన్ఫిడెంట్ లుక్స్‌తో కలర్‌ఫుల్‌గా వెలిగిపోవచ్చు.

సేమ్ టు సేమ్
శారీ–ఓవర్ కోట్ ఒకే కలర్ ప్యాటర్న్‌లో ఉంటే ఆ స్టైల్ సూపర్బ్ అనిపించకుండా ఉండదు. ఆభరణాల జిలుగులు అవసరం లేని ఈ ప్యాటర్న్ స్టైల్ పార్టీలో ప్రత్యేకంగా వెలిగిపోతుంది.

ధోతీ శారీ
సాధారణంగానే ధోతీ శారీ ఓ ప్రత్యేకమైన లుక్స్‌తో ఆకట్టుకుంటుంది. ఇక దాని మీదకు ఫ్లోరల్ ఓవర్ కోట్ ధరిస్తే ఎక్కడ ఉన్నా మరింత స్పెషల్‌గా కనిపిస్తారు.

ఎంబ్రాయిడరీ కోట్స్
సిల్క్ ప్లెయిన్ శారీస్‌కి ఎంబ్రాయిడరీ ఓవర్ కోట్ హుందాతనాన్ని తీసుకు వస్తుంది. ఈ స్టైల్ ధోతీ శారీస్‌కు కూడా వర్తిస్తుంది.

నీ లెంగ్త్ కోట్స్
మోకాళ్ల దిగువ భాగం వరకు ఉండే ట్రాన్స్‌పరెంట్ ఓవర్ కోట్స్ లేదా కేప్స్ నేటి యువతరపు మదిని మరింత ఆత్మ విశ్వాసంగా మార్చేస్తుంది.

న్యూస్‌మేకర్

బామ్మ పవర్

53 ఏళ్ల వయసులో ఆమె జిమ్‌లో చేరింది ఫిట్‌నెస్ కోసం. పదేళ్లు తిరిగేసరికి 63 ఏళ్ల వయసులో పవర్ లిఫ్టింగ్ చాంపియన్ అయ్యింది. ఇటీవల మంగోలియాలో నాలుగు గోల్డ్‌మెడల్స్ సాధించింది. ఏ వయసులోనైనా ఆరోగ్యంగా... దృఢంగా శరీరాన్ని మలుచుకునేందుకు స్త్రీలు శ్రద్ధ పెడితే సాధ్యం కానిది లేదని కొచ్చికి చెందిన రీని తారకన్ సందేశం ఇస్తోంది.





మంగోలియా రాజధాని ఉలాన్ బటోర్‌లో ఇటీవల 'ఇంటర్‌నేషనల్ పవర్‌లిఫ్టింగ్ ఫెడరేషన్' (ఐ.పి.ఎఫ్) చాంపియన్‌షిప్స్ జరిగాయి. మన దేశం నుంచి 25 మంది పాల్గొంటే వారిలో 15 మంది స్త్రీలే. వారిలో కొచ్చిన్‌కు చెందిన రీని తారకన్ నాలుగు గోల్డ్ మెడల్స్ సాధించింది. 63 ఏళ్ల వయసులో ఆమె ఇలా దేశం తరఫున పతకాలు గెలుస్తుందని ఎప్పుడూ అనుకోలేదు. కాని అలా జరిగింది. అందుకు ఆమె చేసిన పరిశ్రమ, చూపిన శ్రద్ధే కారణం.

భారీ పోటీ
మంగోలియాలో జరిగిన ఐ.పి.ఎఫ్‌కు 44 దేశాల నుంచి 145 మంది పవర్‌లిఫ్టర్లు హాజరయ్యారు. వీరిని 40, 50, 60, 70 ఏళ్లుగా నాలుగు కేటగిరీల్లో విభజించి పోటీలు నిర్వహించారు. మళ్లీ ఈ కేటగిరీల్లో బరువును బట్టి పోటీదార్లు ఉంటారు. స్త్రీ, పురుషులు వేరువేరుగా పాల్గొంటారు. రీని తారకన్ అరవై ఏళ్ల కేటగిరిలో నాలుగు గోల్డ్ మెడల్స్ సాధించింది. డెడ్‌లిఫ్టింగ్‌లో 112.5 కిలోల బరువు ఎత్తగలిగింది. ప్రశంసలు అందుకుంది. 'ఈ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్స్‌లో నాకు బాగా నచ్చిన అంశం స్త్రీలు ఎక్కువగా పాల్గొనడం. మన దేశం నుంచి స్త్రీలే ఎక్కువ మంది ఉన్నాం. అంటే నేటికాలంలో స్త్రీలు తమ సామర్థ్యాలను ఏ వయసులోనైనా మెరుగు పరుచుకోవడానికి వెనుకాడటం లేదని తెలుసుకోవాలి' అంది రీని తారకన్.

బరువు తగ్గడానికి వెళ్లి
రీని తారకన్ కొచ్చిన్ శివార్లలోని తైకట్టుశ్శేరి అనే గ్రామంలో ఉంటుంది. భర్త ఆంటోని తారకన్ రైల్వేలో పని చేసి రిటైర్ అయ్యాడు. ఇద్దరు కుమార్తెల్లో ఒకరు అమెరికాలో స్థిరపడితే మరొకరు చెన్నైలో రెస్టరెంట్‌ను నడుపుతున్నారు. ఇంట్లో విశ్రాంతిగా ఉండటం వల్ల తాను బరువు పెరుగుతున్నానని రీని తారకన్‌కు అనిపించింది. దాంతో కొచ్చిన్ సిటీలోని వైట్టిలా ప్రాంతంలో ఒక జిమ్‌లో చేరింది. ఇంటినుంచి జిమ్ పాతిక కిలోమీటర్ల దూరమైనా బరువు తగ్గాలనే కోరికతో రోజూ వచ్చేది. భర్త ఆమెను తీసుకొచ్చి దిగబెట్టేవాడు. అయితే ఆ జిమ్‌లోని ట్రైనర్ ఆమెలో బరువులెత్తే సామర్థ్యం ఉందని ఆ దారిలో ప్రోత్సహించాడు. పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌గా మారొచ్చని చెప్పాడు. అందుకు తర్ఫీదు ఇస్తాన్నాడు. 2021 నుంచి ఆమెను పోటీలకు హాజరయ్యేలా చూస్తున్నాడు. అప్పటి నుంచి రీని మెడల్స్ సాధిస్తూనే ఉంది. 'పదేళ్ల క్రితం నాకు జిమ్ అంటేనే తెలియదు. కాని క్రమం తప్పకుండా జిమ్ చేస్తూ నా ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ఇప్పుడు పవర్‌లిఫ్టర్‌ని అయ్యాను. ఈ గుర్తింపు సంతృప్తినిస్తోంది' అంది రీని తారకన్.

సమర్థింపులు, సూటిపోట్లు
'నేను పవర్‌లిఫ్టర్ కావాలని ప్రయత్నించినప్పుడు నా కుటుంబం పూర్తి సహకారం ప్రకటించింది. నా పిల్లలు ''ట్రై చెయ్యమ్మా'' అన్నారు. కాని బంధువుల్లో కొందరు సూటిపోటి మాటలు అన్నారు. ఈ వయసులో ఇదంతా అవసరమా అని ప్రశ్నించారు. ప్రశ్నించేవారికి పని చేస్తూనే సమాధానం చెప్పాలనుకున్నాను. అప్పుడు అలా అన్నవాళ్లు ఇవాళ నన్ను చూసి ఆశ్చర్యపోతున్నారు. జిమ్ స్త్రీలకు చాలామంచిది. పవర్‌లిఫ్టింగ్ లాంటివి మన ఎముకలకు బలాన్నిస్తాయి. నేను నా బరువును అదుపులో ఉంచుకుని ఆరోగ్యంగా ఉంటున్నాను. వారంలో నాలుగు రోజులు జిమ్‌కు వచ్చి రెండు గంటలు వర్కవుట్ చేస్తాను. రెండు రోజులు ఇంట్లో వ్యాయామం చేస్తాను. ఒక రోజు విశ్రాంతి తీసుకుంటాను. వ్యాయామం ఉత్సాహాన్నిస్తుంది. తప్పక చేయండి' అంటోంది రీని తారకన్.

బ్యూటిప్స్

ముఖానికి ఫేస్ యోగా!

ఫేస్ యోగాతో మొటిమలు, మచ్చలు పోయి ముఖం మరింత కాంతిమంతంగా మెరిసిపోతుంది. ఫేస్ యోగా ఎలా చేయాలో చూద్దాం.



- ఉదయం నిద్ర లేచిన వెంటనే ఫోమ్ యోగా చేయాలి.
- ముందుగా నిటారుగా కూర్చోవాలి. బుగ్గలను బూరా ఊదినట్లుగా ఊది రెండు వేళ్లతో నోటిని మూసేయాలి.
- బూరలాగా ఉబ్బిన బుగ్గలపై చేతితో కొట్టాలి. ఒక్కో బుగ్గను ముప్పై సెకన్ల పాటు కొట్టాలి.
- రెండు బుగ్గలను కొట్టడం పూర్తయిన తరువాత చల్లటి నీటితో ముఖాన్ని కడగాలి. ఇలా రోజూ చేయడం వల్ల ముఖం మెరుస్తుంది.

వంటిల్లు

అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి విందు ఏదైనా సరే... ఒకటీ, రెండు కాదు అన్నీ ఆరగించాలనిపించే ఘుమఘుమలతో వచ్చేసింది ఈ వారం వంటిల్లు...

బ్రేక్‌ఫాస్ట్... లంచ్... డిన్నర్ కాసింత కొత్తగా..!

ఫిష్ కేక్



కావలసినవి: శుభ్రం చేసిన చేప ముక్కలు – మూడు కప్పులు(చర్మం, ముల్లు తొలగించి చిన్న ముక్కలు చేయాలి); బ్రెడ్ ముక్కల పొడి – అరకప్పు; నూనె – టేబుల్ స్పూను; స్ప్రింగ్ ఆనియన్ తరుగు – కప్పు; బంగాళ దుంపలు – రెండు; మిరియాల పొడి – రెండు టీస్పూన్లు; నిమ్మరసం – రెండు టేబుల్ స్పూన్లు; కొత్తిమీర తరుగు – అర కప్పు; పచ్చిమిర్చి – రెండు; ఉప్పు – రుచికి సరిపడా.

తయారీ: ● బంగాళదుంపలను ఉడికించి, తొక్కతీసి చిదుముకోవాలి ● చేప ముక్కలను గిన్నెలో వేసి, పచ్చిమిర్చిని తరిగి వేయాలి ● స్ప్రింగ్ ఆనియన్, కొత్తిమీర తరుగు, చిదుముకున్న బంగాళ దుంపల మిశ్రమం, ఉప్పు, మిరియాల పొడి, నిమ్మరసం వేసి ముక్కలు పట్టేలా కలిపి అరగంట పక్కన పెట్టుకోవాలి ● అరగంట తరువాత మిశ్రమాన్ని టిక్కీల్లా తయారు చేసుకోవాలి ● బ్రెడ్ ముక్కల పొడిలో ఈ టిక్కీలను అద్దాలి ● ఇప్పుడు బేకింగ్ ట్రేకు నూనె రాసి, బ్రెడ్ ముక్కల పొడిలో అద్దిన ఫిష్ కేక్స్‌ను బేకింగ్ ట్రేలో పెట్టి అర గంటపాటు బేక్ చేస్తే ఎంతో రుచికరమైన ఫిష్ కేక్ రెడీ.

గ్రిల్డ్ మలై ప్రాన్ ర్యాప్స్



కావలసినవి: శుభ్రం చేసిన రొయ్యలు – ముప్పై ఆరు; చపాతీలు – నాలుగు; కసూరీ మేథి పొడి – ముప్పావు టీస్పూను; సోంపు పొడి – ముప్పావు టీస్పూను; ఉప్పు – రుచికి తగినంత; కారం – టీస్పూను; మిరియాల పొడి – రుచికి సరిపడా; అల్లం వెల్లుల్లి పేస్టు – ముప్పావు టేబుల్ స్పూను; మీగడ పెరుగు – ముప్పావు కప్పు; నిమ్మరసం – టేబుల్ స్పూను; నూనె – గ్రిల్ చేయడానికి సరిపడా; టొమాటో కెచప్ – నాలుగు టేబుల్ స్పూన్లు; ఆవ సాస్ – నాలుగు టేబుల్ స్పూన్లు; క్యాబేజీ తురుము – నాలుగు టేబుల్ స్పూన్లు; క్యారట్ తురుము – నాలుగు టేబుల స్పూన్లు; స్ప్రింగ్ ఆనియన్ తరుగు – రెండు టేబుల్ స్పూన్లు.

తయారీ: ● ఒక గిన్నెలో కసూరీ మేథీ, సోంపు, మిరియాల పొడులు, కారం, పెరుగు, అల్లం వెల్లుల్లి పేస్టు, రుచికి సరిపడా ఉప్పువేసి కలపాలి ● ఇప్పుడు రొయ్యలు, నిమ్మరసం కూడా వేసి కలిపి అరగంటపాటు నానబెట్టుకోవాలి ● అరగంట తరువాత గ్రిల్ పాన్‌పై కొద్దిగా నూనె చల్లాలి. ఇది వేడెక్కిన తరువాత నానిన రొయ్యలను వేసి రెండువైపులా చక్కగా గ్రిల్ చేసుకోవాలి ● ఇప్పుడు ఒక్కో చపాతీని తీసుకుని ముందుగా టేబుల్ స్పూను టొమాటో కెచప్, తరువాత ఆవ కెచప్ రాయాలి ● కెచప్‌లపైన క్యాబేజీ, క్యారట్ తరుగు, స్ప్రింగ్ ఆనియన్స్ వేయాలి ● వీటన్నింటి పైన గ్రిల్ చేసిన రొయ్యలు వేసి చపాతీని విడిపోకుండా గట్టిగా రోల్‌లా చుట్టాలి ● గ్రిల్‌పైన కొద్దిగా నూనె వేసి రోల్ చేసిన చపాతీ ర్యాప్‌లను వేసి రెండు వైపులా కాల్చుకుని సర్వ్ చేసుకోవాలి.


లేసీ మటన్ కట్‌లెట్



కావలసినవి: మటన్ ఖీమా – రెండు కప్పులు; వైట్ బ్రెడ్ స్లైసులు – నాలుగు; వెల్లుల్లి పేస్టు – టేబుల్ స్పూను; అల్లం పేస్టు – అరటేబుల్ స్పూను; పచ్చిమిర్చి – మూడు; వేయించిన జీలకర్ర పొడి – టేబుల్ స్పూను; ధనియా పొడి – టేబుల్ స్పూను; కారం – రెండు టీస్పూన్లు; పసుపు – అరటీస్పూను; కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూను; పుదీనా తరుగు – టేబుల్ స్పూను; ఉప్పు – రుచికి సరిపడా; గుడ్లు – రెండు; నూనె – టేబుల్ స్పూను; బ్రెడ్ ముక్కల పొడి – కప్పు; నూనె – కట్‌లెట్ వేయించడానికి తగినంత; ఉల్లిపాయ, పలచగా... చక్రాల్లా తరిగిన నిమ్మకాయ ముక్కలు – గార్నిష్‌కు సరిపడా.

తయారీ: ● ఒక గిన్నెలో బ్రెడ్‌స్లైసులను వేసి, కొద్దిగా నీళ్లు చల్లుకుని మెత్తగా చిదుముకోవాలి ● ఈ చిదుములోనే మటన్ ఖీమా, అల్లం, వెల్లుల్లి పేస్టు, పచ్చిమిర్చిని తరిగి వేయాలి ● జీలకర్ర పొడి, కారం, పసుపు, ధనియాల పొడి, కొత్తిమీర, పుదీనా తరుగు, రుచికి సరిపడా ఉప్పువేసి చక్కగా కలుపుకోవాలి ● ఇప్పుడు బాణలిలో రెండు టేబుల్ స్పూన్ల నూనె వేసి వేడెక్కనివ్వాలి ● గుడ్లసొనను గిన్నెలో వేసి, చిటికెడు ఉప్పు వేసి కలిపి పక్కనపెట్టుకోవాలి ● ఇప్పుడు ఖీమా మిశ్రమాన్ని ఉండలుగా చుట్టుకోవాలి ● ఉండలన్నీ తయారయ్యాక.. ఒక్కో ఉండను బ్రెడ్‌ముక్కల పొడిలో వేసి కట్‌లెట్‌లా వత్తుకోవాలి ● తర్వాత కట్‌లెట్‌ను గుడ్ల సొనలో ముంచి, కాగిన నూనెలో వేసి ఫ్రై చేయాలి ● రెండు వైపులా గోల్డెన్ కలర్, క్రిస్పీగా మారేంత వరకు సన్నని మంటమీద వేయించి తీస్తే లేసీ మటన్ కట్‌లెట్ రెడీ ● ఉల్లిపాయ, నిమ్మకాయ రింగు ముక్కలు, కొత్తిమీరతో గార్నిష్ చేసి సర్వ్‌చేసుకోవాలి.

భుర్జి మఫిన్స్



కావలసినవి: గుడ్లు – నాలుగు; ఉల్లిపాయ – ఒకటి; బంగాళ దుంప – ఒకటి; పచ్చిమిర్చి – రెండు; మిరియాల పొడి – టీస్పూను; పసుపు – పావు టీస్పూను; కారం – అరటీస్పూను; ఉప్పు – రుచికి సరిపడా; కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూను; చీజ్ తరుగు – రెండు టేబుల్ స్పూన్లు; టొమాటో – ఒకటి.

తయారీ: ● ఉల్లి, పచ్చిమిర్చి, టొమాటోలను సన్నగా తరిగి పక్కన పెట్టుకోవాలి ● బంగాళదుంపను ఉడికించి, తొక్కతీసి చిన్న ముక్కలుగా తరగాలి ● గుడ్లను పగులగొట్టి సొనను గిన్నెలో వేయాలి ● ఈ సొనలో బంగాళదుంప ముక్కలు, మిర్చి, ఉల్లి ముక్కలు వేయాలి ● మిరియాలపొడి, పసుపు, కారం, చీజ్, కొత్తిమీర తరుగులు, రుచికి సరిపడా ఉప్పు వేసి బాగా కలపాలి ● ఈ మిశ్రమాన్ని సిలికాన్ మౌల్డ్స్‌లో పోసి పైన టొమాటో ముక్కలతో గార్నిష్ చేయాలి ● ఈ మౌల్డ్స్‌ను అవెన్‌లో పెట్టి ఇరవై నిమిషాలు బేక్ చేస్తే భుర్జి మఫిన్స్ రెడీ ● ఇవి చల్లారిన తరువాత బ్రేక్‌ఫాస్ట్, లంచ్‌బాక్స్‌లో పెట్టుకోవచ్చు.

చికెన్ ఆమ్లెట్



కావలసినవి: గుడ్లు – మూడు; ఉడికించి తురిమిన చికెన్ – కప్పు (కూరలో మిగిలిపోయిన చికెన్ ముక్కలను వాడుకోవచ్చు); ఉల్లిపాయ – ఒకటి; కరివేపాకు –ఒక రెమ్మ; ఉప్పు – రుచికి సరిపడా; మిరియాల పొడి – రెండు టీస్పూన్లు; కొత్తిమీర తరుగు – పావు కప్పు; నూనె – ఆమ్లెట్ వేగడానికి సరిపడా.

తయారీ: ● ఉల్లిపాయను సన్నగా తరిగి ఒక గిన్నెలో వేయాలి ● ఇదే గిన్నెలో కరివేపాకు, మిరియాల పొడి, కొత్తిమీర తరుగు, గుడ్లసొన, చికెన్ తరుగు వేయాలి ● చివరిగా రుచికి సరిపడా ఉప్పు వేసి బాగా కలిపి పావుగంట పక్కన పెట్టుకోవాలి ● ఇప్పుడు వేడెక్కిన పెనంపై కొద్దిగా నూనె వేసి ఆమ్లెట్ మిశ్రమాన్ని పోయాలి ● రెండువైపులా చక్కగా కాల్చుకుంటే చికెన్ ఆమ్లెట్ రెడీ.

ఇంటిప్స్



● గ్లాసు నీళ్లల్లో బిర్యానీ ఆకు, దాల్చిన చెక్కను ముక్కలుగా తుంచి వేయాలి. దీనిలో బోరిక్ యాసిడ్ రెండు టీ స్పూన్లు వేసి మూడు గంటలపాటు నానబెట్టాలి. తరువాత ఈ నీటిని సింక్‌లో పోస్తే బొద్దింకలు రావు.



● నిమ్మకాయలను శుభ్రంగా కడిగి తుడవాలి. వీటికి కొద్దిగా నూనె రాసి టిష్యూ పేపర్ వేసిన బాక్స్‌లో పెట్టి రిఫ్రిజిరేటర్‌లో పెడితే ఎక్కువ రోజులపాటు తాజాగా ఉంటాయి.

● గ్లాసు నీళ్లలో కొద్దిగా వెనిగర్ వేసి టూత్‌బ్రష్‌లను నానబెట్టాలి. అరగంట తరువాత గోరువెచ్చని నీటితో కడిగితే టూత్ బ్రష్‌లు శుభ్రపడతాయి.

● నిమ్మకాయ ముక్కలు, పుదీనా ఆకులు, వెనిగర్‌ను సమపాళ్లల్లో తీసుకుని ఐస్‌క్యూబ్ ట్రేలో పోసి రాత్రంతా రిఫ్రిజిరేటర్ లో పెట్టాలి. ఉదయం ఈ ఐస్ క్యూబ్‌ను తీసి దుర్వాసన వస్తోన్న సింక్‌లో వేస్తే దుర్వాసన తొలగిపోతుంది.





● టొమాటో చుట్టూ గాటు పెట్టి మరుగుతున్న నీటిలో వేయాలి. నిమిషం తరువాత తీసేసి ఐస్‌వాటర్‌లో వేయాలి. తరువాత టొమాటోను పట్టుకుని లాగితే తొక్క సులభంగా వచ్చేస్తుంది.



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 216

శుక్రవారం 27-10-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'నా అక్కలూ..చెల్లెళ్లు... తమ్ముళ్ల కళ్లలో వెలుగులు చూసినపుడే నా నిజమైన పుట్టిన రోజు'



ఆరో రోజూ 'బేర్ కల్లోలం'

64 వేల దిగువకు సెన్సెక్స్.. 19వేల స్థాయిని కోల్పోయిన నిఫ్టీ -13లో



'రికవరీ'లకు సమయపాలన

రుణ గ్రహీతలతో సంప్రదింపుల విషయంలో ఆర్‌బీఐ ప్రతిపాదన -13లో



గెహ్లోత్ కుమారుడికి ఈడీ సమన్లు

విదేశీ కరెన్సీ నిబంధనల ఉల్లంఘన కేసులో రాజస్తాన్ సీఎం గెహ్లోత్ కుమారుడు వైభవ్‌కు ఈడీ సమన్లు జారీ చేసింది.

వివరాలు 11లో ▸



గాజాపై భూతల దాడులు

హమాస్ స్థావరాలను నేలమట్టం చేయడానికి ఇజ్రాయెల్ సైన్యం సరిహద్దు దాటి గాజా భూభాగంలోకి అడుగుపెట్టింది.


వివరాలు 6లో ▸



ఐదుగురు ముష్కరులు హతం

జమ్మూకశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో చొరబాటుకు యత్నించిన ఐదుగురు ముష్కరులను భద్రతా బలగాలు హతమార్చాయి.

వివరాలు 6లో ▸



మాజీ నేవీ ఉద్యోగులకు మరణశిక్ష

గూఢచర్యం ఆరోపణలతో 8 మంది భారత నేవీ మాజీ ఉద్యోగులకు ఖతార్ కోర్టు మరణ శిక్ష వేయడంపై భారత్ తీవ్రంగా స్పందించింది.

వివరాలు 6లో ▸



లారీని ఢీకొట్టిన కారు

13 మంది అక్కడికక్కడే దుర్మరణం.. కర్ణాటకలోని చిక్కబళ్లాపుర వద్ద ఘటన

మృతుల్లో శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన 10 మంది.. కర్ణాటక వాసులు ముగ్గురు

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం: సీఎం వైఎస్ జగన్

3లో

అమెరికాలో నరమేధం..



6లో

అమెరికాలో మళ్లీ తుపాకీ పేలింది. మానసిక స్థితి సరిగ్గా లేదని భావిస్తున్న ఓ సైనికుడు నరమేధానికి దిగాడు. లెవిస్టన్‌లో సరదాగా ఆడుకుంటున్న చిన్నారులు, వారి తల్లిదండ్రులతోపాటు సమీపంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌పైనా కాల్పులు జరిపాడు. మొత్తం 18 మంది ప్రాణాలు కోల్పోగా.. 13 మందికి పైగా గాయపడ్డారు.

'మిల్లెట్' మహారాణులు

విజయనగరం జిల్లాలో వెల్లివిరిసిన మహిళా రైతుల చైతన్యం

1,500 మందితో మిల్లెట్ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు

10లో

- లక్కవరపు కోట మండలం రేగ పంచాయతీ వద్ద ఆరోగ్య మిల్లెట్ ప్రొడ్యూసర్స్ కంపెనీకి శ్రీకారం
- ఇటీవలే సీఎం జగన్ చేతుల మీదుగా ప్రారంభం.. ఒక్కొక్కరి నుంచి రూ.1,000 చొప్పున మూలధనం సమీకరణ
- పరిశ్రమ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఉదారత.. అవసరమైన రూ.4.06 కోట్లు గ్రాంట్‌గా మంజూరు
- తాము పండించిన పంటను కంపెనీ ద్వారా ప్రాసెస్ చేయడమే కాదు..
- చిరుధాన్యాలతో చిక్కీలు, బిస్కెట్లు, సేమియా, పాస్తా, కేకులు వంటి 50 రకాల ఉత్పత్తుల తయారీ
- స్వయంగా ప్యాకింగ్, మార్కెటింగ్ లోనూ మహిళా రైతుల రాణింపు
- ప్రొడక్షన్, మార్కెటింగ్, ఫైనాన్షియల్ రీసోర్సెస్, ఇంటర్నల్ ఆడిటింగ్ కూడా వీరే
- సర్కారు సహకారంతో ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్స్, హాస్టళ్లలో మధ్యాహ్న భోజనంలో వీటి సరఫరా
- నేరుగా 20 మందికి.. పరోక్షంగా 5వేల మందికి జీవనోపాధి.. ఏటా కనీసం రూ.2 కోట్ల టర్నోవరే లక్ష్యం



విజయనగరం జిల్లా రేగ వద్ద ఆరోగ్య మిల్లెట్ సెకండరీ ప్రాసెసింగ్ యూనిట్‌లో మహిళలు

ఇప్పుడు తినడానికి ఏ లోటూలేదు..



మాకు ఐదెకరాలుంది. అయినాసరే తిండిగింజలకు ఇబ్బందిపడే వాళ్లం. పనుల్లేని సమయంలో ఉపాధి పనులకూ వెళ్లేవాళ్లం. సబల సంస్థ ఇచ్చిన ప్రోత్సాహంతో మినుము, చిరుధాన్యాలు పండిస్తున్నాం. ఇంట్లో తినడానికి ఇప్పుడు ఏ లోటులేదు. ప్రభుత్వం ఇచ్చిన సహకారంతో పరిశ్రమ పెట్టుకోగలిగాం. రూ.1,000 చెల్లించి సభ్యురాలిగా కంపెనీలో చేరా. మా పొలంలో పండించిన చోళ్లు, గంట్లు, రాగులు కంపెనీకి అమ్ముతున్నాం. ఇతర రైతుల మాదిరిగానే కిలోకి రూ.3 నుంచి రూ.5 వరకు అదనంగా ఇస్తున్నారు. వచ్చే లాభాల్లో డివిడెండ్ కూడా తీసుకోబోతున్నాం.

\- అనిమిరెడ్డి సత్యవతి, కళ్లేపల్లి, ఎల్.కోట మండలం


కంటికి శస్త్రచికిత్స చేయించుకోవాలి

మధ్యంతర బెయిల్ ఇవ్వండి

హైకోర్టులో చంద్రబాబు అత్యవసర పిటిషన్

అత్యవసర విచారణకు నో చెప్పిన ధర్మాసనం

11లో



సీజే రోస్టర్‌కే జడ్జీలు కట్టుబడి ఉండాలి

న్యాయమూర్తులందరూ క్రమశిక్షణతో నడుచుకోవాలి

- సీజే కేటాయించని కేసుపై విచారణ జరపడం తీవ్ర అనౌచిత్యం
- కేటాయించిన కేసు తప్ప మరే ఇతర కేసును వారు విచారించడానికి వీల్లేదు
- ఫోరం షాపింగ్ ఎంతమాత్రం సరికాదు.. ఫోరం షాపింగ్‌కు పాల్పడ్డ రాజస్తాన్ నిందితులు.. ఓ జడ్జి ముందు కేసు రాకుండా ఎత్తుగడ
- తీవ్రంగా ఆక్షేపించిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. వారికి రూ.50వేల జరిమానా
- రాష్ట్రంలో ఫోరం షాపింగ్‌లో ఆరితేరిన చంద్రబాబు అండ్ కో
- ఇలా గతంలో ఎన్నో కేసుల నుంచి ఆయన తప్పించుకున్న వైనాలెన్నో
- తాజాగా ఓ కేసులో కూడా ఫోరం షాపింగ్.. న్యాయవర్గాల్లో తీవ్ర చర్చ

11లో

మన ప్రభుత్వంలో జరిగిన సామాజిక న్యాయం ప్రతిధ్వనించాలి: సీఎం



సాక్షి, అమరావతి: మన ప్రభుత్వంలో నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీలకు కల్పించిన ప్రాధాన్యత ఈ రాష్ట్ర చరిత్రలోనే కాదు.. దేశ చరిత్రలో కూడా మునుపెన్నడూ చూడనిది అని సీఎం వైఎస్ జగన్ చెప్పారు. 'ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ప్రగతిని ఒక హక్కుగా మన ప్రభుత్వం వారికి అందించింది. 53 నెలల కాలంలో రూ. 2.38 లక్షల కోట్ల డీబీటీలో 75 శాతం ఈ వర్గాలకు చేరడమే దీనికి నిదర్శనం. చట్టం చేసి నామినేటెడ్ పదవుల్లో 50 శాతం ఈ వర్గాలకు ఇస్తూ పట్టం కట్టిన ప్రభుత్వం కూడా మనదే. పెత్తందారీ పోకడలున్న వ్యక్తులు, శక్తులు అడుగడుగునా అడ్డుపడ్డా ఎక్కడా వెనకడుగు వేయలేదు. రాబోయే రోజుల్లో కూడా పెత్తందారులకు, పేదలకు మధ్య యుద్ధం జరగబోతోంది. ఈరోజు నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 'సామాజిక సాధికార యాత్ర' ద్వారా వీరంతా ఏకమై మన ప్రభుత్వంలో జరిగిన సామాజిక న్యాయం ప్రతిధ్వనించాలి. పేదవాడి విజయానికి బాటలు వేయాలి' అని గురువారం ట్వీట్ చేశారు.

దివ్యాంగుల రిజర్వేషన్ 4 శాతానికి పెంపు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు, ప్రమోషన్లలో దివ్యాంగులకు 4% రిజర్వేషన్‌ను ఏపీపీఎస్సీ ఈ ఏడాది రానున్న నోటిఫికేషన్ల నుంచి అమలు చేయనున్నట్లు కమిషన్ కార్యదర్శి ప్రదీప్‌కుమార్ తెలిపారు. గతంలో దివ్యాంగులకు 3% ఉన్న రిజర్వేషన్లను నాలుగు శాతానికి పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు.

వెల్లివిరిసిన సామాజిక చైతన్యం

జగన్నినాదాల మధ్య 'సామాజిక సాధికార యాత్ర'కు శ్రీకారం

ఇచ్ఛాపురం, తెనాలి, శింగనమలలో ఘనంగా ప్రారంభమైన వైఎస్సార్‌సీపీ బస్సు యాత్ర

- తొలి రోజు సభలకు వేలాదిగా తరలివచ్చిన పేదలు
- అడుగడుగునా ఘన స్వాగతం.. సీఎం జగన్‌కు జేజేలు
- వెల్లువలా వచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలు
- వైఎస్ జగన్ చేపట్టిన సంక్షేమాన్ని వివరించిన మంత్రులు
- గత టీడీపీ ప్రభుత్వ పాలనలో ఈ వర్గాలకు జరిగిన అన్యాయాన్ని వివరించిన నేతలు



అనంతపురం జిల్లా శింగనమలలో జరిగిన సామాజిక సాధికార యాత్ర సభకు హాజరైన ప్రజలు

సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, మహిళలు.. రాష్ట్రంలో నేడు ఏ రంగంలో చూసినా వీరిదే అగ్రస్థానం. ఇది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాధించిన సామాజిక న్యాయం. అదే ఇప్పుడు రాష్ట్రమంతటా చైతన్యాన్ని రగిలించింది. జగన్నినాదమై మార్మోగుతోంది. సామాజిక సాధికారతై వెలుగులీనుతోంది. గురువారం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన వైఎస్సార్‌సీపీ 'సామాజిక సాధికార' బస్సు యాత్ర ప్రజల్లోకి చొచ్చుకెళ్లింది. ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర, రాయలసీమలో ఏకకాలంలో ప్రారంభమైన ఈ బస్సు యాత్ర రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తెచ్చిన సామాజిక విప్లవాన్ని ప్రజల్లోకి విజయవంతంగా తీసుకెళ్తోంది. పార్టీకి చెందిన కోఆర్డినేటర్లు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ నేతల ఆధ్వర్యంలో సాగుతున్న యాత్రకు ప్రజలు అడగడుగునా ఘన స్వాగతం పలుకుతున్నారు. రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో తమకు పట్టం కట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలవడానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలు ఏకమై కదలివచ్చారు. తమకు జరిగిన సామాజిక న్యాయాన్ని ప్రతిధ్వనించారు.

రాష్ట్రంలో గత 53 నెలలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీఎం వైఎస్ జగన్ చేస్తున్న సామాజిక న్యాయాన్ని.. 2014–19 మధ్య అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు ఆ వర్గాలకు చేసిన ద్రోహాన్ని వివరించి.. ఆ వర్గాలను ఏకం చేయడం ద్వారా 2024 ఎన్నికల్లో 175కు 175 స్థానాల్లో విజయం సాధించడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రను చేపట్టింది. ఈ యాత్ర గురువారం ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం, కోస్తాలో గుంటూరు జిల్లా తెనాలి, రాయలసీమలో అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గాల నుంచి ప్రారంభమైంది. ఇచ్ఛాపురంలో ఆ నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, తెనాలిలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, శింగనమలలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఈ యాత్రకు నేతృత్వం వహించారు. ఇచ్ఛాపురం, తెనాలి, శింగనమల నియోజకవర్గం బుక్కరాయసముద్రంలో బహిరంగ సభలు జరిగాయి. మూడు ప్రాంతాల్లో బస్సు యాత్ర, సభలకు ప్రజలు పోటెత్తారు. సీఎం వైఎస్ జగన్ చేసిన సామాజిక న్యాయానికి నీరాజనాలు పలికారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు, మహిళలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన మేలును మంత్రులు, నేతలు వివరించారు. ఆ ప్రసంగాలను ప్రజలు ఆసక్తిగా విన్నారు. ప్రసంగాల్లో నేతలు సీఎం వైఎస్ జగన్ పేరు ఎత్తగానే.. 'మా నమ్మకం నువ్వే జగన్'.. 'జగనన్నే మా భవిష్యత్తు'.. 'జగనే రావాలి – జగనే కావాలి' అంటూ జనం ప్రతిస్పందించారు. సామాజిక సాధికార యాత్ర రెండో రోజు శుక్రవారం ఉత్తరాంధ్రలో గజపతినగరం, కోస్తాలో నరసాపురం, రాయలసీమలో తిరుపతిలో జరగనుంది.

వెల్లువలా అభిమానం

శ్రీకాకుళంలో ప్రారంభమైన బస్సు యాత్రకు నరసన్నపేట నియోజకవర్గం మడపాం, కోట బొమ్మాళి వద్ద ఘన స్వాగతం లభించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలు, మహిళలు వెల్లువలా తరలివచ్చారు. మడపాం వద్ద బాణసంచాతో స్వాగతం పలికారు. యాత్రలో భాగంగా మంత్రుల బృందం కంచిలి మండలం బూరగాం సచివాలయాన్ని సందర్శించి, అక్కడి సిబ్బందితో మాట్లాడారు. స్థానికులతో ముఖాముఖి నిర్వహించి సమస్యలు తెలుసుకున్నారు. మద్యపానం మానుకోవాలని హితవు పలికారు. పలాస టి.కె.ఆర్.కల్యాణ మండపంలో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో మేధావుల సదస్సు నిర్వహించారు. ఇచ్ఛాపురంలో జరిగిన సభలో ప్రసంగించిన నేతలు జగన్ పేరు చెప్పిన ప్రతిసారీ ప్రజలు జయజయధ్వానాలు చేశారు.

బడుగు జన కెరటం..

తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నేతృత్వంలో రూరల్ మండలం కొలకలూరులో ప్రారంభమైన బస్సు యాత్రకు, తెనాలిలో జరిగిన సభకు బడుగు జనులు కెరటంలా తరలివచ్చారు. సాయంత్రం 6.32 గంటలకు సభా ప్రాంగణానికి యాత్ర చేరగానే జనం జయజయధ్వానాలు చేశారు. అందరికీ అభివాదం చేస్తూ దళిత, ముస్లిం, బడుగు బలహీన వర్గాల ప్రజాప్రతినిధులు వేదికపైకి చేరుకున్నారు. సభకు ఎమ్మెల్యే శివకుమార్ అధ్యక్షత వహించారు. రాష్ట్ర మంత్రి జోగి రమేష్ 'జగనన్న రథచక్రాలు రాష్ట్రంలో దూసుకెళుతున్నాయి' అనగానే జై జగన్.. జైజై జగన్ అంటూ జనం నినదించారు. 'నిజం నిగ్గు తేలినందునే బాబు బొక్కలోకి వెళ్లాడు..' అనగానే జనం 'నిజం...నిజం' అంటూ కేకలు పెట్టారు. ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించినపుడు కరతాళధ్వనులు మిన్నుముట్టాయి.

జన సంతసం.. జగన్నినాదం

అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గంలో జరిగిన సామాజిక సాధికారత బస్సు యాత్ర, బుక్కరాయసముద్రంలో జరిగిన సభ జన సంద్రాన్ని తలపించాయి. బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఈ కార్యక్రమాలకు భారీగా తరలివచ్చారు. నియోజకవర్గ కేంద్రమైన శింగనమలలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆధ్వర్యంలో బస్సు యాత్ర ప్రారంభమైంది. మంత్రులు, ఎమ్మెల్యేలు డా. బీఆర్ అంబేడ్కర్, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. 'నాడు–నేడు' పనుల ఫొటోలను పరిశీలించారు. అక్కడి వచ్చిన ప్రజలతో మాట్లాడారు. అనంతరం బస్సు యాత్ర ప్రారంభించారు. బస్సు ముందు వైఎస్సార్‌సీపీ శ్రేణులు బైక్ ర్యాలీ చేశాయి. రోటరీపురం గ్రామం వద్ద ప్రజలు పూల వర్షం కురిపించారు. బుక్కరాయసముద్రం వద్ద యాత్రకు ప్రజలు స్వాగతం పలికారు. ఇక్కడ జరిగిన సభలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు మాట్లాడారు. సీఎం జగన్ ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనారిటీలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించిన సందర్భంలో ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.

జాతీయ నేతలకు నివాళులు

వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికారత బస్సు యాత్రలో భాగంగా జరుగుతున్న సభల్లో పాల్గొన్న మంత్రులు, ప్రజా ప్రతినిధులు, నేతలు ముందుగా జాతీయ నేతలకు నివాళులర్పించారు. ప్రతి సభలో వేదికపై భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావు పూలే, బాబు జగజ్జీవన్ రామ్, అల్లూరి సీతారామరాజు, భారతరత్న అబ్దుల్ కలాం చిత్రపటాలను, మహానేత వైఎస్సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. మంత్రులు, ఇతర నేతలు ఈ చిత్రపటాల వద్ద పుష్పాలు ఉంచి, నేతలకు నివాళులర్పించారు. అనంతరం సభ ప్రారంభించారు.

అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు

ఇచ్ఛాపురం సామాజిక సాధికార సభలో మంత్రి ధర్మాన



శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో జరిగిన సభలో ప్రసంగిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు



సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: సీఎం జగన్ అధికారం చేపట్టిన నాటి నుంచి అన్ని వర్గాల సంక్షేమానికి పెద్ద పీట వేశారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు, మహిళలకు అగ్రస్థానమిచ్చి, ఆ వర్గాలకు రాజకీయ, సామాజిక సాధికారత సాధించిన సీఎం వైఎస్ జగన్ అని తెలిపారు. వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార యాత్రలో భాగంగా గురువారం సాయంత్రం శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో జరిగిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడారు. వైఎస్ జగన్ నేతృత్వంలోని ప్రభుత్వం అవినీతి రహిత, పారదర్శకమైన సుపరిపాలన అందిస్తోందని, దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా పాలన సాగించామని చెప్పారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల్లో వైఎస్సార్‌సీపీ వారితో పాటు అన్ని పార్టీల వారూ ఉన్నారని తెలిపారు. పేదలకు ఇస్తున్న స్థలం దేనికీ పనికిరాదని చంద్రబాబు విమర్శించారని, కానీ తామిచ్చిన స్థలమే పేదలకు పెద్ద ఆస్తి అయిందని వివరించారు. అమరావతి రాజధాని పేరుతో చంద్రబాబు ప్రజాధనాన్ని కొల్లగొట్టారన్నారు. 2024కి వైజాగ్ రాజధానిగా నిర్మించుకుందామని పిలుపునిచ్చారు. ఉద్దానంలో ఎంతో మంది యాక్టర్లు తిరిగినా ఏమీ చేయలేదని, వైఎస్ జగన్ మాత్రమే కిడ్నీ వ్యాధి బాధితులకు అండగా నిలిచారని చెప్పారు. మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు బీసీలను అవమానించారని తెలిపారు. పేదలకు మేలు చేస్తే టీడీపీ ఓర్చుకోలేదని మంత్రి మేరుగ నాగార్జున చెప్పారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ మేనిఫెస్టోలో 98 శాతం హామీలను అమలు చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్ అని అన్నారు. పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి బొత్స, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, పాలవలస విక్రాంత్, నర్తు రామారావు, కుంభా రవిబాబు, లేళ్ల అప్పిరెడ్డి, వరు దు కల్యాణి, ఎమ్మెల్యేలు విశ్వాసరాయి కళావతి, గొర్లె కిరణ్‌కుమార్, రెడ్డి శాంతి, కంబాల జోగులు, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ పాల్గొన్నారు.

సామాజిక సాధికారతతోనే సంక్షేమం సాధ్యం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): సామాజిక సాధికారతతోనే సంక్షేమం సాధ్యమవుతుందని సీఎం జగన్ నిరూపించారని వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలు చెప్పారు. గురువారం నుంచి చేపట్టనున్న 'సామాజిక సాధికారత' బస్సు యాత్రను జిల్లా ఇన్‌చార్జి మంత్రి బొత్స సత్యనారాయణ, ఇతర మంత్రులు, పార్టీ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి తదితరులు శ్రీకాకుళంలో జెండా ఊపి ప్రారంభించారు. వారు మీడియాతో మాట్లాడుతూ.. సీఎం జగన్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలే కాకుండా మరి కొన్ని హామీలు కూడా నెరవేర్చారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి బొత్స చెప్పారు. మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ.. రాష్ట్రంలో 2019 నాటికి పేదరికం 12 శాతం ఉండేదని, ఇప్పుడు 6 శాతానికి తగ్గించామని చెప్పారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ బీసీల సాధికారతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ ఐదుగురు బీసీ ఉప ముఖ్యమంత్రులు, 56 కార్పొరేషన్ చైర్మన్లను నియమించారని గుర్తు చేశారు. సీఎం వైఎస్ జగన్‌కు ప్రజల దీవెనలు ఉండాలని పాలకొండ ఎమ్మెల్యే వి.కళావతి అన్నారు. ఈ సమావేశంలో పార్టీ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి, మంత్రులు ధర్మాన ప్రసాదరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, గొర్లె కిరణ్ కుమార్, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, వరుదు కల్యాణి, కుంభా రవిబాబు, తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలోనే సాధికారత

- తెనాలి సామాజిక సాధికార యాత్ర సభలో మంత్రులు సురేష్, జోగి రమేష్



గుంటూరు జిల్లా తెనాలిలో జరిగిన సభకు హాజరైన జనసందోహంలో ఓ భాగం



తెనాలిలో సామాజిక సాధికార యాత్రలో మంత్రులు, ఎమ్మెల్యేలు తదితరులు

తెనాలి (పట్నంబజారు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, ప్రాంత, రాజకీయ పక్షపాతం లేకుండా ప్రతి పేదవాడి ఇంటి ముంగిటకు సంక్షేమాన్ని తీసుకెళ్లారని మంత్రులు ఆదిమూలపు సురేష్, జోగి రమేష్ చెప్పారు. వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా గురువారం తెనాలిలో జరిగిన బహిరంగ సభలో మంత్రులు మాట్లాడారు. గత ప్రభుత్వ పాలనలో కులాల మధ్య చిచ్చు పెట్టారని, కేవలం ఒక సామాజిక వర్గం, జన్మభూమి కమిటీలు నిర్ణయించిన వారికే పాలన అందించారని మంత్రి సురేష్ తెలిపారు. అణగారిన వర్గాలు, బడుగు, బలహీన వర్గాల పేదలకు పరిపాలనను చేరువ చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలపై ఎన్ని దాడులు చేసిందో అందరికీ అనుభవమేనన్నారు. సీఎంగా జగన్ బాధ్యతలు చేపట్టాక అసమానతలు లేని సమాజాన్ని నిర్మిస్తున్నారని చెప్పారు. జవాబుదారీతనం, పారదర్శకత, అవినీతి లేని పాలన, సమర్థవంతమైన నాయకత్వం నాలుగు స్థంభాలుగా రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్నారన్నారు. 70 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సాధికారత కల్పించారని తెలిపారు. సామాజిక సాధికారత కోసం తాము యాత్ర చేస్తుంటే రిమాండ్ ఖైదీ కోసం భువనేశ్వరి యాత్ర చేస్తున్నారని వ్యాఖ్యానించారు. వైఎస్సార్‌సీపీ అంటే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదల పక్షపాత పార్టీ అని మంత్రి జోగి రమేష్ చెప్పారు. నాలుగున్నరేళ్ల పాలనలో చేసింది చెప్పేందుకే సామాజిక సాధికార యాత్రను చేస్తున్న దమ్మున్న నేత సీఎం జగన్ అని అన్నారు. ఇప్పటివరకు రూ.2.31 లక్షల కోట్లు ప్రజల కోసం ఖర్చుపెట్టిన ఘనత సీఎం జగన్‌దే అని అన్నారు. 2019లో ఓటు వేయని వారు కూడా వైఎస్ జగన్ పరిపాలన చూసి 2024లో ఆయన్ని ముఖ్యమంత్రిని చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో 175 సీట్లకు 175 సీట్లను గెలవబోతున్నామని ధీమా వ్యక్తంచేశారు. సినిమాల్లో హీరోగా ఉండే వ్యక్తి రాజకీయాల్లో కామెడీ యాక్టర్‌గా మారిపోయారని పవన్ కళ్యాణ్‌ను ఉద్దేశించి విమర్శించారు.

కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌ను తట్టుకోలేక టీడీపీ, జనసేన భూస్థాపితం కావడం తథ్యమన్నారు. సచివాలయాలు, వాలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే పాలన చేర్చిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. రాష్ట్రంలో జగనన్న రావడానికి ముందు అన్నీ స్కామ్‌లేనని, జగనన్న వచ్చాక అన్నీ స్కీములేనని, ఇప్పుడు రాష్ట్రం సుభిక్షంగా ఉందని అన్నారు. టీడీపీ మైనార్టీలకు చేసింది ఏమిలేదని చెప్పారు. మాయమాటలతో బీసీల ఓట్లు వేయించుకునే రాజకీయాలకు సీఎం వైఎస్ జగన్ చెల్లు చీటి రాశారని ఎమ్మెల్యే కొలుసు పార్థసారధి చెప్పారు. జన్మభూమి అనే పనికిమాలిన కమిటీల ద్వారా టీడీపీ సిగ్గుమాలిన పాలన చేసిందని, అందుకు భిన్నంగా పరిపాలన అంటే ఎలా ఉండాలో చూపించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని అన్నారు. వైఎస్ జగన్ పాలనలో సామాజిక న్యాయం జరిగిందని, ఇంకా చేస్తానని ఆయన స్పష్టంగా చెబుతున్నారని పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ చెప్పారు. పేదవారి కోసం అనేక సంక్షేమ పథకాలు చేపట్టి అంబేడ్కర్ భావజాలాన్ని, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాలను సీఎం జగన్ ముందుకు తీసుకెళ్తున్నారని ఎమ్మెల్సీ పోతుల సునీత చెప్పారు. సీఎం జగన్ బీసీ సాధికారతను చేతల్లో చూపించారని మాజీ ఎంపీ బుట్ట రేణుక తెలిపారు. తెనాలి నియోజకవర్గంలో సీఎం వైఎస్ జగన్ ఆశీస్సులతో రూ.1,800 కోట్ల తో సంక్షేమం, అభివృద్ధి పనులు చేసినట్లు ఎమ్మెల్యే అన్నాబత్తుని చెప్పారు. దేశ చరిత్రలో 30 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఎంపీ ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యేలు రోశయ్య, షేక్ మహ్మద్ ముస్తాఫా, జెడ్పీ చైర్‌పర్సన్ హెన్రీ క్రిస్టినా పాల్గొన్నారు.

సామాజిక సాధికార రణభేరి ఇది

తెనాలి: దేశంలో ఏ రాష్ట్రంలో, ఏ సీఎం చేయని విధంగా రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ సామాజిక న్యాయాన్ని నెలకొల్పారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ చెప్పారు. సీఎం వైఎస్ జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రజలంతా రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా తలెత్తుకొని తిరిగేలా చేశారని తెలిపారు. కులాలు, మతాలు, పార్టీలు, జెండాలు, అజెండాలు లేకుండా అందరం మనసున్న జగనన్న బాటలోనే నడుస్తామని చెప్పారు. ఇది సామాజిక సాధికార రణభేరి అని, సీఎం వైఎస్ జగన్ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు మంచి జరిగింది కాబట్టే, సీఎం వైఎస్ జగన్‌ను ఆశీర్వదించమని కోరుతున్నామని అన్నారు. వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార యాత్ర గురువారం తెనాలి నియోజకవర్గంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నేతృత్వంలో ప్రారంభమైంది. కొలకలూరు బాపయ్యపేట వద్ద మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు పార్టీ వర్గాలు ఘనంగా స్వాగతం పలికాయి. అక్కడే కుండల తయారీలో ఉన్న శాలివాహనులను పలకరించిన అనంతరం మంత్రులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వికేంద్రీకరణ మంత్రంతో గత నాలుగున్నరేళ్లలో రాష్ట్రంలో 3.5 కోట్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రజలకు సాధికారత చేకూరిన విధానాన్ని ప్రజలకు వివరించి, వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాలని ప్రజలను ధైర్యంగా కోరతామని మంత్రి ఆదిమూలపు సురేష్ చెప్పారు. వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్, మాజీ ఎంపీ బుట్టా రేణుక, ఎమ్మెల్యేలు హఫీజ్‌ఖాన్, ముస్తాఫా, కొలుసు పార్థసారథి, ఎమ్మెల్సీలు పోతుల సునీత, కల్పలతారెడ్డి పాల్గొన్నారు.

మన బిడ్డల భవిష్యత్ కోసం జగన్ కావాలి

సామాజిక సాధికార యాత్రలో మంత్రులు, నేతలు

చదువుకునే పిల్లలందరికీ జగన్ మేనమామ అయ్యారు

- అవ్వా తాతలను మనవడిలా నడిపిస్తున్నారు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలను రాజ్యాధికారం వైపు నడిపించిన చరిత్ర జగన్‌దే
- భారీ జనసందోహం మధ్య బుక్కరాయసముద్రంలో బహిరంగ సభ



అనంతపురం జిల్లా శింగనమలలో జరిగిన సామాజిక సాధికార యాత్ర సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, వైఎస్సార్‌సీపీ నేతలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: 'ఇన్నేళ్లూ ప్రభుత్వాలన్నీ ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ వర్గాలను ఓటు బ్యాంకుగానే చూశాయి. వాడుకుని వదిలేశాయి. కానీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక మన బిడ్డలకు ఇంగ్లిష్ చదువులు చెబుతున్నారు. వారి రక్షణకు భరోసా కల్పిస్తున్నారు, అక్కచెల్లెమ్మలకు చేయూతనిస్తున్నారు. అవ్వా తాతలను మనవడిలా వెంట ఉండి నడిపిస్తున్నాడు. మన బిడ్డల ఉన్నత చదువులకు, వారి భవిష్యత్‌కు మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉంది'' అని పలువురు మంత్రులు, వైఎస్సార్‌సీపీ నేతలు చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో చేపట్టిన సామాజిక సాధికార యాత్ర గురువారం భారీ జన సందోహంమధ్య పార్టీ రీజనల్ కోఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గంలో సాగింది. సాయంత్రం 5 గంటలకు బుక్కరాయ సముద్రం సభా వేదిక వద్దకు చేరుకుంది.

సాధికారత అంటే ఏంటో చేసి చూపించారు: మంత్రి ఉషశ్రీ

సామాజిక సాధికారత అంటే ఏమిటో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేసి చూపించారని స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ చెప్పారు. మహిళా సాధికారత కోసం రూ.25 వేల కోట్లు వెచ్చించారని తెలిపారు. జనరంజక పాలన అందించారని, ప్రతి ఎమ్మెల్యే కూడా ఆయన పేరు చెప్పుకుని గర్విస్తున్నామన్నారు.

కేబినెట్‌లో పదకొండు మంది బీసీ మంత్రులు: అంజాద్ బాషా

సీట్లు, ఓట్లతో పాటు మంత్రి పదవులు, ఇతర పదవుల్లోనూ సామాజిక న్యాయం కల్పించిన సీఎం జగన్ అన్ని వర్గాలకు రాజ్యాధికారం ఇచ్చారని ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా చెప్పారు. జగన్ హయాంలో 11 మంది బీసీలు, ఐదుగురు ఎస్సీలు మంత్రులయ్యారన్నారు. 2024లో పేదలకు–పెత్తందార్లకు మధ్య కురుక్షేత్ర సంగ్రామం జరుగుతోందని, పేదల పక్షాన మనందరం జగన్‌కు ఓటేసి గెలిపించుకోవాలని చెప్పారు.

స్వాతంత్ర్యం ఇప్పుడే వచ్చింది: మంత్రి జయరాం

భారత స్వాతంత్ర్య చరిత్రలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీలకు ఇప్పుడే అసలు సిసలు స్వాతంత్ర్యం వచ్చిందని కార్మిక శాఖ మంత్రి జి.జయరాం చెప్పారు. పదవుల్లో, ఉద్యోగాల్లో, సంక్షేమ పథకాల లబ్ధిలో అన్నింటా స్వేచ్ఛ వచ్చిందన్నారు. పల్లెల్లో ప్రతి తల్లి, ప్రతి తండ్రీ జగన్‌ను కొడుకుగా భావిస్తున్నారని, చదువుకునే చిన్నారులతో మేనమామగా పిలిపించుకుంటున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్ అని తెలిపారు.


ఎస్సీలకు మేలు జరగకుండా బాబు అడ్డుకున్నారు: ఎంపీ సురేష్

ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అమరావతి ప్రాంతంలో ఇళ్ల స్థలాలు ఇస్తే మురికివాడ అవుతుందని చంద్రబాబు కోర్టుల్లో కేసులు వేయించి అడ్డుకొన్నారని బాపట్ల ఎంపీ నందిగం సురేష్ చెప్పారు. పేదలందరికీ ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా వైద్యం అందిస్తున్న ఘనత వైఎస్ జగన్‌దేనని అన్నారు. 14 ఏళ్ల సీఎం అనుభవం నలభై ఏళ్ల కుర్రాడి ముందు వెలవెల పోయిందని అన్నారు.

శింగనమల సెంటిమెంటు పనిచేస్తుంది: జొన్నలగడ్డ

శింగనమల నియోజకవర్గంలో ఎవరు గెలిస్తే ఆ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందని, మీరందరూ ఇక్కడ మళ్లీ వైఎస్సార్‌సీపీకి ఓటేసి జగన్‌ను సీఎం చెయ్యాలని శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి కోరారు. నియోజకవర్గంలో 40 చెరువులను లోకలైజ్ చేసి రైతులకు జగన్ అండగా నిలిచారని, ఈ నియోజకవర్గంపై ఆయనకు ప్రత్యేక ప్రేమ ఉందన్నారు. జగన్ అన్నట్టు 175కు 175 సీట్లు సాధ్యమే అని తెలిపారు. ఈ యాత్రలో ఎంపీలు తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, సిద్దారెడ్డి, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, వై.వెంకట్రామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఎమ్మెల్సీలు శివరామిరెడ్డి, మంగమ్మ, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహ్మద్, బీసీ సెల్ రీజనల్ కోఆర్డినేటర్ బీసీ రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

1న ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం



ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించనున్న సీఎం జగన్

- పోలీసుల గౌరవ వందనం అనంతరం అమరజీవికి నివాళి
- రాజ్‌భవన్ వేడుకల్లో పాల్గొననున్న గవర్నర్
- రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించాలని కలెక్టర్లు, ఎస్పీలకు ఆదేశాలు
- తెలుగు సంస్కృతిని ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు
- సాధారణ పరిపాలన శాఖ (రాజకీయ) ముఖ్యకార్యదర్శి ముత్యాలరాజు ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నవంబర్ 1న రాష్ట్ర ఉత్సవంగా ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ వేడుకల్లో పాల్గొంటారు. ఉ.10 గంటలకు ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తారు. అలాగే, రాజ్‌భవన్‌లో జరిగే ఈ వేడుకల్లో గవర్నర్ పాల్గొంటారు. ఇందుకోసం ఏర్పాట్లుచేయాల్సిందిగా సంబంధిత శాఖలను సాధారణ పరిపాలన శాఖ (రాజకీయ) ముఖ్య కార్యదర్శి ముత్యాలరాజు గురువారం ఆదేశించారు. ముఖ్యమంత్రి, గవర్నర్ ప్రసంగాలకు సంబంధించి ప్రొటోకాల్ విభాగం, సమాచార పౌర సంబంధాల శాఖ సమన్వయంతో పనిచేయాలని అందులో పేర్కొన్నారు. అలాగే, అన్ని జిల్లా కేంద్రాల్లో రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని రాష్ట్ర ఉత్సవంగా ఘనంగా నిర్వహించేందుకూ చర్యలు తీసుకోవాల్సిందిగా కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడంతో పాటు అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించడం, తెలుగు సంస్కృతి ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఢిల్లీలోని ఏపీ భవన్‌లో కూడా ఈ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ముత్యాలరాజు ఆదేశించారు.

ఉత్సవాలను అటకెక్కించిన టీడీపీ సర్కార్

నిజానికి.. రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాలను గత చంద్రబాబు ప్రభుత్వం అటకెక్కించింది. ఈ వేడుకలను నవంబర్ 1వ తేదీనే నిర్వహించాలని, తద్వారా ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ ఇమేజ్ పరిరక్షించినట్లవుతుందని కేంద్ర ప్రభుత్వం స్పష్టంగా చెప్పినప్పటికీ అప్పట్లో పట్టించుకోలేదు. అయితే, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 నుంచి నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని రాష్ట్ర పండుగగా ఘనంగా నిర్వహిస్తున్నారు.

క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్స్‌లో హైదరాబాద్ ఐఎస్‌బీకి 78వ ర్యాంకు



టాప్-50లో నిలిచిన ఐఐఎం-బెంగళూరు

సాక్షి, న్యూఢిల్లీ: ప్రపంచ దేశాల్లోని అగ్రశ్రేణి మేనేజ్‌మెంట్ కాలేజీల జాబితాతో కూడిన క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్-2024లో హైదరాబాద్‌కు చెందిన ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) సత్తా చాటింది. ప్రపంచ టాప్-100 బి-స్కూల్స్ ర్యాంకుల్లో 78వ స్థానంలో నిలిచింది. ఈ జాబితాలో ఐఐఎం-బెంగళూరు 48వ ర్యాంకుతో టాప్-50లో చోటు సంపాదించగా ఐఐఎం-అహ్మదాబాద్ 53వ ర్యాంకు, ఐఐఎం-కలకత్తా 59వ ర్యాంకు సాధించాయి. గతేడాది విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లోనూ టాప్-100లో ఈ నాలుగే ఉండటం విశేషం. ఇండోర్, ఉదయ్‌పూర్, లక్నో ఐఐఎంలు 150-200 ర్యాంకింగ్స్ మధ్య నిలవగా ఢిల్లీ, గుర్గావ్ ఐఐఎంలు 200-250 ర్యాంకుల మధ్య నిలిచాయి. అమెరికాకు చెందిన స్టాన్‌ఫోర్డ్ గ్రాడ్యుయేట్ బిజినెస్ స్కూల్ తొలి స్థానంలో నిలిచింది.

డ్రైవర్ నిద్రమత్తు, పొగమంచు.. ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు..

13 మంది అక్కడికక్కడే దుర్మరణం

- కర్ణాటకలోని చిక్కబళ్లాపూర్ వద్ద ఘటన
- మృతుల్లో శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన 10 మంది.. కర్ణాటక వాసులు ముగ్గురు



లారీని ఢీకొట్టిన కారు

సాక్షి, పుట్టపర్తి/చిక్కబళ్లాపూర్/సాక్షి, అమరావతి: విజయదశమి పండగ తాలూకు ఆనందం వారి మోముల్లో ఇంకా చెక్కు చెదరలేదు. అంతలోనే మృత్యువు వారిని కబళించింది. ఏకంగా 13 మందిని పొట్టనబెట్టుకుంది. మృతుల్లో 10 మంది శ్రీసత్యసాయి జిల్లా వాసులు కాగా, మరో ముగ్గురు కర్ణాటకకు చెందినవారు. శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల, పెనుకొండ, ఓడీ చెరువు, కొత్తచెరువు మండలాలకు చెందిన వారు బెంగళూరులో కూలి పనులు, ఉద్యోగాలు చేస్తున్నారు. విజయదశమి సందర్భంగా సొంతూళ్లకు వచ్చి తిరిగి బెంగళూరు వెళుతున్నారు. అలాగే కర్ణాటకకు చెందిన వారు కూడా బంధువుల ఇంట శుభకార్యానికి వచ్చి తిరిగి వెళుతున్నారు. మొత్తం 13 మంది(డ్రైవర్‌తో కలిపి) గురువారం తెల్లవారు జామున శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల నుంచి టాటా సుమోలో బయలుదేరారు. ఉదయం 6.30 గంటల సమయంలో కర్ణాటకలోని చిక్కబళ్లాపూర్ వద్ద ఆగి ఉన్న లారీ(ట్యాంకర్)ను వీరి వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 13 మంది అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. విషయం తెలుసుకున్న చిక్కబళ్లాపూర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను బయటకు తీసి చిక్కబళ్లాపూర్ ఆస్పత్రికి తరలించారు. మృతుల బంధువుల ఆర్తనాదాలతో ఆస్పత్రి ప్రాంగణం మార్మోగిపోయింది. కాగా, నాగాలాండ్ రిజిస్ట్రేషన్ ఉన్న లారీ డ్రైవర్ దానిని అక్కడే నిలిపి పరారయ్యాడు. కారు డ్రైవర్ నిద్రమత్తుతో పాటు పొగమంచు ఆవరించడంతో దుర్ఘటన జరిగినట్టు పోలీసులు తెలిపారు. మృతుల్లో గోరంట్ల మండలం వానవోలుకు చెందిన బోయ వెంకటాద్రి(27), ఆయన భార్య లక్ష్మి(23), కలిగిరి గ్రామానికి చెందిన హరిజన నరసింహులు(45), కొత్తచెరువు మండలం గోరంట్లపల్లికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ పవన్‌కుమార్(32), ఓడీ చెరువు మండలం నవాబుకోటకు చెందిన వెంకటనారాయణ(51), ఆయన భార్య వెంకట సుబ్బమ్మ(48), మలకవారిపల్లికి చెందిన నారాయణప్ప(50), పెనుకొండ మండలం గోనిపెంటకు చెందిన గొల్ల శాంతమ్మ(37), గొల్ల రాజవర్దన్(15), చిలమత్తూరు మండలం మరువపల్లికి చెందిన గొల్ల గణేశ్(17), కర్ణాటకలోని మరగనిగుంటకు చెందిన మంగళమూర్తి(37), బెంగళూరుకు చెందిన నేసే అరుణ(38), ఆమె కుమారుడు రుత్విక్ సాయి(7) ఉన్నారు. మృతుల కుటుంబాలను ఆస్పత్రిలో స్థానిక ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్, పెనుకొండ ఎమ్మెల్యే శంకర నారాయణ పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ఆర్థిక సాయం అందించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబాలకు అప్పగించారు. ఈ మేరకు చిక్కబళ్లాపూర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గవర్నర్ దిగ్భ్రాంతి

కర్ణాటక చిక్కబళ్లాపూర్ రోడ్డు ప్రమాదంలో ఏపీ వాసుల మృతిపై రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు గవర్నర్ కార్యాలయం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. సత్యసాయి జిల్లా గోరంట్ల మండలానికి చెందిన కూలీలు ప్రయాణిస్తున్న వాహనం ట్యాంకర్‌ను ఢీకొట్టడంతో 13 మంది మృతి చెందడం తనను వేదనకు గురి చేసిందని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండ: సీఎం

కర్ణాటకలోని చిక్కబళ్లాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సత్యసాయి జిల్లాకు చెందినవారు దుర్మరణం చెందడంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ ఘటన తనను ఎంతో కలచివేసిందంటూ ట్వీట్ చేశారు. 'మృతిచెందిన వారి ఆత్మలకు శాంతి కలగాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. బాధిత కుటుంబాలకు మన ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుంది' అంటూ గురువారం సీఎం జగన్ ట్వీట్‌లో పేర్కొన్నారు.

సీఎం జగన్ కలలు సాకారమవుతున్న వేళ..

ఫీజ్ రీయింబర్స్‌మెంట్‌తో చదువుకున్న 9 మందికి అమెజాన్‌లో కొలువు



ఎంపికైన విద్యార్థులతో లావు రత్తయ్య, కృష్ణదేవరాయలు

అగనంపూడి (గాజువాక): ప్రతీ పేదింటి బిడ్డ ఉన్నత చదువుల్లో రాణించాలని.. ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని సీఎం జగన్ తపన..ఆరాటం సఫలీకృతమవుతుండటం సంతోషంగా ఉందని విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు కృష్ణదేవరాయలు అన్నారు. అమెజాన్ ప్రాంగణ ఎంపిక ప్రక్రియలో ఎంపికైన 13 మందిలో 9 మంది విద్యార్థులు ఫీజ్ రీయింబర్స్‌మెంట్‌తో చదువుకున్నట్లు తెలిపారు. వీరికి వార్షిక వేతనం రూ.26 లక్షలు అని చెప్పారు. వీరితో పాటు మరో 13 మంది కూడా 3 సంస్థల్లో ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. ఒకరు రూ.12 లక్షల వార్షిక వేతనం, 12 మందికి రూ.10 లక్షల ప్యాకేజీతో దేవరెవ క్లౌడ్ ఇండియా, ఇన్ఫిర్క్స్, ఎటర్నల్ రోబోటిక్స్ సంస్థల్లో ఉద్యోగాలు పొందినట్లు వివరించారు. కళాశాలలో చేరిన తొలి ఏడాది నుంచి విలువలతో కూడిన విద్యతో పాటు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ కోసం ప్రత్యేక శిక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. సాఫ్ట్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్, కోడింగ్ స్కిల్స్‌తోపాటు విద్యార్థులను మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంచడటంతోపాటు నైతిక విలువలూ పెంపొందిస్తున్నామని చెప్పారు. విజ్ఞాన్ సీఈవో ఎస్.శ్రీకాంత్ పాల్గొన్నారు.

కార్వీ కేసులో రూ.134.02 కోట్ల షేర్లు జప్తు

సాక్షి, హైదరాబాద్: కార్వీ స్టాక్ బ్రోకింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారుల జప్తుల పర్వం కొనసాగుతోంది. కార్వీ స్టాక్ బ్రోకింగ్ సంస్థ ఎండీ పార్థసారథి కుమారుడు అదిరాజ్ పార్థసారథి పేరిట ఉన్న రూ.134.02 కోట్ల విలువైన వెయ్యి నాన్ కన్వెర్టబుల్ రీడీమబుల్ షేర్లను ఈడీ అధికారులు గురువారం జప్తు చేశారు. తాజాగా చేసిన జప్తుతో కలిపి ఈ కేసులో ఇప్పటి వరకు జప్తు చేసిన ఆస్తుల విలువ రూ.2,229.56 కోట్లకు చేరింది. ఈ మేరకు ఈడీ గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. కార్వీ సీఎండీ సి.పార్థసారథి నిబంధనలకు విరుద్ధంగా తన కుమారుడు అదిరాజ్ పార్థసారథికి చెందిన కేఫిన్ టెక్నాలజీస్ లిమిటెడ్‌కు షేర్ల కొనుగోలు రూపంలో నిధులు మళ్లించినట్టు ఈడీ అధికారుల దర్యాప్తులో తేలింది. ఈ మొత్తం అవకతవలకు సంబంధించిన ఆధారాలు సేకరించిన ఈడీ అధికారులు రూ.134.02 కోట్ల విలువైన నాన్ కన్వెర్టబుల్ రీడీమబుల్ షేర్లను జప్తు చేశారు.

దయతో చేసిన పనులన్నీ దాతృత్వానికి సమానమైనవే.
మీకు చెడు చేసిన వారి పట్ల కూడా దయ కలిగి ఉండండి.
– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 27 అక్టోబర్ 2023

చైనా కొత్త ఎత్తులు

ప్రపంచమంతా కొత్తగా రాజుకున్న ఇజ్రాయెల్ – గాజా లడాయిపై దృష్టి కేంద్రీకరిస్తున్న తరుణంలో చడీచప్పుడూ లేకుండా చైనా పావులు కదిపింది. మన సన్నిహిత దేశాలైన భూటాన్, శ్రీలంకలతో ఒప్పందాలు కుదుర్చుకుని మనల్ని ఇరకాటంలో పడేసింది. చైనాలో పర్యటించిన భూటాన్ విదేశాంగమంత్రి తాండీ దోర్జీతో చైనా ఉప విదేశాంగమంత్రి సన్ వీ డాంగ్ సంప్రదింపులు జరిపి ఇరుదేశాల సరిహద్దు వివాదాన్నీ పరిష్కరించుకోవటానికి ఉమ్మడి సాంకేతిక నిపుణుల బృందం ఏర్పాటుకు అవగాహన కుదుర్చుకున్నారు. రెండు దేశాల మధ్యా దౌత్యసంబంధాలు ఏర్పాటుచేసుకోవాలని కూడా నిర్ణయించుకున్నారు. అటు శ్రీలంక అధ్యక్షుడు విక్రమసింఘే కూడా చైనా సందర్శించి ఆ దేశం తలపెట్టిన బృహత్తర ప్రాజెక్టు బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ (బీఆర్ఐ)లో తమ దేశం పాలుపంచుకుంటుందని ప్రకటించారు. ఇందుకు సంబంధించిన అవగాహన ఒప్పందంపై త్వరలో సంతకాలవుతాయని సంయుక్త ప్రకటనలో తెలిపారు. భూటాన్, శ్రీలంక రెండూ సార్వభౌమాధికారం వున్న దేశాలు. తమ ప్రయోజనాలకు తగినట్టు అవి నిర్ణయాలు తీసుకుంటాయి. కానీ ఆ ఒప్పందాల పర్యవసానాలు భారత్ భద్రతతో ముడిపడివుండటం మనల్ని కలవరపరిచే అంశం.

శ్రీలంక మాటెలావున్నా భూటాన్‌తో మనకు ప్రత్యేక అనుబంధం వుంది. 2007 వరకూ భూటాన్‌తో వున్న స్నేహ ఒడంబడిక ప్రకారం మన దేశం ఆమోదించిన 21 దేశాలతో మాత్రమే అది దౌత్య సంబంధాలు ఏర్పర్చుకునేది. యూపీఏ హయాంలో ఈ ఒప్పందం గడువు ముగిసినా మన దేశం చొరవ తీసుకోకపోవటం, ఈలోగా ఆ ఒప్పందం కింద భూటాన్‌కి అప్పటివరకూ ఇచ్చే సబ్సిడీలు ఆగిపోవటం సమస్యలకు దారితీసింది. ఆ దేశంలో ఒక్కసారిగా నిత్యావసర సరుకుల ధరలు పెరిగి పోయాయి. వాస్తవానికి భూటాన్ ఉత్తర సరిహద్దులో వున్న చంబీలోయ ప్రాంతాన్ని తమకు ధారాదత్తం చేయమని చైనా కోరినా అది భారత్ భద్రతకు సమస్యలు తెచ్చిపెడుతుందన్న ఏకైక కారణంతో భూటాన్ తిరస్కరించింది. 2005లో భూటాన్ రాజు ఐచ్ఛికంగా రాచరిక ఆధిపత్యాన్ని వదులుకుని రాజ్యాంగబద్ధ పాలనకు బాటలు పరిచారు. అటు తర్వాత నుంచి భూటాన్ ఆలోచన మారింది. దేశానికి గరిష్ఠంగా మేలు చేసే విదేశాంగ విధానం అనుసరించాలన్న అభిప్రాయం బలపడింది. అలాగని 2017లో డోక్లామ్‌లో చైనాతో వివాదం తలెత్తినప్పుడు భూటాన్ మన సాయమే తీసుకుంది. అయితే మన దేశం మరింత సాన్నిహిత్యంగా మెలిగివుంటే అది చైనా వైపు చూసేది కాదు. డోక్లామ్‌కు దగ్గరలో చైనా భూగర్భ గిడ్డంగుల్ని నిర్మిస్తోందని అమెరికా రక్షణ విభాగం పెంటగాన్ మన దేశాన్ని నిరుడు హెచ్చరించింది. అలాగే అక్కడికి సమీపంలో ఒకటి రెండు గ్రామాలను సృష్టించి ప్రజలను తరలించిందన్న వార్తలొచ్చాయి. డోక్లామ్ ప్రాంతం భారత్–భూటాన్– చైనా సరిహద్దుల కూడలి. అలాంటిచోట చైనా రోడ్డు నిర్మాణానికి పూనుకోవటం వల్ల 2017లో వివాదం తలెత్తింది. మన దేశం గట్టిగా అభ్యంతరాలు తెలపటంతో చైనా వెనక్కు తగ్గింది. కానీ ఆనాటి నుంచీ భూటాన్‌ను బుజ్జగించే ప్రయత్నాలు అది చేస్తూనేవుంది. ఒకపక్క మనతో వాస్తవాధీన రేఖ వద్ద ఏర్పడ్డ వివాదాల పరిష్కారానికి ఏ మాత్రం సిద్ధపడకుండా, చర్చల పేరుతో కాలయాపన భూటాన్‌తో మాత్రం సన్నిహితం కావటానికి చైనా ప్రయత్నించటంలోని ఉద్దేశాలు గ్రహించటం పెద్ద కష్టం కాదు.

ఇటు శ్రీలంక సైతం మన అభ్యంతరాలను బేఖాతరు చేసి బీఆర్ఐ ప్రాజెక్టులో పాలుపంచుకునేందుకే నిర్ణయించుకుంది. ఇందుకు సంబంధించిన ఒప్పందాన్ని ఖరారు చేసుకునేందుకు ఇరుపక్షాలూ అంగీకరించాయి. హిందూ మహా సముద్ర ప్రాంతంలో మనల్ని దెబ్బతీసేందుకు మనకు సన్నిహితంగా వుండే దేశాలను రుణాలతో, భారీ ప్రాజెక్టులతో తనవైపు తిప్పుకునే చైనా ప్రయత్నాలు ఈనాటివి కాదు. భారీ నౌకాశ్రయాలు, రహదారులు, విమానాశ్రయాలు నిర్మించేందుకు తమ ఎగ్జిమ్ బ్యాంకు ద్వారా చైనా అందించిన రుణాలు లంకను కుంగదీశాయి. విదేశీ మారకద్రవ్యం నిల్వలు చూస్తుండగానే అడుగంటాయి. దేశ ఆర్థిక వ్యవస్థ గుల్లయింది. ధరలు పెరిగిపోవటం, నిత్యావసరాల కొరత ఏర్పడటం పర్యవసానంగా నిరుడు తీవ్ర నిరసనలు పెల్లుబికి రాజపక్స సోదరులు, వారి కుటుంబసభ్యులు దేశం విడిచి పారిపోవాల్సి వచ్చింది. ఆ సమయంలో మన దేశం శ్రీలంకకు తక్షణ ఆర్థిక సాయం అందించి ఆదుకుంది. బీఆర్ఐ ప్రాజెక్టుకు అంగీకరించి, చైనా ఇస్తున్న రుణాలకు ఆమోదముద్ర వేస్తే పరిస్థితి మళ్లీ మొదటికొస్తుందని ఈనెల 11న కొలంబోలో జరిగిన హిందూ మహాసముద్ర ప్రాంత దేశాల సదస్సు సందర్భంగా మన విదేశాంగమంత్రి జైశంకర్ హెచ్చరించారు.

నిరుడు దేశంలో సంక్షోభం తలెత్తినప్పుడు అమెరికా, బ్రిటన్, జర్మనీ, ఆస్ట్రేలియా తదితర 20 దేశాలున్న పారిస్ క్లబ్‌తో పాటు మన దేశం కూడా శ్రీలంకకు ఒక షరతు పెట్టింది. రుణాల చెల్లింపులో ఒకే విధమైన నిబంధనలు అనుసరించాలని, ద్వైపాక్షిక ఒప్పందం పేరుతో ఎవరికీ వెసులుబాటు ఇవ్వరాదని తెలిపాయి. అయినా చైనా విషయంలో అందుకు భిన్నమైన మార్గాన్ని శ్రీలంక ఎంచుకుంది. ఇలాంటి పరిస్థితుల్లో మన దేశం జాగ్రత్తగా అడుగులేయాలి. మన వ్యూహాత్మక ప్రయోజనాలను దెబ్బతీసే రీతిలో చైనాతో ఒప్పందాలు కుదుర్చుకొనరాదని శ్రీలంక, భూటాన్‌లకు నచ్చజెప్పాలి. ఏ కారణాలు వారిని చైనా వైపు మొగ్గు చూపేందుకు దారితీస్తున్నాయో గ్రహించి మనవైపు ఏమైనా లోటుపాట్లుంటే సరిదిద్దుకోవాలి. సకాలంలో సరైన కార్యాచరణకు పూనుకుంటే మనకు సానుకూల వాతావరణం ఏర్పడటం పెద్ద కష్టం కాదు.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు
ఆశ్వయుజ మాసం, **తిథి:** శు.చతుర్దశి రా.3.44 వరకు, తదుపరి పౌర్ణమి, **నక్షత్రం:** ఉత్తరాభాద్ర ఉ.9.16 వరకు, తదుపరి రేవతి, **వర్జ్యం:** రా.8.36 నుండి 10.08 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.16 నుండి 9.04 వరకు తదుపరి ప.12.07 నుండి 12.54 వరకు, **అమృతఘడియలు:** తె.5.40 నుండి 6.02 వరకు (తెల్లవారితే శనివారం).

సూర్యోదయం: 6.00
సూర్యాస్తమయం: 5.29
రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం: ప.3.00 నుండి 4.30 వరకు

సామూహిక శిక్షగా మారిన యుద్ధం

విశ్లేషణ



మనోజ్ జోషీ

పశ్చిమాసియా ప్రాంతపు ప్రస్తుత నిత్యాగ్నిహోత్రాన్ని డాంబికాల మధ్య జరుగుతున్న యుద్ధం అని అంటే అతిశయోక్తేమీ కాదు. గాజాలో హమాస్‌ను కట్టడి చేశామని తమకు తాము సర్ది చెప్పుకునే ఇజ్రాయెలీలు ఒకవైపు.. ఇజ్రాయెల్‌తో వివిధ అరబ్ దేశాల సంబంధాలు సాధారణ స్థితికి వస్తే – అది కూడా పాలస్తీనా అంశంతో సంబంధం లేకుండా జరిగిపోతే – ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ రాజకీయాలకు అక్కరకొస్తుందని అమెరికన్లు మరోవైపు భావిస్తున్నారు. కానీ నిత్య నిరాశావాది, స్వప్రయోజనాలే మిన్న అనుకునే నెతన్యాహూ రాజకీయాలు ఇజ్రాయెల్ ప్రయోజనాలను దెబ్బ తీశాయనడంలో సందేహం లేదు. ఒకరకంగా ఆయన హమాస్ ఆటలో పావు అయ్యారని చెప్పవచ్చు. ఇజ్రాయెల్‌కున్న ఆత్మరక్షణ హక్కును ఎవరూ కాదనరు. కానీ ప్రజలను నిర్బంధంలో ఉంచడం, ప్రాథమిక అవసరాలు కూడా తీరకుండా చేయడం 'సామూహిక శిక్ష' కిందకు వస్తుంది.

అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై జరిగిన హమాస్ ఉగ్రవాదుల దాడి యూదుల చరిత్రలోనే తీవ్రమైనదని అందరూ అంగీకరిస్తున్నారు. ఇజ్రాయెల్ ఇప్పుడు ఆ దాడికి ప్రతీకారం తీర్చుకుంటోంది. గాజా స్ట్రిప్‌కు నీరు, విద్యుత్తు, ఆహారం అన్నింటిని బంద్ చేసింది. పైగా ఆ ప్రాంతంపై బాంబుల వర్షం కురిపిస్తోంది. ఇందులో కొన్ని జిల్లాలకు జిల్లాలు నేలమట్టమై పోయాయి. అయితే చర్యల ద్వారా హమాస్‌ను గాజా స్ట్రిప్ నుంచి ఎలా తీసివేస్తారన్నది ప్రశ్నార్థకంగా నిలుస్తోంది. ఉగ్రవాదులను ఎదుర్కొనే విషయంలో ఇజ్రాయెల్ ప్రణాళికలు మొత్తం బెడిసికొడుతూండగా ప్రస్తుతం అది కొత్త, విచిత్రమైన పరిస్థితులను ఎదుర్కొంటోంది. ఇజ్రాయెల్ ఇకనైనా కొంచెం ఆచి తూచి ముందడుగు వేయాలని మిత్రదేశాలే సూచిస్తూండటం ఇందుకు నిదర్శనం.

అమెరికాకు అనుభవమే

ప్రస్తుతం ఇజ్రాయెల్ ఎదుర్కొంటున్న పరిస్థితికి, సెప్టెంబరు 11న అల్‌ఖైదా ఉగ్రవాదుల దాడి తరువాత అమెరికా ఎదుర్కొంటున్న పరిస్థితికి సారూప్యం కనిపిస్తుంది. అప్పట్లో అమెరికా గ్లోబల్ వార్ ఆన్ టెర్రరిజమ్‌ను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ మహా యుద్ధాన్ని ఒక్కసారి సమీక్షిస్తే అమెరికా అఫ్గానిస్తాన్‌లో యుద్ధాన్ని కోరుకుందని, అదే సమయంలో ఇరాక్‌తో యుద్ధాన్ని ఎంచుకుందని చెప్పాల్సి వస్తుంది. రెండూ అమెరికాకు తలనొప్పి మిగిల్చిన మాటైతే నిజం. బాధితులు అఫ్గానిస్తాన్, ఇరాక్ ప్రజలు మాత్రమే. ఇప్పుడు ఇజ్రాయెల్ నేతలు కూడా ప్రజల బాధలు పట్టించుకునే స్థితిలో కనిపించడం లేదు. గాజాను సమూలంగా నేలమట్టం చేశాక, దాంతో సంబంధాలన్నీ తెంచేస్తామని ఇజ్రాయెలీ జనరళ్లు చెబుతున్నారు. అయినా సరే.. ఇజ్రాయెల్ పొరుగునే 20 లక్షల మంది బాధతప్త జనాభా ఉంటుంది. ఏదో ఒక ప్రాంతాన్ని మిలటరీ చర్యలకు అతీతంగా ఉంచినా సరే.

ఇజ్రాయెల్ ఏర్పాటు ఐక్యరాజ్య సమితి తీర్మానం ద్వారా జరిగింది. అప్పటి నుంచి ఇప్పటివరకూ కూడా ఆ ప్రాంతం నుంచి వెళ్లగొట్టబడిన వారి శాపనార్థాలు ఇజ్రాయెల్‌కు తగులుతూనే ఉన్నాయి. దశాబ్దాలుగా అసమ్మతిని, వ్యతిరేకతను అణచివేసేందుకు సైనిక చర్యలనే ఆసరాగా చేసుకుంది ఇజ్రాయెల్. రహస్య గూఢచార వ్యవస్థ సాయంతో దాడులను ముందస్తుగా అణచివేస్తోందనీ అంటారు.

ఇజ్రాయెల్ తన భద్రత చర్యల్లో భాగంగా 1967లో వెస్ట్‌బ్యాంక్, గాజాస్ట్రిప్‌లలోని కొంత ప్రాంతాన్ని ఆక్రమించింది కూడా. ఈ ప్రాంతాల్లో ఇజ్రాయెల్ ఏర్పాటు కారణంగా నిర్వాసితులైన పాలస్తీనియన్లు ఎక్కువగా ఉంటారు. అంటే బలవంతంగా తమ ఇళ్ల నుంచి గెంటివేయబడిన వారన్నమాట. ఈ రకమైన చర్యలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఎలాగైతే ఉగ్రవాదాన్ని తమ ప్రతిచర్యగా హమాస్ ఎంచుకుందో.. అలాగే ఇజ్రాయెల్ కూడా పాలస్తీనియన్లను వారి స్వస్థలాల నుంచి తరిమేయడాన్ని ఒక పనిగా పెట్టుకుంది. సరిహద్దుల్లో సవాళ్లను ఎదుర్కొంటున్న ఇజ్రాయెల్ వాటిని ఎదుర్కొనేందుకు పాలస్తీనా మొత్తమ్మీద శక్తిమంతమైన గూఢచార వ్యవస్థను, వేగులు, ఏజెంట్లను ఏర్పాటు చేసుకుంది. ఈ నెట్‌వర్క్ అరబ్ దేశాలతోపాటు ఇరాన్ వరకూ వ్యాపించి ఉంది. గాజా చుట్టూ దుర్భేద్యమైన అత్యాధునిక ఏర్పాట్లు చేసుకున్నా హమాస్ ఇటీవల జరిపిన దాడి ఇజ్రాయెల్ శక్తియుక్తులను తక్కువ చేసి చూపుతోంది.



ఇజ్రాయెల్ ముట్టడిలో గాజా నగరం

పోటాపోటీగా హమాస్

పాలస్తీనాపై 38 ఏళ్ల ఆక్రమణ ముగిసిన రెండేళ్లకు అంటే 2005లోనే హమాస్ సరిహద్దుల వెంబడి 45 కిలోమీటర్ల పొడవైన ప్రాంతాన్ని తన ఆధీనంలోకి తెచ్చుకుంది. అప్పటి నుంచి ఇజ్రాయెల్ గాజాపై నాలుగుసార్లు వైమానిక, భూతల దాడులు చేసింది. 2008లో మూడు వారాలపాటు కొనసాగిన యుద్ధంలో వెయ్యిమంది పాలస్తీనీయులు మరణించగా ఇజ్రాయెల్ తరఫున 13 మంది ప్రాణాలు కోల్పోయారు. దీని తరువాత 2012లో ఇజ్రాయెలీలు గాజా స్ట్రిప్‌పై ఎనిమిది రోజులపాటు తీవ్రస్థాయి దాడులు చేశారు. అలాగే 2014లో ఆరువారాలపాటు జరిగిన యుద్ధంలో మరోసారి వైమానిక, భూతల దాడులు జరిగాయి. ఈ దాడుల్లో సుమారు రెండు వేల మంది పాలస్తీనీయులు మరణించగా ఇజ్రాయెలీల ప్రాణనష్టమూ ఎక్కువగానే ఉందని అంచనా. 2021లో మొత్తం 11 రోజులపాటు మరోసారి ఇరుపక్షాల మధ్య యుద్ధం జరగ్గా హమాస్ రాకెట్లతో ఇజ్రాయెలీ పట్టణాలపై దాడులకు తెగబడింది. ప్రతిగా ఇజ్రాయెల్ గాజాను వైమానిక, క్షిపణి దాడులతో అతలాకుతలం చేసింది. పాలస్తీనా తరఫున పోరాడిన 250 మంది, ఇజ్రాయెలీలు 13 మంది ప్రాణాలు కోల్పోయారు. తాజాగా ఈ ఏడాది మొదలైన ఘర్షణలో జరిగిన నష్టంపై ఇంకా మదింపు జరగలేదు. కాకపోతే ప్రాణనష్టం ఇరువైపులా పది వేలు ఆ పైమాటే అంటున్నారు.

హింసకు హింసే సమాధానం అన్నట్టుగా సాగుతున్నాయి ఈ వ్యవహారాలు. ఈ నెల మొదట్లో జరిగిన హమాస్ దాడిలో ఇజ్రాయెల్‌కు జరిగిన ప్రాణనష్టాన్ని పరిగణించినా హమాస్ చేతుల్లోని బందీలను దృష్టిలో ఉంచుకున్నా ఈసారి యుద్ధం అంత ఆషామాషీగా ముగిసేది కాదని అర్థమవుతుంది. పాలస్తీనా మరోసారి దాడికి దిగకుండా గట్టిగా బుద్ధి చెప్పాలని ఇజ్రాయెల్ యోచిస్తోంది. అయితే ఇజ్రాయెల్ ఇప్పటికే చాలాసార్లు ఇలా తీవ్రస్థాయిలో పాలస్తీనాకు బుద్ధి చెప్పే ప్రయత్నం చేయడం గమనార్హం. వాటి ఫలితాల ఆధారంగా మిలటరీ మార్గం ఒక్కటే సమస్యకు పరిష్కారం కాజాలదని ఇజ్రాయెల్ ఇప్పటికే గుర్తించి ఉండాలి.

రాజనీతిజ్ఞతా తోడవ్వాలి

గాజాలో హమాస్ ప్రాభవాన్ని తగ్గించేందుకు ఒకవైపున మిలటరీ దాడులు, ఇంకోవైపున రాజకీయ చర్యలు అత్యవసరమవుతాయి. ప్రతీకార దాడులు కేవలం హమాస్ కేంద్రంగా జరిగేలా ఇజ్రాయెల్ జాగ్రత్తలు తీసుకోవాలి. పాలస్తీనీయులకు భారీ ప్రాణ నష్టం జరగడం, ఇబ్బందులకు గురికావడం హింసాత్మక చక్రం గిర్రున తిరిగేందుకు మాత్రమే ఉపయోగపడుతుందని ఇజ్రాయెల్ అర్థం చేసుకోవాలి. ఆత్మరక్షణ విషయంలో ఇజ్రాయెల్‌కు ఉన్న హక్కును ఎవరూ కాదనరు. కానీ ప్రజలను నిర్బంధంలో ఉంచడం, ప్రాథమిక అవసరాలు కూడా తీరకుండా చేయడం అనేది 'సామూహిక శిక్ష' కిందకు వస్తుంది. అంతర్జాతీయ చట్టాల ప్రకారం ఇది నేరం. ప్రస్తుతం ఇజ్రాయెల్ జరుపుతున్న బాంబుదాడుల్లో విచక్షణ అనేది ఏదీ లేదన్నది సుస్పష్టం. ఇక హమాస్ అమాయక ప్రజలను రక్షణ కవచంగా ఉపయోగించుకుంటోంది. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ కూడా యుద్ధ నియమాలను పాటించేలా అమెరికా, ఇతర పాశ్చాత్య దేశాలు చర్యలు తీసుకోవాలి. లేదంటే దక్షిణార్ధ గోళ దేశాలు పాశ్చాత్య దేశాల విషయంలో దురభిప్రాయానికి వచ్చే అవకాశాలున్నాయి. అంతర్జాతీయ చట్టాలు పాశ్చాత్యదేశాలు కేవలం తమ అనుకూలతకు తగ్గట్టుగా మలచుకుంటాయని ఇవి భావించే ప్రమాదం ఉంది.

ఇజ్రాయెల్, దాని ప్రధాన మద్దతుదారైన అమెరికా.. పశ్చిమాసియా అనేది ఒకప్పటి అమెరికా ఆధిపత్యం చలాయిస్తున్న ప్రాంతాల్లో ఒకటి కాదని గుర్తుంచుకోవాలి. అలాగే ఇజ్రాయెల్ కూడా ఈజిప్ట్, సౌదీ అరేబియా, ఖతార్... బహుశా ఇరాన్‌తోనూ దీర్ఘకాలిక రక్షణ దృష్ట్యా రాజకీయపరమైన పరిష్కారాలు చేసుకోవడం మేలు.

వ్యాసకర్త అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ సభ్యులు
('ది ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

దుమ్మురేపిన పుస్తకం



మధ్యప్రాచ్యంలోని అల్లకల్లోలంపై నబిన్ ఇక్బాల్ 2021లో రాసిన 'షామల్ డేస్' పుస్తక పునరావిష్కరణ వేళ రచయితకు, కేరళ యూనివర్సిటీ ఇంగ్లిష్ ప్రొఫెసర్ మీనా టి. పిళ్లైకి మధ్య నడిచిన చర్చ ఉత్తేజం కలిగించింది. ఈ కాలానికి తగిన పుస్తకం, ఆలోచన రేకెత్తించిన చర్చ. – శశి థరూర్, ఎంపీ

ఏడాదంటే మాటలా?!




ఏఐసీసీ అధ్యక్షుడిగా విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకున్న మన సొంత కర్ణాటక బిడ్డ శ్రీ మల్లికార్జున్ ఖర్గేకు అభినందనలు. సర్... మీ సమర్థ నాయకత్వంలో శక్తిమంతమైన మన పార్టీ... మీ మార్గదర్శకత్వంలో మరింత దూసుకుపోతుంది. – డి.కె. శివకుమార్, ఉప ముఖ్యమంత్రి

పేరు మాత్రం నరోత్తమ్!!



మధ్యప్రదేశ్ ఎన్నికల ర్యాలీలో ప్రసంగిస్తున్న ఆ రాష్ట్ర హోం మంత్రి నరోత్తమ్ మిశ్రా.. "అభివృద్ధిలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణతో పాటు, హేమమాలిని కూడా వచ్చి నృత్యం చేసేంత స్థాయికి మన నియోజకవర్గాన్ని తీసుకెళ్తాం.." అన్నారు! మహిళల పట్ల మన గౌరవం, ఆదరణ ఇలా ఉన్నాయి! హేమమాలిని తమ పార్టీ ఎంపీ అన్నది మిశ్రాకు గుర్తుకు రాలేదా? – అశీష్ సింగ్, పొలిటికల్ ఎనలిస్ట్

మరో ఆయుధం రెడీ



మానవ జాతుల్లోని వ్యంగ్య విషాదం ఏమిటంటే భూగోళ రక్షణకు సదస్సులు నిర్వహిస్తూనే, ఒకరినొకరం ధ్వంసం చేసుకోడానికి నిరంతరం వినూత్న మార్గాలను అన్వేషిస్తూ ఉంటాం. (దెబ్బకు దెబ్బ తియ్యగల భారీ అణ్వస్త్రాన్ని రష్యా పరీక్షించి చూసిందన్న వార్తకు స్పందనగా..) – ఆనంద్ మహీంద్రా, మహీంద్రా గ్రూపు ఛైర్మన్

సీఎం వాకౌట్!



ఢిల్లీ గ్యాస్ చాంబర్‌గా మారిపోయింది. ఢిల్లీని రక్షించడానికి, పంజాబ్‌లో పంట వ్యర్థాలను కాల్చడాన్ని ఆపడానికి తీసుకున్న చర్యల గురించి అడిగినప్పుడు కేజ్రీవాల్ సమాధానం ఇవ్వకుండానే న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ (ఎన్.డి.ఎం.సి.) మీటింగ్ లోంచి వెళ్లి పోయారు. ఢిల్లీ, పంజాబ్ రెండిటిలోనూ ఉన్నది 'ఆప్' ప్రభుత్వమే కదా! సిగ్గు చేటు. – అమిత్ మాల్వియా, బీజేపీ జాతీయ ఐటీ ఇన్‌చార్జి

పర్మిషన్ ఎవరిచ్చారు?



ఆమె ఎవరు? అసలు ఈ దేశంలో ఏం జరుగుతోంది! నటి కంగనా రనౌత్ ఢిల్లీలోని ఇజ్రాయెల్ రాయబార కార్యాలయానికి వెళ్లి ఇజ్రాయెల్ రాయబారి నౌర్ గిలోన్‌ను కలవడం ఏమిటి?! ఆమె ఎమ్మెల్యే కాదు, ఎంపీ కాదు, సీఎం కాదు, మంత్రి కాదు, గవర్నర్ కూడా కాదు. ఎవరూ కాకుండా వెళ్లి ఇజ్రాయెల్‌కు సంఘీభావం ఎలా తెలియజేయగలిగారు? – ఆయుష్ జైన్, మార్కెటింగ్ నిపుణుడు

కుటుంబం మొత్తాన్నీ!



గాజాలో న్యూస్ కవరేజీని సెన్సార్ చేయాలని యు.ఎస్. విదేశాంగ కార్యదర్శి బ్లింకెన్.. ఖతార్‌కు వర్తమానం పంపినట్లు వార్తలు వచ్చిన కొద్ది గంటల్లోనే యు.కె., యు.ఎస్., ఇ.యు.ల నుంచి అందిన ఆయుధాలతో ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో గాజాలోని 'అల్-జజీరా' టీవీ కరస్పాండెంట్ వేల్ అల్-దహదౌహ్ భార్య, కొడుకు, కుమార్తె దుర్మరణం చెందారు! – అఫ్షిన్ రత్తాన్సీ, బ్రిటిష్ జర్నలిస్ట్

ఇన్ బాక్స్

సామాజిక సాధికారతే లక్ష్యం

ఒకవైపు నవరత్నాల ద్వారా సంక్షేమం, అభివృద్ధిల కోసం ప్రయత్నిస్తూనే రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి పరిపాలనా వికేంద్రీకరణ కోసం మూడు రాజధానులు ప్రతిపాదన అవసరమైంది. ఇటు ఉత్తరాంధ్రలో గానీ, అటు రాయలసీమలో గానీ 80 శాతం పైగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలే ఉన్నాయి. గత ఆరేడు దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని ప్రాంతాల ప్రజల ఆకాంక్షలకు ఒక ఫినిషింగ్ టచ్ మూడు రాజధానుల ప్రతిపాదన ముందుకొచ్చింది. విశాఖపట్టణం ఒక రాజధానికి కావాల్సిన అన్ని వసతులు ఉన్న ప్రాంతం. కేంద్ర ప్రభుత్వం నియమించిన కమిటీ కూడా వికేంద్రీకరణ పద్ధతిన విశాఖపట్టణంలో 500 ఎకరాల్లో 5 వేల కోట్ల రూపాయలతో రాజధాని నగర నిర్మాణం సాధ్యమవుతుందని చెప్పింది. ఆ విధంగా గత ప్రభుత్వమే నిర్ణయం తీసుకొని ఉంటే ఈ రోజు ఈ అలజడి ఉండేది కాదు.

గత ప్రభుత్వ హయాంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు రాజధాని కోసం ఎంచుకున్న భూమి ప్రభుత్వ భూమి అయితే తనకు అభ్యంతరం లేదని అసెంబ్లీలో చెప్పారు. దీనిని ప్రతిపక్షాలు వక్రీకరించి విశాఖ ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌గా అవకుండా అడ్డుపడుతూ 'అప్పుడు ప్రతిపక్ష నేతగా జగన్ ఒప్పుకున్నారు కదా' అంటూ ప్రచారం చేయడం ఎంతవరకు కరెక్ట్? ఏ సింగపూర్ కంపెనీకైతే రాజధాని నిర్మాణ బాధ్యతలు గతంలో ఇవ్వాలని అనుకున్నారో ఆ కంపెనీ కూడా 33 వేల ఎకరాల స్థలం అవసరం లేదనీ, ఆ భూములకు రాక్ బేరింగ్ సామర్థ్యం లేదనీ అభిప్రాయ పడినట్లూ, ఇంకా ఎక్కడైనా వేరే స్థలం చూపించమని అడిగినట్లూ తెలిసింది. ఈ అభిప్రాయానికి అనుగుణంగా అప్పట్లో ప్రధాన కార్యదర్శి ఐవీఆర్ కృష్ణారావు కూడా తగు సలహా రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వడం జరిగింది.

రాజధాని ఎక్కడ ఉండాలనే విషయంలో ఇప్పుడు చర్చ జరుగుతున్నట్లు అప్పట్లో ప్రజల్లో చర్చ విస్తృత స్థాయిలో జరగలేదు. రాష్ట్రంలో దశాబ్దాలుగా వెనుక బడిన ప్రాంతాల అభివృద్ధి, ఇంకా అనేక సామాజిక అంశాలను దృష్టిలో పెట్టుకొని జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అన్ని అంశాలనూ కూలంకషంగా పరిశీలించిన తర్వాత తిరిగి అసెంబ్లీలో చర్చించి మూడు రాజధానుల బిల్లును తీసుకు రావడం జరిగింది. అయితే ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ చిత్తశుద్ధిని జీర్ణించుకోలేక, న్యాయపరమైన అడ్డంకులు సృష్టిస్తూ, రాష్ట్ర విస్తృత ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకోకుండా నిర్మాణాత్మక పాత్ర పోషించడంలో ప్రతిపక్షాలు విఫలమవుతున్నాయి.

– ప్రొ॥ హనుమంతు లజపతిరాయ్, రాష్ట్ర పరిపాలా వికేంద్రీకరణ జేఏసీ ఛైర్మన్

సచివాలయాల సేవలు అమోఘం!

అభిప్రాయం



చలాది పూర్ణచంద్రరావు

ప్రతి పేదవాడి ముఖంలో చిరునవ్వు చూడాలన్న రాష్ట్ర ప్రభుత్వం, దాని అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశయం మేరకు ఇప్పటి వరకు దేశంలోనే ఎక్కడా లేని విధంగా గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ ఆవిర్భవించింది. ఏ మాత్రం అవినీతికీ, వివక్షకూ తావు ఇవ్వకుండా పరిపాలన ప్రజలకు చేరువ కావాలన్న ప్రధాన ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ ఈ సచివాలయ వ్యవస్థకు నాలుగేళ్ల క్రితం శ్రీకారం చుట్టారు. అద్భుతమైన ఫలితాలిస్తున్న ఈ వ్యవస్థను అధ్యయనం చేయడం కోసం అనేక రాష్ట్ర ప్రభుత్వాలు తమ తమ పరిశీలనా బృందాలను పంపించటం గమనార్హం.

కాగా రాష్ట్రంలో ఉన్న మొత్తం 15004 గ్రామ, వార్డు సచివాలయాల్లో దాదాపు 35 ప్రభుత్వ శాఖలకు సంబంధించి సుమారు 500 సేవలు అందుబాటులోకి వచ్చాయి. పింఛన్, రేషన్ కార్డులు, ఇంటి పట్టాలు, సివిల్ పనులకు సంబంధించిన పనులు, వైద్యం, ఆరోగ్యం, రెవిన్యూ సమస్యలు, భూముల సర్వే, శిశు సంక్షేమం, డెయిరీ, పౌల్ట్రీ వంటి అనేక అంశాలకు సంబంధించిన సేవలు ఇందులో ఉన్నాయి. ఈ సేవల కోసం ప్రజలు గ్రామ సచివాలయాల్లో అర్జీ పెట్టుకున్న 72 గంటల్లోనే సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వం నిర్దేశించింది. సదాశయంతో నెలకొల్పిన ఈ గ్రామ, వార్డు సచివాలయాలు వలంటీర్ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకూ; ప్రజాసమస్యలు ప్రభుత్వానికీ తెలియజేసి ప్రజలకూ–ప్రభుత్వానికీ మధ్య వారధిగా ఈ వలంటీర్లు వ్యవహరిస్తున్నారు.

అర్హత ఉన్నవారెవరైనా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందని సందర్భంలో వలంటీర్ ద్వారా ప్రయత్నించి పొందవచ్చు. వైసీపీ ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా ప్రకటించిన



'నవరత్నాలు' పథకం కింద లబ్ధిదారుల ఎంపికలో ఈ సచివాలయాల పాత్ర అనన్యం.

ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్ బాధ్యత తీసుకునే విధంగా ఈ గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ రూపొందించబడింది. సమస్త ప్రభుత్వ సేవలూ, పథకాలను వలంటీర్ల ద్వారా సచివాలయ వ్యవస్థ ప్రజల గడప ముందుకు తీసుకువెళ్లడం దేశాన్ని విస్మయానికి గురిచేస్తోంది. మహమ్మారి కరోనా సమయంలో వలంటీర్లు చేసిన సేవలను ఎవరూ మరచి పోలేరు.

వీరి సేవలు గుర్తించిన ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాలకు సంబంధించి కొత్తగా చట్టం తీసుకొస్తూ ఆర్డినెన్స్ జారీ చేసింది. దీని ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా గ్రామాలు, పట్టణాల్లో ఇప్పటికే అమలులో ఉన్న ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం, ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్ చట్టం తరహాలోనే సచివాలయ వ్యవస్థకు కూడా చట్టం రానుంది. రాజ్యాంగంలోని 11, 12 షెడ్యూళ్లలో పేర్కొన్న ప్రకారం ప్రజలు కేంద్రంగా ప్రభుత్వ సేవలు, ఇతర సదుపాయాలను అందించేందుకు ఈ చట్టం ద్వారా గ్రామ, వార్డు సచివాలయాల పేరుతో కొత్త వ్యవస్థకు శ్రీకారం చుడుతున్నట్టు ఆర్డినెన్స్ పేర్కొంటోంది. ఈ ఆర్డినెన్స్‌తో గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అందజేసే ప్రభుత్వ సేవలు, గ్రామ, వార్డు సచివాలయ శాఖ ద్వారా జారీచేసే ఉత్తర్వులు శాసనాధికారంతో కూడినవయ్యాయి. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల నియామకానికి చట్టబద్ధత లభించింది.

2019 అక్టోబర్ 2న గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ అమలులోకి వచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి రెండు వేల జనాభాకు, అలాగే పట్టణ ప్రాంతాల్లో ప్రతి 4 వేల జనాభాకు ఒక సచివాలయం చొప్పున ఏర్పాటయ్యాయి. అయితే ఈ వ్యవస్థపై కొందరు అనవసర విమర్శలు చేయడం శోచనీయం.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
మొబైల్: 94915 45699

స్ఫూర్తి ప్రదాత

బొయ్యా సూర్యనారాయణ మూర్తి మొదటి తరం దళిత నాయకులలో ఒకరు. ప్రస్తుతం అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 'నగరం' గ్రామంలో 1906 అక్టోబర్ 29న జన్మించారు. అంటరాని తనాన్ని భరిస్తూనే చిన్నప్పటి నుంచీ చదువుపై ధ్యాస ఉంచి కాకినాడ 'బ్రహ్మసమాజం' శాఖ వారి సహాయంతో అప్పట్లోనే బీఏ, బీఈడీ, లా డిగ్రీలు సంపాదించారు. ఇంగ్లీష్‌లో ఆయనకు ఉన్న సామర్థ్యం కారణంగా ఎంతో ఎత్తుకు ఎదిగారు. జర్నలిస్ట్‌గా మారి 'ఆంధ్రా ప్రావిన్షియల్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షునిగా వ్యవహరించారు. భారత జాతీయ కాంగ్రెస్ తరఫున ఆయన 1937 నుంచి 1952 వరకూ మద్రాస్ శాసన సభ సభ్యునిగా ఉన్నారు. మద్రాస్ ప్రభుత్వంలో పరిశ్రమలు, కార్మిక శాఖ మంత్రిగానూ పనిచేశారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నందుకు బ్రిటిష్ వాళ్లు రెండేళ్లు ఆయన్ని జైల్లో పెట్టారు.


1947లో తిరుమల శ్రీ వేంకటేశ్వర ఆలయంలోకి దళితుల ప్రవేశం కొరకు ఉద్యమించి విజయం సాధించారు. 1944లో ఆయన దళిత కాలేజీ విద్యార్థుల కోసం 'ఎమ్‌సీ రాజయ్య మెమోరియల్ హాస్టల్'ను మద్రాస్‌లో స్థాపించారు. తరువాతి కాలంలో ఐఏఎస్ అయిన కత్తి చంద్రయ్య వంటి ఎందరో దళిత విద్యార్థులు ఈ హాస్టల్ వల్ల ప్రయోజనం పొందినవారే. మూర్తి 'నవజీవన' అనే తెలుగు వారపత్రికకు సంపాదకత్వం వహించారు. ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీ ఆయన్ని మూడు నెలల పాటు ఉపన్యసించడానికి ఆహ్వానించింది. ఆయన అనేక గ్రంథాలు రాశారు. అందులో 'ఆంధ్ర వీర కుమార' ప్రసిద్ధిగాంచింది. 'అప్పికట్ల' అనే గ్రామంలో ఓ ఆధిపత్య కులంవారు దళితులను ఊరు నుంచి వెళ్లగొట్టారనే సంగతి మద్రాస్ నుంచి స్వగ్రామం వస్తున్న మూర్తికి తెలిసింది. దీంతో మంత్రిగా తనకున్న పలుకుబడితో దళితులను తిరిగి వారి గ్రామానికి పోలీసు రక్షణతో చేర్చారు. దళితుల కోసం ప్రత్యేకంగా గృహసముదాయాన్ని నిర్మింపచేశారు. దానికే 'మూర్తి రక్షణ నగర్' (ఎమ్ఆర్ నగర్) అని ప్రజలు పేరు పెట్టుకొన్నారు. ఆయన స్ఫూర్తితో ఎందరో దళితులు రాజకీయ రంగప్రవేశం చేసి ఎన్నో పదవులు అలంకరించారు.

– డా॥ అల్లూరి సుందర్ కుమార్ దాస్, విశ్రాంత ఐపీఎస్ అధికారి
(అక్టోబర్ 29న బి.ఎస్. మూర్తి జయంతి)

వచ్చే నెల నుంచి కందిపప్పు పంపిణీ

కార్డుదారులకు కిలో చొప్పున ఇవ్వడానికి సన్నాహాలు

- ఇప్పటికే హాకా నుంచి 7,200 టన్నుల కొనుగోలుకు ఆర్డర్
- తొలి దశలో 3,660, రెండో దశలో 3,540 టన్నులు ఇచ్చేందుకు అంగీకారం
- నవంబర్‌లో పంపిణీ చేసేందుకు 2,300 టన్నుల సరఫరా
- డిసెంబర్, జనవరిలో 100 శాతం కార్డులకు ఇచ్చేలా ఏర్పాట్లు
- జనవరిలో రైతుల నుంచే నేరుగా కందులు కొనుగోలు చేయనున్న ప్రభుత్వం
- వాటిని మరాడించి ప్రతి నెలా పంపిణీ చేసేలా పౌరసరఫరాల శాఖ కసరత్తు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కార్డుదారులకు కందిపప్పు పంపిణీకి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. వచ్చే నెల (నవంబర్) నుంచి క్రమం తప్పకుండా లబ్ధిదారులకు కిలో చొప్పున అందించనుంది. తాజాగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ 10 వేల టన్నుల కందిపప్పు కొనుగోలుకు హైదరాబాద్ అగ్రికల్చరల్ కో–ఆపరేటివ్ అసోసియేషన్ లిమిటెడ్ (హాకా)కు ఆర్డర్ ఇచ్చింది. అయితే హాకా వద్ద కూడా తగినంత నిల్వలు లేకపోవడంతో 7,200 టన్నుల సరఫరాకు అంగీకరించింది. ఇందులో భాగంగా తొలి దశలో 3,660 టన్నులు, రెండో దశలో 3,540 టన్నులు అందించనుంది. ఇప్పటికిప్పుడు అంటే వచ్చే నెల అవసరాలకు గాను 2,300 టన్నుల సరఫరాకు సన్నాహాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. అంతర్జాతీయంగా పప్పుధాన్యాల కొరతతో రేట్లు ఆకాశాన్నంటాయి. దేశవ్యాప్తంగా పంట ఉత్పత్తులు బహిరంగ మార్కెట్‌కు వెళ్లిపోవడంతో భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)వద్ద కూడా నిల్వలు కరువయ్యాయి. ఫలితంగా కందిపప్పు పంపిణీకి అవాంతరాలు ఏర్పడ్డాయి.

ఈ నెలాఖరుకు సరుకు తరలింపు

ప్రస్తుతం మార్కెట్‌లో కిలో కందిపప్పు రకాన్ని బట్టి రూ.150 నుంచి రూ.180 వరకు ఉంది. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన హాకా నుంచి మద్దతు ధర ప్రాతిపదికనే కందులు సేకరించినప్పటికీ.. వాటికి అదనంగా ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, రవాణా ఖర్చులు అవ్వనున్నాయి. ఈ మొత్తంలో రూ.67కు మాత్రమే కిలో కందిపప్పును ప్రభుత్వం లబ్ధిదారులకు ఇవ్వనుంది. అంటే దాదాపు సబ్సిడీ రూపేణా ప్రభుత్వం రూ.70పైగానే భరిస్తున్నట్టు సమాచారం. ఈ నెలాఖరు నాటికి చౌక ధరల దుకాణాల వద్దకు అందుబాటులో ఉన్న నిల్వల ప్రకారం సరుకును తరలించనుంది. డిసెంబర్, జనవరిల్లో పూర్తి స్థాయిలో కార్డుదారులకు సబ్సిడీ కందిపప్పును ఇచ్చేందుకు కసరత్తు చేస్తోంది.

మార్కెట్ రేటుకే కందుల కొనుగోలు

రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు వీలుగా 50 వేల టన్నుల కందిపప్పును కేటాయించాలని కేంద్రానికి పదేపదే విజ్ఞప్తి చేసింది. తొలుత కర్ణాటకలోని బఫర్ స్టాక్ నుంచి 9,764 టన్నులు కందులు కేటాయించగా వాటిలో నాణ్యత లోపించింది. ఆ తర్వాత రెండుసార్లు జూన్, సెప్టెంబర్‌లో కేటాయింపుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. కానీ, కేంద్రం నుంచి స్పందన రాలేదు. మండల స్టాక్ సెంటర్ (ఎంఎల్‌ఎస్)ల్లోని స్టాక్ మొత్తాన్ని పంపిణీకి విడుదల చేయడంతో నిల్వలు నిండుకున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల కేంద్ర ప్రభుత్వం హాకా నుంచి కందిపప్పును తీసుకోవాలని సూచించింది. ఈ నేపథ్యంలో వచ్చే మూడు నెలలకు హాకా సరఫరా చేసే కందిపప్పును రాష్ట్ర ప్రభుత్వం వినియోగించనుంది. భవిష్యత్తులో అంతరాయం లేకుండా సరఫరా చేసేందుకు జనవరి నుంచి పౌరసరఫరాల సంస్థ ద్వారా నేరుగా రైతుల నుంచి మార్కెట్ ధరకు ప్రభుత్వం కందులు సేకరించనుంది. తొలుత ఈ ఖరీఫ్‌లో 30 వేల టన్నులు సేకరించాలనే యోచనలో ఉన్నారు. వాటిని స్వయంగా మరాడించి ప్యాకింగ్ చేయించి సబ్సిడీపై కార్డుదారులకు అందించేలా ప్రణాళిక రూపొందించారు.

బాబుగారి 'పప్పు' డ్రామా

అంతర్జాతీయంగా మార్కెట్ ఒడిదుడుకులకు లోబడి డిమాండ్, సప్లై ఆధారంగా నిత్యావసరాల రేట్లు మారుతుంటాయి. చంద్రబాబు హయాంలో రేట్లు ఎంత పెరిగినా ఇచ్చే సబ్సిడీ మాత్రం పెరిగేది కాదు. పైగా ఆయన పాలన చేపట్టిన తర్వాత సెప్టెంబర్ 2014–జూలై 2015 వరకు కందిపప్పు ఊసే లేదు. ఆగస్టు 2015 నుంచి ఫిబ్రవరి 2017 వరకు కార్డుకు కిలో చొప్పున రూ.50 నుంచి రూ.120 మధ్యన రేట్లు పెంచి విక్రయించారు. 2015 డిసెంబర్‌లో ఏకంగా రూ.90కి పెంచారు. 2016 జూలై నుంచి 2017 ఫిబ్రవరి మధ్య రూ.120 చేశారు. 2018లో కందిపప్పు బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.63 ఉన్నప్పుడు చంద్రబాబు ప్రభుత్వం కేవలం రూ.23 రాయితీ ఇచ్చింది. చివరి ఏడాది మాత్రం ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రెండు కిలోల కందిపప్పు డ్రామా ఆడారు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో మొత్తం పంపిణీ చేసింది కేవలం 93 వేల టన్నులు మాత్రమే. ఇందు కోసం రూ.1605 కోట్లు ఖర్చు చేసింది. కానీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇప్పటివరకు 3.15 లక్షల టన్నుల కందిపప్పు పంపిణీకి రూ.3,084 కోట్లు ఖర్చు చేసింది. కరోనా సమయంలో నిత్యావసరాలను పూర్తి ఉచితంగా అందించింది.

కార్డుదారులకు నిరంతరాయంగా పంపిణీ చేసేలా చర్యలు

కార్డుదారులకు ప్రతి నెలా నిరంతరాయంగా కందిపప్పు పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాం. హాకా ద్వారా కందిపప్పును సేకరిస్తున్నాం. ఇప్పటికే నాణ్యత ప్రమాణాలను పరిశీలించాం. ఈ నెలాఖరు నాటికి ఎఫ్‌పీ దుకాణాలకు సరుకు చేర్చేలా ఆదేశాలు జారీ చేశాం. డిసెంబర్, జనవరిల్లో వంద శాతం కార్డులకు పంపిణీ చేస్తాం. ఈ ఖరీఫ్‌లో రైతుల నుంచి కందులు కొనుగోలు చేయనున్నాం. ఇప్పటికే అన్ని జిల్లాల్లోని కలెక్టర్లకు కందుల కొనుగోలుపై ప్రచారం కల్పించాలని ఆదేశించాం. మన రైతుల నుంచి మార్కెట్ ధరకు కందులు కొనుగోలు చేసి వాటిని రాష్ట్ర వినియోగానికి వాడుకుంటే.. రైతులకు, లబ్ధిదారులకు ఎంతో మేలు జరుగుతుంది.

– హెచ్.అరుణ్ కుమార్,
కమిషనర్, పౌరసరఫరాల శాఖ

ఇంద్రకీలాద్రిపై కొనసాగుతోన్న రద్దీ

నేటి నుంచి దర్శన టికెట్ల విక్రయం.. ఆర్జిత సేవలు యధాతథం



ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై భవానీల రద్దీ కొనసాగుతోంది. గురువారం తెల్లవారుజామున 4 గంటలకు ప్రారంభమైన భవానీల రద్దీ సాయంత్రం 5 వరకు కొనసాగింది. శుక్రవారం నుంచి అన్ని ఆర్జిత సేవలు భక్తులకు అందుబాటులోకి రానున్నాయి. దర్శనం నిమిత్తం దేవస్థానం అన్ని దర్శన టికెట్ల విక్రయాలను శుక్రవారం నుంచి ప్రారంభించనుంది. కాగా, శుక్రవారం నుంచి అమ్మవారి సన్నిధిలో నిత్య ఆర్జిత సేవలకు ఉభయదాతలను అనుమతిస్తున్నారు. దసరా ఉత్సవాలు ముగిసిన తర్వాత నిత్య ఆర్జిత సేవలు కొనసాగగా, భవానీల రద్దీ నేపథ్యంలో ఉభయదాతలను అనుమతించలేదు. శుక్రవారం తెల్లవారుజామున 4 గంటలకు అమ్మవారి అంతరాయంలో నిర్వహించే ఖడ్గమాలార్చనకు పరిమిత సంఖ్యలో ఉభయదాతలను అనుమతించనున్నారు. లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, శాంతి కల్యాణం, చండీహోమానికి ఉభయదాతలకు అవకాశం కల్పించారు.

28న అమృత్ కలశ్ యాత్ర ప్రత్యేక రైళ్లు



రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): నా భూమి– నా దేశం ప్రచారంలో భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి దేశ రాజధాని ఢిల్లీకి ఈ నెల 28న అమృత్ కలశ్ యాత్ర ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. దేశం కోసం తమ జీవితాలను త్యాగం చేసిన ఎందరో వీరులు, వీరనారీమణులకు నివాళులర్పిస్తూ, వారి త్యాగాలను స్మరించుకుంటు దేశ రాజధాని ఢిల్లీలో స్మారక శిలాఫలకాలు ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 9వ తేదీన నా భూమి– నా దేశం కార్యక్రమానికి పిలుపునిచ్చింది. అందులో భాగంగా ఈ కార్యక్రమంలో పాల్గొనే వారు దేశంలోని మారుమూల గ్రామాలు, పట్టణాల నుంచి పవిత్ర మట్టి, బియ్యంను రాష్ట్ర రాజధానులకు ఈ నెల 22 నుంచి 27వ తేదీ లోపుగా తరలిస్తారు. అక్కడ నుంచి ఈ నెల 28 నుంచి 30వ తేదీ లోపు వాటిని దేశ రాజధాని ఢిల్లీకి రవాణా చేయనున్నారు.అందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ నుంచి, తెలంగాణాలోని సికింద్రాబాద్ నుంచి ఈ నెల 28న వారి కోసం ప్రత్యేక రైళ్లు నడపనున్నారు.

ప్రత్యేక రైళ్లు ఇవీ: విజయవాడ–హజరత్ నిజాముద్దిన్ (07209) ప్రత్యేక రైలు ఈ నెల 28న ఉదయం 10 గంటలకు విజయవాడ స్టేషన్‌లో బయలుదేరి, ఆదివారం మధ్యాహ్నం 2.25 గంటలకు హజరత్ నిజాముద్దిన్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07210) నవంబర్ 1న రాత్రి 11 గంటలకు హజరత్ నిజాముద్దిన్‌లో బయలుదేరి, శుక్రవారం ఉదయం 9.30 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. సికింద్రాబాద్–హజరత్ నిజాముద్దిన్ (07211) రైలు ఈ నెల 28న ఉదయం 10.45 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి, ఆదివారం మధ్యాహ్నం 2.25 గంటలకు హజరత్ నిజాముద్దిన్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07212) నవంబర్ 1న రాత్రి 11 గంటలకు హజరత్ నిజాముద్దిన్‌లో బయలుదేరి, శుక్రవారం ఉదయం 7 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

సామాజిక సాధికారత సారథి వైఎస్ జగన్

1,124వ రోజు రిలే దీక్షల్లో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుపేదలకు నేరుగా సంక్షేమాన్ని అందించడమే కాకుండా.. రాజకీయంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి సామాజిక సాధికారతకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 1,124వ రోజుకు చేరుకున్నాయి. పలువురు మాట్లాడుతూ.. పేదలకు మేలు చేయడమే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేయడంలో భాగంగా రూ.లక్షల కోట్లను పేదల ఖాతాల్లో సీఎం జగన్ జమ చేశారన్నారు. ఇందుకు భిన్నంగా పెత్తందారులకు దోచిపెట్టడమే లక్ష్యంగా చంద్రబాబునాయుడు అధికారాన్ని అడ్డుపెట్టుకుని రూ.3.50 లక్షల కోట్లు వెనకేసుకున్నాడని విమర్శించారు. బహుజనులకు సామాజిక న్యాయం అందకుండా చేసేందుకు కోర్టుల్లో తప్పుడు కేసులు వేయించి శునకానందం పొందిన బాబుకు తమ ఉసురు తగిలి తగిన శాస్తి జరిగిందని చెప్పారు. బాబు చేసిన దోపిడీ బాగోతాన్ని తెలుసుకునే.. రాజధాని ప్రాంతంలోని ప్రజలు టీడీపీని, బాబు కొడుకు లోకేశ్‌ను చిత్తుచిత్తుగా ఓడించారని తెలిపారు. చంద్రబాబు సతీమణి భువనేశ్వరి తన భర్త అవినీతిని కాపాడుకునేందుకు 'నిజం గెలవాలి' అంటూ యాత్రలు చేయడం చూసి సభ్య సమాజం సిగ్గుతో తలదించుకుంటుందన్నారు. నిజం గెలిచింది కాబట్టే.. బాబు అవినీతి బయటపడి జైలుకెళ్లాడని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెరికే వరప్రసాద్, బందెల కిరణ్‌రాజ్, మాదిగాని గురునాథం, ఈపూరి ఆదాం, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

'విశ్వశాంతి'లో విదేశీ నత్తల గుడ్ల ధ్వంసం



నత్తల తొట్టెలను పరిశీలిస్తున్న అధికారులు

ఉయ్యూరు (పెనమలూరు): కృష్ణా జిల్లా ఉయ్యూరులోని శ్రీ విశ్వశాంతి విద్యాసంస్థల్లో విదేశీ నత్తల పెంపకంపై తనిఖీలు రెండో రోజూ కొనసాగాయి. ప్లాంట్ క్వారంటైన్ బృందం సభ్యులు ఆంజనేయరెడ్డి, మనోజ్ పురా గోస్వామి, డాక్టర్ శక్తివేల్, తహశీల్దార్ మస్తాన్, రెవెన్యూ, మత్స్యశాఖ, వ్యవసాయశాఖల అధికారులతో కలిసి నత్తల పెంపకంపై సమగ్ర నివేదికను సిద్ధం చేశారు. విద్యాసంస్థల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి పెట్టెల్లో భద్రపర్చిన గుడ్లను గుర్తించి వాటిని కాల్చి భూస్థాపితం చేశారు. బృందం సభ్యులు మాట్లాడుతూ విదేశీ నత్తలు వరి పంట పొలాలకు తీవ్ర నష్టం చేస్తాయన్నారు. ఒక్కో నత్త 1,500 నుంచి 2,000 వరకూ గుడ్లను పెడుతుందన్నారు. ఒక నత్త కనీసం కుంట వరి పొలాన్ని నాశనం చేస్తుందని, ప్రమాదకరంగా ఉన్న విదేశీ నత్తల పెంపకం సరికాదని పేర్కొన్నారు. పూర్తి వివరాలతో సమగ్ర నివేదికను సిద్ధం చేసి రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారులకు పంపుతామని వివరించారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.పద్మావతి, ఉయ్యూరు ఆర్డీవో డి.రాజు తదితరులు పాల్గొన్నారు.

28న రాత్రి శ్రీవారి ఆలయ తలుపులు మూసివేత

తిరుమల/శ్రీకాళహస్తి: పాక్షిక చంద్రగ్రహణం కారణంగా 28న రాత్రి 7.05 గంటలకు శ్రీవారి ఆలయ తలుపులు మూసివేసి 29న తెల్లవారుజామున 3.15 గంటలకు తెరవనున్నట్లు టీటీడీ తెలిపింది. 29న తెల్లవారుజామున 1.05 నుంచి 2.22 గంటల మధ్య చంద్రగ్రహణం పూర్తవుతున్న కారణంగా తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనాన్ని 28న సాయంత్రం 6 గంటలకు మూసివేసి 29న ఉదయం 9 గంటలకు తెరుస్తారు. ఈ సమయంలో అన్నప్రసాదాల పంపిణీ ఉండదు. 28న సహస్రదీపాలంకారసేవను, వికలాంగులు, వయోవృద్ధుల దర్శనాలను టీటీడీ రద్దు చేసింది.

స్వామి వారి సేవలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి

ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి గురువారం శ్రీవారిని, శ్రీకాళహస్తిలోని జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని కుటుంబసమేతంగా దర్శించుకున్నారు.



తిరుమల ఆలయం వెలుపల కుటుంబ సభ్యులతో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో మరో ఘనత

బ్లాస్ట్ ఫర్నేస్–2లో 50 మిలియన్ టన్నుల హాట్ మెటల్ ఉత్పత్తి



హర్షం వ్యక్తం చేస్తున్న సీఎండీ అతుల్‌భట్ తదితరులు

ఉక్కునగరం (గాజువాక): విశాఖ స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్ ఫర్నేస్–2 (కృష్ణ) విభాగంలో ఉత్పత్తి 50 మిలియన్ టన్నులకు చేరింది. ఈ విభాగం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు 50 మిలియన్ టన్నుల హాట్ మెటల్ ఉత్పత్తి సాధించి మరో మైలురాయికి చేరుకుంది. ఈ విభాగంలో ఉత్పత్తి 1992 మార్చి 21న ప్రారంభమైంది. 50 మిలియన్ టన్నుల ఉత్పత్తికి చేరుకున్న సందర్భంగా విభాగంలో గురువారం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీఎండీ అతుల్ భట్ మాట్లాడుతూ ప్లాంట్‌కు అత్యంత కీలక విభాగమైన బ్లాస్ట్ ఫర్నేస్ మరో మైలురాయికి చేరుకోవడం అభినందనీయమన్నారు. ఉద్యోగులు, అధికారుల సమష్టి కృషి ఫలితంగా ఈ విజయం సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎ.కె.బాగ్చి, సీజీఎం (వర్క్స్) ఎస్.వి.స్వామి, సీజీఎం (ఐరన్) ఆర్.మోహంతి, విభాగాధిపతి ఉదయ్‌నాగ్ పాల్గొన్నారు.

తీరానికి మరింత రక్షణ



- రాష్ట్రంలో పెరిగిన మడ అడవుల విస్తీర్ణం
- ప్రత్యేక చర్యలు చేపట్టిన అటవీశాఖ
- కృష్ణా, గోదావరి డెల్టాల్లో గణనీయ వృద్ధి

సాక్షి, అమరావతి: మడ అడవుల విస్తీర్ణం రాష్ట్రంలో గణనీయంగా వృద్ధిచెందుతోంది. తీర ప్రాంతానికి రక్షణలో ఈ అడవులు కీలకపాత్ర వహిస్తాయి. తుపానులు వచ్చినప్పుడు రక్షణ కవచాలుగా పనిచేస్తాయి. కోతను నివారిస్తాయి. గడచిన ఎనిమిదేళ్లలో 10శాతం మేర మడ అడవుల విస్తీర్ణం పెరిగినట్లు అటవీశాఖ ఇటీవల ఓ నివేదికలో వెల్లడించింది. 2014నాటికి రాష్ట్రంలో 31,888 హెక్టార్లలో ఇవి విస్తరించగా, ప్రస్తుతం ఈ విస్తీర్ణం 40,500 హెక్టార్లకు పెరిగింది. పశ్చిమ బెంగాల్, గుజరాత్, అండమాన్ నికోబార్ దీవుల తర్వాత మన రాష్ట్రంలోనే మడ అడవుల విస్తీర్ణం ఎక్కువగా ఉంది. పశ్చిమ బెంగాల్‌లో అత్యధికంగా 2,114 చదరపు కిలోమీటర్లు విస్తీర్ణంలో ఉండగా, గుజరాత్‌లో 1,175 చదరపు కిలోమీటర్లు, అండమాన్ నికోబార్ దీవుల్లో 616 చదరపు కిలోమీటర్లలో ఉన్నాయి. మన రాష్ట్రంలో గోదావరి, కృష్ణా నదులు సముద్రంలో కలిసే ప్రాంతాల్లో ఎక్కువ మడ అడవులు ఉన్నాయి. గోదావరి తీరంలో కాకినాడ, బీఆర్ అంబేద్కర్ జిల్లాలు, కృష్ణా తీరంలో కృష్ణా, బాపట్ల జిల్లాల్లో ఇవి విస్తరించాయి. ఇవి కాకుండా శ్రీకాకుళం, విశాఖపట్నం, పశ్చిమ గోదావరి, ప్రకాశం, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లోనూ కొద్దిమేర మడ అడవులు ఉన్నాయి. ప్రధానంగా కాకినాడ జిల్లాలోని కోరింగ అభయారణ్యంలో ఉన్న మడ అడవులు ప్రసిద్ధి చెందాయి. ఇక్కడ 187.81 చదరపు కిలోమీటర్ల మేర ఉండగా, ఆ తర్వాత కృష్ణా అభయారణ్యంలో 137.76 చదరపు కిలోమీటర్లలో ఈ అడవులు వ్యాపించి ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా మడ అడవులు తగ్గుతుండటంతో, రాష్ట్రంలో ఈ అడవుల విస్తీర్ణాన్ని పెంచేందుకు అటవీశాఖ కొన్నేళ్లుగా తీవ్ర ప్రయత్నాలు చేసింది. ఇందు కోసం ప్రత్యేకంగా నర్సరీలు ఏర్పాటుచేసింది. అక్కడి నుంచి విత్తనాలు తీసుకెళ్లి సముద్ర ముఖద్వారాల్లో చల్లించింది. ఆయా ప్రాంతాలకు చెందిన స్థానికుల సహకారంతో సంరక్షణకు చర్యలు చేపట్టింది. ఈ మడ అడవుల ద్వారా తీర ప్రాంత రక్షణతోపాటు, అక్కడ నివసించే లక్షలాదిమంది జీవనోపాధి కూడా పొందుతున్నారు.

గాజా ఉక్కిరి బిక్కిరి


ఖాన్ యూనిస్ పట్టణంలో తాగు నీటి కోసం గుమిగూడిన జనం


గాజాలోని ఐక్యరాజ్యసమితి శిబిరంలో ఆహారం కోసం వేచిచూస్తున్న నిరాశ్రయులు


అదే శిబిరంలో ఎట్టకేలకు ఆహారం దొరకడంతో ఆనందపడుతున్న ఓ బాలిక


దక్షిణ గాజా స్ట్రిప్‌లో స్టాక్ అయిపోవడంతో వెలవెలబోతున్న పెట్రోల్ బంక్


ఖాన్ యూనిస్ పట్టణంలో కరెంట్ కొరతతో దొరికిన చోటే మొబైల్ చార్జింగ్ పెట్టుకుంటున్న పాలస్తీనియన్లు


ఘటన జరిగిన బార్ వద్ద అప్రమత్తంగా ఉన్న పోలీసులు

అమెరికాలో నరమేధం

18 మందిని కాల్చి చంపిన ఉన్మాది

- ముందుగా ఆడుకుంటున్న చిన్నారులు, తల్లిదండ్రులపై
- అనంతరం సమీపంలోని బార్‌పైకీ కాల్పులు
- హంతకుడు సైనికుడు, మానసిక రోగి!
- కాల్పులకు దిగుతానంటూ గతంలోనూ బెదిరింపులు
- పట్టుకునేందుకు పోలీసుల వేట


స్పేర్‌టైమ్ వద్ద హంతకుడు కాల్పులు జరుపుతున్న దృశ్యం

లెవిస్టన్ (అమెరికా): అమెరికాలో మళ్లీ తుపాకీ పేలింది. మానసిక స్థితి సరిగా లేదని భావిస్తున్న ఓ సైనికుడు నరమేధానికి దిగాడు. చిన్నారులు, వారి తల్లిదండ్రులపై విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డాడు. అనంతరం పారిపోతూ దార్లోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌పైనా కాల్పులకు పాల్పడ్డాడు. ఈ దారుణాల్లో ఏకంగా 18 మంది ప్రాణాలు కోల్పోయారు. కనీసం 13 మందికి పైగా గాయపడ్డారు. మెయిన్ రాష్ట్రంలోని లెవిస్టన్‌లో స్థానిక కాలమానం ప్రకారం బుధవారం రాత్రి వేళ ఈ ఘోరం జరిగింది. కాల్పుల అనంతరం చీకటి చాటున తప్పించుకుని పారిపోయిన హంతకుని కోసం భారీ వేట సాగుతోంది. హంతకుడిని 40 ఏళ్ల రాబర్ట్ కార్డ్‌గా గుర్తించారు. అతడు అమెరికా ఆర్మీ రిజర్వ్‌లో ఆయుధాల ఇన్‌స్ట్రక్టర్‌గా పని చేస్తున్నట్టు సమాచారం. కొంతకాలంగా అతను మానసిక సమస్యలతో బాధపడుతున్నట్టు పోలీసులు తెలిపారు. హంతకుని ఫొటోను విడుదల చేశారు. అందులో అతను చేతిలో ఆటోమేటిక్ రైఫిల్‌తో కన్పిస్తున్నాడు. హంతకుడు పారిపోయేందుకు ఉపయోగించినట్టుగా భావిస్తున్న కారును ఆండ్రోస్కాగిన్ కౌంటీలో స్వాధీనం చేసుకున్నారు. ఈ దారుణంపై అమెరికా అధ్యక్షుడు బైడెన్ మెయిన్ గవర్నర్‌తో మాట్లాడారు.

బౌలింగ్ పోటీలు జరుగుతుండగా...

కాల్పులు జరిగిన స్పేర్‌టైమ్ రిక్రియేషన్స్, షెమెంగీస్ బార్ అండ్ గ్రిల్ రెస్టారెంట్ లెవిస్టన్ శివార్లలోని డౌన్‌టౌన్లో ఉన్నాయి. బుధవారం రాత్రి అక్కడి బౌలింగ్ ఏరియాలో చిన్నారుల బౌలింగ్ లీగ్ జరుగుతోంది. ఆటవిడుపుగా దాంట్లో పాల్గొంటున్న పిల్లలు, వారి తల్లిదండ్రులతో సందడిగా ఉన్న సమయంలో రాబర్ట్ అందులోకి చొరబడి విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డాడు.

హింసాత్మక ప్రవృత్తి

రాబర్ట్‌ది హింసాత్మక ప్రవృత్తి అని పోలీసులు అనుమానిస్తున్నారు. అతని మానసిక పరిస్థితి కూడా సరిగా లేదని తెలిపారు. రెండు వారాల క్రితమే ఓ మానసిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స కూడా తీసుకున్నాడన్నారు. అతను ఎలాంటి సమస్యతో బాధపడుతున్నాడో చెప్పకపోయినా, కంఠధ్వనులు వినిపిస్తున్నాయని ఫిర్యాదు చేసినట్టు చెబుతున్నారు. బౌలింగ్ ఏరియాలో కాల్పుల మోతకు జనం వణికిపోయారు. ప్రాణభయంతో చెల్లాచెదురైపోయారు. హాహాకారాలు చేస్తూ పరుగులు తీశారు.

బెలూన్లను పేలుస్తున్నారనుకున్నాం...

తాను బౌలింగ్ ఏరియాలోకి వెళ్లిన కాసేపటికే వెంటవెంటనే కనీసం 10సార్లు తుపాకీ పేల్చిన శబ్దం విన్నట్టు బ్రెండన్ అనే వ్యక్తి చెప్పాడు. ''ఆ సమయంలో కాళ్లకు బూట్లు తొడుక్కుంటున్నా. సరదాగా బెలూన్లను పేలుస్తున్నారని తొలుత అనుకున్నా. కానీ డోర్ వద్ద చేతిలో తుపాకీతో హంతకున్ని చూసి వణికిపోయా. వెంటనే నేలపై పాక్కుంటూ బౌలింగ్ మెషీన్లోకి దూరి దాక్కున్నా. ఐదారు గంటల పాటు ఉత్తకాళ్లతో గడిపా''అని వివరించాడు. రెయిలీ డెమోంట్ అనే ఆవిడ తల్లిదండ్రులతో కలిసి తన కూతురి ఆట చూస్తోంది. ఆమె తండ్రి రిటైర్డ్ పోలీసాఫీసర్. ''కాల్పులు మొదలు కాగానే అక్కడున్న వాళ్లందరినీ మా నాన్న హుటాహుటిన ఓ మూలకు తరలించాడు. టేబుళ్ల తదితరాలను వారికి అడ్డుగా పెట్టి ఎంతోమంది ప్రాణాలు కాపాడాడు''అని చెప్పింది. బార్‌లో కూడా కాల్పుల శబ్దం వింటూనే సిబ్బంది వెంటనే తలుపులన్నీ మూసేసి లోపలున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

ఎందుకీ కాల్పులు...?

కాల్పులను కళ్లారా చూసిన జోయ్ లెవెస్క్ అనే పదేళ్ల చిన్నారి ఇప్పటికీ దాన్ని తలుచుకుని వణికిపోతోంది! ''బులెట్ నా కాలికి తగులుతూ దూసుకెళ్లింది. ఇలా జరుగుతుందని ఎప్పుడూ ఊహించలేదు. ఎవరైనా ఎందుకిలా ప్రవర్తిస్తారు?''అని ప్రశ్నిస్తోంది. కాల్పుల అనంతరం బౌలింగ్ ఏరియాలో, రెస్టారెంట్లో ఉన్నవాళ్లందరినీ పోలీసులు సమీపంలోని స్కూలుకు తరలించారు.

ఈ ఏడాది 36వ ఘటన

అమెరికాలో ఇది ఈ ఏడాదే ఏకంగా 36వ సామూహిక కాల్పుల ఘటన! ఇక మెయిన్ రాష్ట్రంలో కాల్పుల్లో ఇంతమంది బలవడం ఇదే తొలిసారి. రాష్ట్రంలో 2022 మొత్తంలో పరస్పర కాల్పుల ఘటనల్లో 29 మంది మరణించారు. ఈ రాష్ట్రం వేటకు, షూటింగ్ క్రీడలకు ప్రసిద్ధి. అందుకే ఇక్కడ తుపాకీ కోసం లైసెన్సు కూడా అక్కర్లేదు! తుపాకీ కొనేందుకు లైసెన్సును తప్పనిసరి చేసేందుకు జరిగిన ప్రయత్నాలను స్థానిక ప్రజలే వ్యతిరేకించారు. కనీసం కొనుగోలుదారుల నేపథ్యాన్ని క్షుణ్నంగా తనిఖీ చేయాలన్న ప్రతిపాదనను కూడా బుట్టదాఖలు చేశారు. ఇక కాల్పులు జరిగిన లెవిస్టన్ కేవలం 38 వేల జనాభాతో కూడిన చిన్న పట్టణం. ఇక్కడ ప్రధానంగా ఆఫ్రికన్లు నివసిస్తుంటారు. ప్రస్తుతం పట్టణంలో లాక్‌డౌన్ విధించారు.

నార్త్ కరోలినాలో ఐదుగురు మృతి

క్లింటన్: అమెరికాలో గురువారమే మరో కాల్పుల ఉదంతం చోటుచేసుకుంది. నార్త్ కరోలినాలోని క్లింటన్‌లో హైవే సమీపంలోని ఓ ఇంట్లో ఐదుగురు తూటా గాయాలతో చనిపోయి కన్పించినట్టు పోలీసులు తెలిపారు. ఈ దారుణానికి ఎవరు, ఎందుకు పాల్పడిందీ ఇప్పటికైతే తెలియలేదన్నారు. పరస్పర గొడవలే ఇందుకు దారి తీసి ఉంటాయని అనుమానం వ్యక్తం చేశారు.

గాజాపై భూతల దాడులు

ఉత్తర గాజాలోకి ప్రవేశించిన ఇజ్రాయెల్ పదాతి దళాలు, యుద్ధ ట్యాంకులు

- స్వల్పస్థాయిలో దాడులు.. పలువురు మిలిటెంట్లు హతం!
- అతిత్వరలో పూర్తిస్థాయి యుద్ధం
- గాజాపై 24 గంటల వ్యవధిలో 250 వైమానిక దాడులు

రఫా/వాషింగ్టన్: ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం మరో కీలక దశలోకి ప్రవేశించింది. ఊహించినట్లుగానే ఇజ్రాయెల్ సైన్యం ఉత్తర గాజాపై భూతల దాడులు ప్రారంభించింది. హమాస్ స్థావరాలను నేలమట్టం చేయడానికి ఇజ్రాయెల్ పదాతి దళాలు, యుద్ధ ట్యాంకులు బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సరిహద్దు దాటి గాజా భూభాగంలోకి అడుగుపెట్టాయి. 'లక్ష్యాల'పై స్వల్పస్థాయిలో దాడులు నిర్వహించాయి. గురువారం తెల్లవారుజాము వరకూ ఈ దాడులు కొనసాగాయి. ఉత్తర గాజాపై అతిత్వరలో పూర్తిస్థాయి భూతల యుద్ధం ప్రారంభం అవుతుందని ఇజ్రాయెల్ సైన్యం సంకేతాలిచ్చింది. యుద్ధక్షేత్రాన్ని సిద్ధం చేయడానికే స్వల్పంగా భూతల దాడులు చేశామని గురువారం వెల్లడించింది. చాలామంది మిలిటెంట్లు హతమయ్యారని, హమాస్ మౌలిక సదుపాయాలను, ఆయుధ వ్యవస్థను ధ్వంసం చేశామని పేర్కొంది. గత 24 గంటల్లో గాజాపై దాదాపు 250 వైమానిక దాడులు చేశామని ప్రకటించింది. గాజాలో సహాయక చర్యలకు ఆటంకాలు సృష్టించవద్దని, భూతల దాడులను విరమించుకోవాలని ఐక్యరాజ్యసమితి విజ్ఞప్తి చేసినా ఇజ్రాయెల్ సైన్యం లెక్కచేయకపోవడం గమనార్హం.

ప్రాణనష్టం.. ఊహించలేం

పాలస్తీనా మిలిటెంట్ సంస్థ 'హమాస్' 2007 నుంచి గాజాలో అధికారం చెలాయిస్తోంది. ఈ నెల 7న ఇజ్రాయెల్‌పై హఠాత్తుగా విరుచుకుపడింది. భారీ సంఖ్యలో రాకెట్లు ప్రయోగించింది. హమాస్ దాడుల్లో ఇజ్రాయెల్‌లో 1,400 మందికిపైగా సామాన్య ప్రజలు, సైనికులు మరణించారు. తమ భద్రతకు సవాలు విసురుతున్న హమాస్‌కు బుద్ధి చెప్పడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ సైన్యం ఎదురుదాడికి దిగింది. గాజాపై వైమానిక దాడులు ప్రారంభించింది. ఇరుపక్షాల మధ్య గత 20 రోజులుగా హోరాహోరీ యుద్ధం కొనసాగుతోంది. ఇజ్రాయెల్ దాడుల్లో గాజాలో 7,000 మందికిపైగా పాలస్తీనియన్లు మృత్యువాతపడ్డారు. వీరిలో 2,900 మంది చిన్నపిల్లలు, 1,500 మంది మహిళలు ఉన్నారని గాజా ఆరోగ్య శాఖ వెల్లడించింది. పూర్తిస్థాయిలో భూతల దాడులు మొదలైతే గాజాలో ప్రాణనష్టం ఊహించని స్థాయిలో ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

ఖాన్ యూనిస్‌లో 15 మంది బలి

ఇజ్రాయెల్ సైన్యం గురువారం ఉత్తర గాజాపై భూతల దాడులతోపాటు దక్షిణ గాజాలో వైమానిక దాడులను కొనసాగించింది. ఈ దాడుల్లో ఖాన్ యూనిస్ సిటీలో 8 ఇళ్లు నేలమట్టమయ్యాయి. 15 మంది మరణించారు. మరికొందరు గాయపడ్డారు. సామాన్య ప్రజలకు హాని కలిగించడం లేదని, కేవలం హమాస్ స్థావరాలపైనే దాడులు చేస్తున్నామని ఇజ్రాయెల్ సైన్యం చెబుతోంది. మరోవైపు మిలిటెంట్లు సైతం ఇజ్రాయెల్‌పై రాకెట్ దాడులు కొనసాగిస్తున్నారు. తాజాగా సెంట్రల్ ఇజ్రాయెల్‌లోని పెటా తిక్వా నగరంపై రాకెట్ ప్రయోగించారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లలేదు.

మానవతా సాయం అంతంత మాత్రమే

గాజాలో ఆహారం, నీరు, ఔషధాలు, నిత్యావసరాలు లేక జనం పిట్టల్లా రాలిపోతుండడంతో ఇజ్రాయెల్‌పై ప్రపంచదేశాలు ఒత్తిడి పెంచాయి. ఇజ్రాయెల్ అనుమతితో ఈజిప్టు నుంచి ఇప్పటివరకు 70కి పైగా వాహనాలు గాజాలోకి అడుగుపెట్టాయి. ఈజిప్టు నుంచి అందుతున్న మానవతా సాయం ఏ మూలకూ చాలడం లేదని గాజా అధికారులు చెబుతున్నారు. ఈ సాయం సముద్రంలో నీటిబొట్టంత అని గాజాలోని ఇంటర్నేషనల్ కమిటీ ఆఫ్ ద రెడ్ క్రాస్ ప్రతినిధి విలియమ్ ష్కోమ్‌బర్గ్ అన్నారు. ఆకలితో అలమటించిపోతున్న ప్రజల ప్రాణాలు నిలబెట్టాలంటే ఇంకా ఎన్నో రెట్ల సాయం కావాలని కోరారు.

అల్–జజీరా జర్నలిస్టు భార్య, పిల్లలు మృతి

గాజాపై ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో బుధవారం అంతర్జాతీయ మీడియా సంస్థ అల్–జజీరా సీనియర్ జర్నలిస్టు వాయెల్ దాహ్‌దౌ భార్య, కుమారుడు, కుమార్తె, మనవడు ప్రాణాలు కోల్పోయారు. గాజాలోని నుసీరాత్ శరణార్థుల శిబిరంపై జరిగిన దాడిలో వారు మరణించారు. మరికొందరు కుటుంబ సభ్యులు కనిపించకుండాపోయారు. గురువారం వాయెల్ భార్య, కుమారుడు, కుమార్తె, మనవడి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా తన భార్య, కుటుంబ సభ్యుల మృతదేహాలను చూసి ఆయన కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ దృశ్యాలు ప్రపంచవ్యాప్తంగా సోషల్ మీడియాలో నెటిజన్ల హృదయాలు కలిచివేశాయి. సంతాపం ప్రకటిస్తూ వారు పోస్టులు పెట్టారు. ప్రతీకారం తీర్చుకోవాలంటే మా పిల్లలను బలి తీసుకోవాలా? అని వాయెల్ నిలదీశారు. పాలస్తీనా జాతీయుడైన వాయెల్ చాలా ఏళ్లుగా గాజాలో జర్నలిస్టుగా పనిచేస్తున్నారు. ఇక్కడి ప్రజల దీనగాథలను, ఇజ్రాయెల్ సైన్యం దుశ్చర్యలను బయటి ప్రపంచానికి తెలియజేస్తున్నారు.

ఆ ఎకనామిక్ కారిడార్ వల్లే హమాస్ దాడి!: బైడెన్

ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి పట్ల అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ఇటీవల భారత్‌లో జీ–20 సదస్సులో ప్రకటించిన ఇండియా–మిడిల్ ఈస్ట్–యూరప్ ఎకనామిక్ కారిడార్‌ను హమాస్ మిలిటెంట్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, ఈ ప్రాజెక్టును విరమించుకొనేలా ఒత్తిడి పెంచడానికే ఇజ్రాయెల్‌పై అకస్మాత్తుగా దాడి చేశారన్న వాదన కొంతవరకు తనకు సబబుగానే కనిపిస్తోందని అన్నారు. హమాస్ దాడికి గల కారణంపై తన అంతరాత్మ ఇదే చెబుతోందని వ్యాఖ్యానించారు. అయితే, దీనికి తనవద్ద స్పష్టమైన సాక్ష్యాధారాలు లేవని పేర్కొన్నారు. అమెరికా పర్యటనకు వచ్చిన ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ అల్బానీస్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ఎకనామిక్ కారిడార్ గురించి బైడెన్ ప్రస్తావించడం గత వారం రోజుల వ్యవధిలో ఇది రెండోసారి. రైలు, రోడ్డు మార్గాలతో ఆసియా, మధ్యప్రాచ్యం, యూరప్ దేశాలను అనుసంధానించడానికి ఇండియా–మిడిల్ ఈస్ట్–యూరప్ ఎకనామిక్ కారిడార్‌ను జీ–20 దేశాలు తలపెట్టిన సంగతి తెలిసిందే.

చిన్నారి చూపుల్లో సమాధానంలేని ప్రశ్నలెన్నో!!


గాయాలతో రక్తమోడుతున్న తన తల్లికి ఏమయిందో తెలియక బేలచూపులు చూస్తున్న చిన్నారి. దక్షిణ గాజాలోని నజీర్ ఆస్పత్రిలో తీసిందీ ఫొటో.

ప్రియాంకా గాంధీకి ఈసీ నోటీసులు

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీపై చేసిన 'కవర్ల' వ్యాఖ్యలకు సంబంధించిన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీకి కేంద్ర ఎన్నికల సంఘం గురువారం షోకాజ్ నోటీసులిచ్చింది. అక్టోబర్ 30 సాయంత్రంలోపు వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఈ విషయమై బుధవారం బీజేపీ చేసిన ఫిర్యాదు మేరకు ఈ చర్య తీసుకుంది. మోదీ వ్యక్తిగత మత విశ్వాసాలను ప్రియాంక బాహాటంగా కించపరిచారని బీజేపీ ఆరోపించింది. 'అక్టోబర్ 20న రాజస్తాన్‌లోని దౌసాలో చేసిన ఎన్నికల ప్రసంగంలో మోదీని కించపరిచేలా ప్రియాంక వ్యాఖ్యలు చేశారు. ఒక ఆలయానికి మోదీ ఇచ్చిన విరాళం తాలూకు కవర్‌ను తెరిచి చూస్తే అందులో కేవలం 21 రూపాయలే ఉన్నట్టు టీవీలో చూశానని ఆమె అన్నారు. సరిగ్గా అదే విధంగా పథకాల రూపంలో ప్రజలకు బీజేపీ చూపిస్తున్న కవర్లలో నిజానికి ఏమీ లేదని ఎన్నికల తర్వాత తేలుతోందంటూ ఎద్దేవా చేశారు' అని పేర్కొంది.

బెంగాల్ మంత్రి నివాసాల్లో ఈడీ సోదాలు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ అటవీ శాఖ మంత్రి, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు జ్యోతిప్రియో మల్లిక్ నివాసాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు గురువారం ఉదయం సోదాలు ప్రారంభించారు. బెంగాల్‌లో రేషన్ సరుకుల పంపిణీలో కోట్లాది రూపాయల అవినీతి జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఈడీ అధికారులు కోల్‌కతాలో మంత్రికి చెందిన రెండు నివాసాల్లో సోదాలు ప్రారంభించారు. ఆయన మాజీ వ్యక్తిగత సహాయకుడి ఇళ్లల్లోనూ సోదాలు జరిగాయి. జ్యోతిప్రియో మల్లిక్ గతంలో ఆహార శాఖ మంత్రి పనిచేశారు. ఆ సమయంలోనే రేషన్ పంపిణీలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ కేసులో మంత్రితో సంబంధం ఉన్న ఓ వ్యక్తిని ఈడీ అరెస్టు చేసింది. మంత్రి బ్యాంకు ఖాతాలను క్షుణ్నంగా పరిశీలిస్తున్నామని, అనుమానాస్పద లావాదేవీలపై ఆయనను ప్రశ్నిస్తున్నామని అధికారులు వెల్లడించారు.

అస్సాం సీఎం శర్మకు ఈసీ నోటీసు

న్యూఢిల్లీ: ఛత్తీస్‌గఢ్ ఎన్నికల ప్రచారం సభలో అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన బీజేపీ నేత, అస్సాం ముఖ్యమంత్రి హిమాంత బిశ్వ శర్మకు గురువారం కేంద్ర ఎన్నికల సంఘం నోటీసు జారీ చేసింది. ఛత్తీస్‌గఢ్‌లోని కవార్ధాలో ఈనెల 18వ తేదీన జరిగిన ఎన్నికల ప్రచార సభలో హిమాంత శర్మ మాట్లాడుతూ..'ఒక చోటికి ఒక అక్బర్ వచ్చాడంటే అతడు మరో 100 మంది అక్బర్‌లను పిలుస్తాడు. అందుకే సాధ్యమైనంత త్వరగా అక్బర్‌ను పంపించివేయాలి. అలా చేయలేకపోతే కౌశల్య మాత పుట్టిన ఈ నేల అపవిత్రమవుతుంది' అంటూ రాష్ట్ర కేబినెట్‌లోని ఏకైక ముస్లిం మంత్రి మహ్మద్ అక్బర్‌నుద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా తమకు సమాధానమివ్వాలని ఆదేశించింది. ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీకి నవంబర్‌లో ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే.

లక్ష డాలర్ల నోట్ల వర్షం

సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ వినూత్న యత్నం

ప్రాగ్: ఆకాశంలో నుంచి డాలర్ల నోట్లు వర్షంలా వచ్చి పడుతుంటే..? చూసిన వారెవరైనా ఏం చేస్తారు? ఆత్రంగా వచ్చి ఏరుకుంటారు..! అచ్చంగా చెక్ రిపబ్లిక్‌లో జరిగిందిదే.. ఆ దేశానికి చెందిన టీవీ వ్యాఖ్యాత, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ ఇదే తరహాలో హెలికాప్టర్ నుంచి అక్షరాలా లక్ష డాలర్ నోట్లను జార విడిచాడు. కామిల్ బర్తోషెక్ అనే ఇన్‌ఫ్లూయెన్సర్ 'వన్‌మాన్ షో: ది మూవీ'అనే సినిమాలో నటించాడు. సినిమా ప్రమోషన్‌లో భాగంగా యూజర్ల కోసం ఓ కాంటెస్ట్ నిర్వహించాడు. ఆ సినిమా చూసి, అందులో ఉన్న పజిల్‌ను పరిష్కరించిన మొదటి వ్యక్తికి లక్ష డాలర్లు బహుమతిగా ఇస్తానని ప్రకటించాడు. అందుకోసం యూజర్లు తమ పేర్లను ప్రత్యేక వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించాడు. కాంటెస్ట్‌లో చాలామంది పాల్గొన్నప్పటికీ ఆ పజిల్‌ను ఎవరూ పరిష్కరించలేకపోయారు. దీంతో, బహుమతిగా ఇవ్వాలనుకున్న లక్ష డాలర్లను పేర్లను రిజిస్టర్ చేసుకున్న వారికి ఇవ్వాలనుకున్నాడు. ఇందుకోసం వారందరికీ సీక్రెట్ కోడ్‌తో మెయిల్ పంపారు. అందులో హెలికాప్టర్ నుంచి నగదును జార విడిచే ప్రాంతానికి సంబంధించిన క్లూ ఇచ్చాడు. మెయిల్‌లో తెలిపినట్లుగానే కామిల్ ఆదివారం ఉదయం 6 గంటలకు నింబుర్క్ జిల్లా లైసా నాడ్ లబెమ్ అనే ప్రాంతంలోని ఖాళీ ప్రదేశంలో డాలర్ల నోట్లను జార విడిచాడు. దీనికి సంబంధించిన వీడియోను ఫస్ట్ రియల్ మనీ రెయిన్'పేరుతో తన ఇన్‌స్టా ఖాతాలో షేర్ చేశాడు. డబ్బును ఉంచిన ఒక పెద్ద కంటెయినర్‌ను హెలికాప్టర్‌తో ఆకాశంలోకి తీసుకెళ్లి ముందుగా ప్రకటించిన ఖాళీ ప్రదేశంలో నగదును జార విడిచాడు. అప్పటికే అక్కడ బ్యాగులు, ఎక్కువ నోట్లు పోగేసుకోవాలనే ఆలోచనతో కొందరు గొడుగులతో అక్కడికి చేరుకున్నారు. సుమారు నాలుగు వేల ఆ డబ్బు మొత్తాన్ని గంటలోపే సేకరించుకున్నారని, ఆ సమయంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదని కామిల్ తెలిపాడు. అన్ని నోట్లపైనా క్యూఆర్ కోడ్ ఉందని, ఆ డబ్బును కావాలనుకుంటే ఆన్‌లైన్ వేదికగా దానం చేయవచ్చని కూడా చెప్పాడు.

8 మంది భారత నేవీ మాజీ ఉద్యోగులకు ఖతార్ కోర్టు మరణశిక్ష

తీవ్రంగా షాక్‌కు గురయ్యామన్న భారత్

న్యూఢిల్లీ: ఖతార్‌లోని ఓ న్యాయస్థానం ఎనిమిది మంది భారత నేవీ మాజీ ఉద్యోగులకు గురువారం మరణశిక్ష విధించింది. దీనిపై భారత్ తీవ్రంగా స్పందించింది. ఈ పరిణామం అత్యంత ఆశ్చర్యకరమని పేర్కొంది. అత్యంత ప్రాధాన్యం కలిగిన అంశంగా భావించి, ఖతార్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపింది. అరెస్టయిన వారిలో కెప్టెన్ సౌరభ్ వశిష్ఠ్, కమాండర్ పూర్ణేందు తివారీ, కెప్టెన్ బీరేంద్ర కుమార్ వర్మ, కమాండర్ సంజీవ్ గుప్తా, కమాండర్ సుగుణాకర్ పాకాల, అమిత్ నాగ్‌పాల్, శైలర్ రాగేశ్ అనే వారున్నారు. వీరంతా నేవీలో కనీసం 20 ఏళ్ల అనుభవం ఉంది. ఖతార్‌లోని అల్ దహ్రా అనే సెక్యూరిటీ సంస్థలో ఆ దేశ నేవీ సిబ్బందికి గత కొన్నేళ్లుగా శిక్షణనిస్తున్నారు. సంస్థకు చెందిన ఒక అధికారి అరెస్ట్‌తో శిక్షణ కార్యకలాపాలు నిలిచిపోయాయి. అనంతరం భారతీయ నేవీ మాజీ సిబ్బందిపై గూఢచర్యం ఆరోపణల నేపథ్యంలో అధికారులు ఆగస్టులో అరెస్ట్ చేశారు. అయితే, ఆ ఆరోపణల వివరాలను మాత్రం వారు వెల్లడించలేదు. అక్కడి ప్రభుత్వం అనుమతి మేరకు ఖతార్‌లోని భారత దౌత్యాధికారి జైలులోని వారిని ఈనెల ఒకటో తేదీన కలుసుకుని మాట్లాడారని విదేశాంగ శాఖ తెలిపింది. దీనిపై ఈ సమయంలో వ్యాఖ్య చేయడం సరికాదని వివరించింది.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం షిర్డీలోని సాయిబాబా ఆలయాన్ని సందర్శించుకుని, పూజలు చేశారు. ఆ తర్వాత ప్రధాని మోదీ అహ్మద్‌నగర్ జిల్లాలో నిల్వాండే డ్యామ్ వద్ద జలాభిషేకం చేశారు. జలాశయం ఎడమ గట్టు కాల్వను ప్రారంభించారు. అనంతరం షిర్డీలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్నారు.



జమ్మూలో భారత సైనిక పోస్టులపై పాక్ రేంజర్ల కాల్పులు

జమ్మూ/న్యూఢిల్లీ: పాకిస్తాన్ రేంజర్లు భారత జవాన్లను రెచ్చగొట్టే చర్యలకు పాల్పడ్డారు. గురువారం రాత్రి జమ్మూలోని అర్నియా సెక్టార్‌లో అంతర్జాతీయ సరిహద్దు వద్ద భారత సైనిక పోస్టులపై కాల్పులు జరిపారని బీఎస్‌ఎఫ్ అధికారులు తెలిపారు. తాము తగిన రీతిలో ప్రతిస్పందిస్తున్నామని, పాకిస్తాన్ రేంజర్లకు ధీటుగా సమాధానం చెబుతున్నామని వెల్లడించారు. పాకిస్తాన్ భూభాగం నుంచి రాత్రి 8 గంటలకు కాల్పులు ప్రారంభమయ్యాయని, ఇంకా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ నెల 17న అర్నియా సెక్టార్‌లో పాక్ రేంజర్ల కాల్పుల్లో బీఎస్‌ఎఫ్ జవాను ఒకరు గాయపడ్డారు.

చొరబాటుకు యత్నించిన అయిదుగురు ముష్కరులు హతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో గురువారం నియంత్రణ రేఖ (ఎల్‌వోసీ)వెంబడి గుర్తు తెలియని వ్యక్తుల చొరబాటు యత్నాన్ని భద్రతా బలగాలు తిప్పికొట్టాయి. ఈ సందర్భంగా మచ్చిల్ సెక్టార్‌లో జరిపిన కాల్పుల్లో అయిదుగురు తీవ్రవాదులు హతమైనట్లు అదనపు డీజీపీ విజయ్ కుమార్ చెప్పారు. వారిని గుర్తించాల్సి ఉందన్నారు. ఆ ప్రాంతంలో కూంబింగ్ కొనసాగుతోందన్నారు.

ఎన్నికల రాష్ట్రాల్లో 'వికసిత్ భారత్ సంకల్ప్' వద్దు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం తమ పథకాలు తదితరాల గురించి ప్రజలకు వివరించేందుకు తలపెట్టిన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రను అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న ఐదు రాష్ట్రాల్లో డిసెంబర్ ఐదో తేదీదాకా చేపట్టరాదని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబాకు గురువారం ఈ మేరకు లేఖ రాసింది. 'నవంబర్ 20 నుంచి మొదలవుతున్న ఈ యాత్ర కోసం జిల్లా రథ్ ప్రహారీలుగా సీనియర్ ప్రభుత్వాధికారులను నామినేట్ చేయాల్సిందిగా రాష్ట్రాలకు కేంద్రం లేఖ రాసినట్టు మా దృష్టికి వచ్చింది. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉన్న ఐదు రాష్ట్రాల్లో, నాగాలాండ్‌లో ఉపఎన్నిక జరుగుతున్న తపీ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో డిసెంబర్ ఐదో తేదీదాకా ఇలాంటి కార్యకలాపాలేవీ చేపట్టరాదు' అని ఆదేశించింది.

గ్రీన్‌కార్డు దరఖాస్తుదారులకు ఎంప్లాయ్‌మెంట్ ఆథరైజేషన్ కార్డు

వాషింగ్టన్: అమెరికాలో శాశ్వత నివాసం కోసం గ్రీన్‌కార్డు పొందాలంటే దరఖాస్తుదారులు చాలా ఏళ్లు ఎదురు చూడాల్సి వస్తోంది. ఇలాంటి వారికి ఊరట కల్పిస్తూ ఎంప్లాయ్‌మెంట్ ఆథరైజేషన్ కార్డు(ఈఏడీ) అందజేయాలని వైట్‌హౌస్ కమిషనర్ గురువారం ప్రభుత్వానికి అధికారికంగా సిఫార్సు చేశారు. అధ్యక్షుడు జో బైడెన్ ఆమోదముద్ర వేస్తే ఈఏడీ మంజూరు ప్రక్రియ ప్రారంభం కానుంది. దీనివల్ల లక్షలాది మంది భారతీయులకు లబ్ధి చేకూరుతుంది.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

శుక్రవారం, 27, అక్టోబర్, 2023




కలెక్టర్‌ను కలిసిన ఉయ్యూరు ఆర్డీవో

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లా కలెక్టర్ పి. రాజాబాబును ఉయ్యూరు ఆర్డీవో దాసి రాజు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు.



ముగిసిన బతుకమ్మ సంబరాలు

పెనుగంచిప్రోలు: బతుకమ్మ సంబరాలు గురువారం రాత్రితో ముగిశాయి. పెనుగంచిప్రోలులోని వివిధ ఆలయాల వద్ద నిర్వహించిన వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ ఆడారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 525.30 అడుగుల వద్ద ఉంది. జలవిద్యుత్ కేంద్రానికి 23,324, ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

స్కూల్ గేమ్స్ ఖోఖో జట్ల ఎంపిక



గుడివాడ టౌన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్కూల్ గేమ్స్ అండర్-14, అండర్-17 ఖోఖో బాలుర జట్ల ఎంపిక గురువారం జరిగింది. స్థానిక ఎస్పీఎస్ హైస్కూల్‌లో ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన పలు ప్రాంతాల క్రీడాకారులు వివిధ జట్ల ద్వారా ఈ ఎంపికలో పాల్గొనగా వ్యాయామ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఈ ఎంపిక జరిగినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు మడకా ప్రసాద్ తెలిపారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన వివరించారు. ఎంపికైన జట్లు చిత్తూరు జిల్లా బంగారుపాణ్యం, కాకినాడలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ఐసీడీఎస్‌లో కాంట్రాక్టు పోస్టులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారత కార్యాలయంలో అంగన్‌వాడీ, పోషణ్ అభియాన్ ప్రపంచ బ్యాంకు ప్రాజెక్ట్ నందు కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెలక్షన్ కమిటీ చైర్మన్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కోఆర్డినేటర్, ప్రాజెక్ట్ అసిస్టెంట్, బ్లాక్ కోఆర్డినేటర్ (ఆరు) పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు ఈ ఏడాది జూలై 1 నాటికి 25 సంవత్సరాల నుంచి 40 సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండాలన్నారు. జిల్లా అధికారిక వెబ్ సైట్ ఎన్టీఆర్.ఏపీ.జీఓవీ.ఇన్ నుంచి దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. దానిని పూర్తి చేసి అన్నీ ధ్రువీకరణపత్రాల నకళ్లు గెజిటెడ్ అధికారిచే అటెస్టేషన్ చేయించాలన్నారు. వాటిని నవంబర్ 7వ తేదీ లోపు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమం, సాధికారత-అధికారి వారి కార్యాలయం, కానూరు, విజయవాడ-520007 వారికి రిజిస్టర్ పోస్ట్ లేదా స్వయంగా సమర్పించాలని సూచించారు.

స్విమ్మింగ్ శిక్షకులకు ఆహ్వానం

మచిలీపట్నంటౌన్: కృష్ణాజిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో కంకిపాడు మండలం ఈడుపుగల్లులో పే అండ్ ప్లే పథకంలో స్విమ్మింగ్ శిక్షణ ఇచ్చేందుకు అర్హత కలిగిన శిక్షకులు, లైఫ్ సేవర్స్ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ ముఖ్య శిక్షకురాలు ఝాన్సీలక్ష్మి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న శిక్షకులు, లైఫ్‌సేవర్స్ వారు క్రీడలో సాధించిన ప్రతిభకు సంబంధించిన ధ్రువీకరణపత్రాలు, అనుభవ పత్రాలు, జనన, విద్యార్హత పత్రాలు, ఆధార్‌కార్డులను dsakrishna1@gmail.comకు ఈ నెల 31వ తేదీలోగా పంపాలన్నారు. మరిన్ని వివరాలకు 9494643658లో సంప్రదించాలన్నారు.

రేపు కోటప్పకొండ ఆలయం మూసివేత

నరసరావుపేట రూరల్: చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని కోటప్పకొండలోని త్రికోటేశ్వర స్వామి దేవస్థానాన్ని ఈనెల 28న సాయంత్రం 4గంటలకు మూసివేస్తున్నట్టు ఆలయ ఈఓ జి.శ్రీనివాసరెడ్డి గురువారం తెలిపారు. ఈనెల 29న ఉదయం 9గంటలకు శైవాగమ శాస్త్ర ప్రకారం సంప్రోక్షణ జరిపి భక్తులను దర్శనానికి అనుమతిస్తామని వెల్లడించారు.

నరకాసుర చిత్రబృందం సందడి



పెదకాకాని: యువనటీనటులు రక్షిత్ అట్లూరి, అపర్ణా జనార్ధన్, సంకీర్తనా విపిన్ ప్రధాన పాత్రధారులుగా నటించిన నరకాసుర చిత్రబృందం గురువారం వీవీఐటీ కళాశాలను సందర్శించింది. సెబాస్టిన్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం నరకాసుర నవంబర్ 3న విడుదల కానుంది. కార్యక్రమంలో చిత్ర నటులు, వీవీఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

21,157 బస్తాల మిర్చి రాక

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 21,157 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 20,162 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10,500 నుంచి 25,000 వరకు లభించింది.

అరుణకీలాద్రి



మహా మండపం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం



విజయవాడ పద్మావతి ఘాట్‌లో జల్లు స్నానాలు చేస్తున్న భవానీ భక్తులు

- ఇంద్రకీలాద్రిపై కొనసాగుతున్న భవానీల రద్దీ
- ఎరుపెక్కిన ఆలయ పరిసరాలు
- నేటి నుంచి ఆర్జిత సేవలు యథాతథం
- ఉభయదాతలకు అవకాశం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దీక్ష విరమణలకు విచ్చేసిన భవానీలతో ఇంద్రకీలాద్రి పరిసరాలు ఎరుపు వర్ణాన్ని సంతరించుకున్నాయి. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో భవానీల రద్దీ కొనసాగుతోంది. గురువారం తెల్లవారుజామున నాలుగు గంటలకు ప్రారంభమైన భవానీల రద్దీ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. దుర్గమ్మ దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు ఆలపించిన అమ్మవారి కీర్తనలు, నామజపంతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. శుక్రవారం నుంచి అన్ని ఆర్జిత సేవలు భక్తులకు అందుబాటులోకి రానుండగా, అమ్మవారి దర్శనం నిమిత్తం దేవస్థానం అన్ని దర్శన టికెట్ల విక్రయాలను శుక్రవారం నుంచి ప్రారంభించనుంది.

తెల్లవారుజాము 4 గంటల నుంచే..

దసరా ఉత్సవాలు ముగిసి మూడు రోజులవుతున్నా భవానీల రద్దీ కొనసాగుతూనే ఉంది. తెల్లవారుజామున నాలుగు గంటలకు అమ్మవారికి సుప్రభాత సేవ అనంతరం భవానీలను దర్శనానికి అనుమతించారు. అయితే రాత్రి 12 గంటల నుంచే క్యూలైన్‌లో దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు, భవానీల తాకిడి పెరిగిపోవడంతో పోలీసులు ఆలయ అధికారులకు సమాచారం అందించారు. దీంతో రాత్రి 12.30 గంటలకు టోల్‌గేట్ల వద్ద నుంచి భక్తులను, భవానీలను కొండపైకి అనుమతించారు. దీంతో తెల్లవారుజామున నాలుగు గంటలకు అమ్మవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. భవానీలు, భక్తుల రద్దీ నేపథ్యంలో రూ.100, రూ.300, రూ.500 టికెట్ క్యూలైన్లలోనూ భక్తులను ఉచితంగా అమ్మవారి దర్శనానికి అనుమతించారు. గురువారం రాత్రి 11 గంటల వరకు భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతించారు. భవానీల రాకతో అమ్మవారి ఆలయంతో పాటు ఆలయ పరిసరాలు, మహామండపం దిగువన ఇరుముడి సమర్పణ కౌంటర్లు, అన్న ప్రసాద వితరణ కేంద్రం, కనకదుర్గనగర్, లడ్డూ ప్రసాదం కౌంటర్లతో పాటు కెనాల్‌రోడ్డు ఎరుపు వర్ణాన్ని సంతరించుకుంది. కెనాల్‌రోడ్డులో పండుగ వాతావరణం కనిపించింది.



ఆలయ ప్రాంగణంలో కొబ్బరి చిప్పలు

అమ్మవారిని దర్శించుకున్న భవానీలు, భక్తులు ఇష్టానుసారంగా ఆలయ ప్రాంగణంలోనే కొబ్బరి కాయలను కొట్టడంతో రావి చెట్టు, ఆర్జితసేవ కౌంటర్, నటరాజ స్వామి వారి ఆలయం మెట్లు, ఉచిత ప్రసాదం పంపిణీ కేంద్రం, రాధా కృష్ణ విగ్రహం వరకు ఎక్కడ చూసినా కొబ్బరి చిప్పలే కనిపించాయి. దీంతో ఆలయ అధికారులు కొబ్బరి చిప్పలను వెంటనే తరలించాలని కాంట్రాక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. భక్తులెవరూ కొబ్బరి కాయలను కొండపై కొట్టకుండా ప్రత్యేకంగా సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేసినా ఫలితం లేకుండా పోయింది.

ఆర్జిత సేవలకు ఉభయదాతలు

దసరా ఉత్సవాలు, భవానీల రద్దీ తగ్గుముఖం పట్టడంతో శుక్రవారం నుంచి అమ్మవారి సన్నిధిలో నిత్య ఆర్జిత సేవలకు ఉభయదాతలను అనుమతిస్తున్నారు. దసరా ఉత్సవాలు ముగిసిన తర్వాత నిత్య ఆర్జిత సేవలు కొనసాగగా, భవానీల రద్దీ నేపథ్యంలో ఉభయదాతలను అనుమతించలేదు. శుక్రవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు అమ్మవారి అంతరాయంలో నిర్వహించే ఖడ్గమాలార్చనకు పరిమిత సంఖ్యలో ఉభయదాతలను అనుమతించాలని ఆలయ అధికారులు నిర్ణయించారు. ఇక లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, శాంతి కల్యాణం, చండీహోమంలో ఉభయదాతలు పాల్గొనేందుకు అవకాశం కల్పించారు. మరో వైపున అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తుల కోసం దేవస్థానం దర్శన టికెట్ల విక్రయాలను శుక్రవారం నుంచి ప్రారంభించింది. సర్వ దర్శనానికి రెండు క్యూలైన్లతో పాటు రూ. 100, రూ.300, రూ. 500 టికెట్లను కౌంటర్లలో భక్తులకు అందుబాటులో ఉంచారు.

నూతన కార్యవర్గం ఎంపిక

గుడివాడ టౌన్: ఆంధ్రప్రదేశ్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ కృష్ణా జిల్లా నూతన కార్యవర్గ ఎంపిక గురువారం స్థానిక ఎస్పీఎస్ హైస్కూల్‌లో జరిగింది. ఈ ఎంపికలో నూతన కార్యవర్గ గౌరవాధ్యక్షుడిగా డి. ఆనంద్‌రెడ్డి, అధ్యక్షులుగా తోట అజయ్‌కుమార్, సీహెచ్ చంద్రశేఖర్, కార్యదర్శి మడకా ప్రసాదు, కోశాధికారి పి. వీరేంద్రబాబు, కార్య నిర్వహణ కార్యదర్శిగా పి. రవీంద్రబాబు, ఉపాధ్యక్షులుగా అప్పికట్ల జవహర్‌బాబు, ఎం. వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా బి. శ్రీగంగ, మహిళా కార్యదర్శిగా కె. అనూరాధ ఎంపికైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన సీహెచ్ సుధాకర్ తెలిపారు.

ఇళ్ల క్రమబద్ధీకరణపై పరిశీలన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని మధురానగర్ ఇంధిరాగాంధీ లేబర్ కాలనీ వాసుల ఇళ్లను క్రమబద్ధీకరించేందుకు చట్ట ప్రకారం సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. గురువారం లేబర్ కాలనీలో ఇళ్లను రెవెన్యూ, సర్వే అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంధిరాగాంధీ లేబర్ కాలనీ న్యూ టౌన్ షిప్-7లో 6.92 ఎకరాల విస్తీర్ణంలో 201 మంది నివాసం ఉంటున్నారన్నారు. వారి ఇళ్లను క్రమబద్ధీకరించాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు తన దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని కోరారన్నారు. దీనిపై రెవెన్యూ, సర్వే అధికారులతో క్షేత్రస్థాయిలో సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నామన్నారు. కాలనీని పరిశీలించిన వారిలో నార్త్ తహసీల్దార్ ఎం. మాధురి, సర్వేయర్ ప్రసాద్ నాయక్, వీఎంసీ అధికారులు శ్రీనివాస్ ఉన్నారు.



లేబర్ కాలనీలో ఇళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

త'రుణం'.. ఆసన్నం



మాట్లాడుతున్న ఎంపీ బాలశౌరి చిత్రంలో కలెక్టర్ రాజాబాబు, జెడ్పీ చైర్ పర్సన్ హారిక, ఎమ్మెల్యే కైలే అనిల్, జేసీ అపరాజితాసింగ్, బ్యాంకు అధికారులు

ప్రభుత్వ పథకాలకు బ్యాంకర్ల సహకారం అవసరం

- కౌలు రైతులకు ఉదారంగా రుణాలు ఇవ్వాలి
- యువత ఉపాధికీ తోడ్పాటునందించాలి
- ప్రగతి పనులకు సహకరించాలి
- 'దిశ' సమావేశంలో బ్యాంకర్లతో ఎంపీ బాలశౌరి

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో కౌలు రైతులకు చట్టప్రకారం బ్యాంకు అధికారులు రుణాలు ఇవ్వాలని బందరు పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి అన్నారు. జిల్లా పరిషత్ సమావేశపు హాలులో కృష్ణాజిల్లా అభివృద్ధి, సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశాన్ని ఎంపీ బాలశౌరి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు వివిధ పథకాల లబ్ధిదారులకు చేరేలా ప్రభుత్వశాఖలు తీసుకుంటున్న చర్యలపై ఎంపీ సమీక్షించారు. తొలుత కౌలురైతులకు సీసీ కార్డులు జారీ, అర్హులైన కౌలు రైతులకు రుణాలు మంజూరు వంటి అంశాలపై వ్యవసాయశాఖ తీసుకున్న చర్యలపై ఆయన మాట్లాడారు. ముఖ్యంగా కౌలు రైతులకు రుణాల మంజూరుకు బ్యాంకర్లు చెబుతున్న కారణాలు సహేతుకంగా లేవని, ఉదారంగా విరాళాలు అందించాలన్నారు.

పీఎంఈజీపీకి ప్రోత్సాహం..

ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం (పీఎంఈజీపీ) ద్వారా జిల్లా పరిశ్రమలశాఖకు అందిన దరఖాస్తులపై రుణాల మంజూరుకు ఆయా బ్యాంకుల ద్వారా ఇచ్చిన రుణాల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. కొన్ని బ్యాంకులు ష్యూరిటీ, సెక్యూరిటీ లేకుండా రుణాలు ఇవ్వటం నిలిపివేశారని పరిశ్రమలశాఖ జీఎం వెంకట్రావు సభ దృష్టికి తీసుకురావచ్చారు. దీనిపై ఎంపీ బాలశౌరి స్పందిస్తూ నిరుద్యోగ యువతకు ఉపాధి లక్ష్యంగా ఈ పథకాలు అమలు చేస్తున్నామని బ్యాంకు అధికారులు రుణ మేళాలు నిర్వహించి అధికశాతం మందికి రుణాలు మంజూరు చేయాలన్నారు.

తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు..

తీరప్రాంత గ్రామాలకు తాగునీటిని సరఫరా చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీ బాలశౌరి అధికారులకు సూచించారు. ఆయా పంచాయతీల పరిధిలో ఉన్న ట్రాక్టర్లు, ట్యాంకర్ల ద్వారా శివారు గ్రామప్రజలకు నీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అవనిగడ్డ నియోజకవర్గం, కృత్తివెన్ను మండలంలోని శివారు గ్రామాలకు నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జలజీవన్ మిషన్, సీఎస్ఆర్ నిధుల ద్వారా గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు తాగునీటి కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. గూడూరు మండలంలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని ఎంపీపీ సంగా మధుసూదనరావు సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ రానున్న పది రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామన్నారు.

ఆరోగ్య సమస్యలపై..


పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలను మెరుగుపరిచి ఇచ్చిన పరికరాలను సద్వినియోగం చేసుకుని వైద్యసహాయం అందించాలని ఎంపీ సూచించారు. రూ. 2.50 కోట్లతో అన్ని రకాల వైద్యపరికరాలతో ఉన్న హైటెక్ బస్సును సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నామని దీని ద్వారా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి నివారించేందుకు చర్యలు తీసుకోవాలని వైద్యశాఖ అధికారులకు సూచించారు. మచిలీపట్నం కలెక్టరేట్‌లో అధునాతన సమావేశపు హాలు నిర్మాణానికి బ్యాంకర్లు సీఎస్ఆర్ నిధులు కేటాయించాలన్నారు.

బందరు రైల్వేస్టేషన్ అభివృద్ధికి రూ. 25 కోట్లు..

మచిలీపట్నం రైల్వేస్టేషన్‌ను అమృత్ స్టేషన్ పథకంలో భాగంగా రూ. 25 కోట్లతో సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీ బాలశౌరి తెలిపారు. ప్రయాణికులకు లిఫ్ట్ సౌకర్యంతో పాటు ప్లాట్ ఫారాలపై షెల్టర్ల నిర్మాణం, స్టేషన్ ఎలివేషన్ తదితర సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పీఎం గతిశక్తి పథకం ద్వారా మచిలీపట్నం - చెన్నై రైలు మార్గం నిర్మాణానికి సంబంధించి డీపీఆర్ తయారుచేయాలని, ఈ మార్గం ద్వారా 60కిలో మీటర్ల ప్రయాణం తగ్గే అవకాశం ఉందని ఎంపీ చెప్పారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, కలెక్టర్ రాజాబాబు, పామర్రు శాసనసభ్యులు కైలే అనిల్‌కుమార్ మాట్లాడారు.

పవర్ గ్రిడ్‌తో ఒప్పందం..

జిల్లాలో సురక్షిత మంచినీరు అందించేందుకు, తాగునీటి పథకాల అభివృద్ధి, ఫిల్టర్‌బెడ్స్ ఏర్పాటు కోసం రూ. 4.15 కోట్ల సీఎస్ఆర్ నిధులతో చేపట్టేందుకు పవర్ గ్రిడ్ కార్పొరేషన్ అధికారులు కలెక్టర్ పి. రాజాబాబుకు ఒప్పంద పత్రాలను అందజేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అపరాజితాసింగ్, స్టేట్ బ్యాంక్ జనరల్ మేనేజర్ ఎ. ప్రవీణ్‌కుమార్, ఇండియన్ బ్యాంక్ జనరల్ మేనేజర్ గణేష్‌రామన్, ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ వీవీఆర్‌కే సుబ్రహ్మణ్యం, యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ కె. వెంకట్రావు, జిల్లా అధికారులు, బ్యాంకర్లు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీపీలు పాల్గొన్నారు.



పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ నిధుల ఒప్పంద పత్రాలతో ఎంపీ బాలశౌరి, కలెక్టర్ రాజాబాబు

ఆలయానికి పంచలోహ విగ్రహాలు అందజేత



ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): మండల పరిధిలోని ఉత్తరచిరువోలులంకలో వేంచేసియున్న శ్రీ పెద గురువమ్మ, చిన్న గురవమ్మ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను హైదరాబాద్‌కు చెందిన నడకుదుటి రాజ్యలక్ష్మి శంకర్ ఆలయ కమిటీ చైర్మన్ నడకుదుటి గోవిందరావుకు అందజేశారు. ఉదయం అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉత్సవ విగ్రహాలను ఆలయ ప్రాంగణంలో చైర్మన్‌కు అందించారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులను ఆలయ మర్యాదలతో సత్కరించారు. కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందికి అభినందనలు

ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె. రాణా

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు విజయవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించిన పోలీసు సిబ్బంది, వివిధ ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, మీడియా ప్రతినిధులకు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె. రాణా ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ మేరకు గురువారం పోలీస్ కమాండ్ కంట్రోల్ కార్యాలయంలో ఇతర జిల్లాల నుంచి దసరా మహోత్సవాల బందోబస్తు నిర్వహించిన పోలీస్ అధికారులకు కమిషనర్ కనకదుర్గమ్మవారి ఫొటో, శేష వస్త్రం, లడ్డూ ప్రసాదం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ శరన్నవరాత్రి ఉత్సవాల వేడుకల్లో భక్తుల రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ క్రమబద్ధీకరిస్తూ, ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలకు ఆస్కారం లేకుండా అంకిత భావంతో, బాధ్యతగా సిబ్బంది విధులు నిర్వర్తించి ఉత్సవాలు విజయవంతం చేశారన్నారు. కార్యక్రమంలో డీసీపీలు విశాల్ గున్ని, అజిత వేజెండ్ల, సీఎస్‌డబ్ల్యూ డీసీపీ ఏబీటీఎస్ ఉదయరాణి, అడ్మిన్ డీసీపీ ఎం.సత్తిబాబు, క్రైమ్ ఏడీసీపీ పి.వెంకటరత్నం, ఎస్బీ ఏడీసీపీ సీహెచ్ లక్ష్మీపతి, ఏసీపీలు, ఇతర జిల్లాల నుంచి వచ్చిన పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



పోలీసు సిబ్బందికి అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాన్ని అందిస్తున్న సీపీ టి.కె. రాణా

ఆకట్టుకున్న ఆయుధం

బందరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఓపెన్ హౌస్

కోనేరుసెంటర్(మచిలీపట్నం): పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం కృష్ణా జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని విద్యార్థులతో కలిసి రిబ్బన్ కత్తిరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి గాలిలోకి శాంతి కపోతాలను ఎగురవేశారు. ఈ కార్యక్రమానికి మచిలీపట్నంలోని వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు హాజరయ్యారు. ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పోలీసులు శాంతిభద్రతలు కాపాడటానికి, సంఘ విద్రోహ శక్తులను నిరోధించడానికి వినియోగించే అత్యాధునిక ఆయుధాలు, వివిధ పోలీసు విభాగాలకు సంబంధించిన పరికరాల పనితీరుపై ఆయా విభాగాల సిబ్బంది వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ స్వయంగా ఆయుధాల పనితీరు, వాటిని ఏ విధంగా ఉపయోగించేది, ఏ సందర్భంలో ఎలా హ్యాండిల్ చేసేది వంటి విషయాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ హరిబాబు, డీఎస్పీ మాధవరెడ్డి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



గన్ చేతిలో పెట్టుకొని చూస్తున్న విద్యార్థి



పిస్టళ్లను పరిశీలిస్తున్న విద్యార్థులు



పిస్టల్ పనితీరును విద్యార్థులకు వివరిస్తున్న ఎస్పీ జాషువా

సామర్థ్య సర్వేకు సర్వం సిద్ధం

- నవంబరు 3న నిర్వహించనున్న ఎస్ఈఏఎస్–2023 సర్వే
- కృష్ణా జిల్లాలో 987 పాఠశాలల ఎంపిక
- పరీక్షకు హాజరుకానున్న 24168 మంది విద్యార్థులు
- సన్నద్ధమైన జిల్లా విద్యాశాఖ


ఈడుపుగల్లులో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు

కంకిపాడు: విద్యార్థుల్లో దాగి ఉన్న సామర్థ్యాలను తెలుసుకునేందుకు విద్యాశాఖ సన్నద్ధమైంది. దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే -2023 నవంబరు 3వ తేదీన నిర్వహించనుంది. ఇందుకు కృష్ణా జిల్లా వ్యాప్తంగా 987 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను ఎంపిక చేసింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు చెందిన 3, 6, 9 తరగతులకు చెందిన 24168 మంది విద్యార్థులు సర్వేలో భాగస్వాములు కానున్నారు. వివిధ అంశాల్లో నిర్వహించే పరీక్ష ద్వారా విద్యార్థుల సామర్థ్యాలను లెక్కతేల్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రానున్న రోజుల్లో మరింత పటిష్టంగా విద్యా ప్రణాళికలు రూపొందించేందుకు ఈ సర్వే దోహదపడనుంది. దీంతో విద్యాశాఖ అధికారులు ఎస్ఈఏఎస్‌ను సమర్థంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు.

కృష్ణాజిల్లాలో 987 పాఠశాలల ఎంపిక....

జిల్లా వ్యాప్తంగా ఉన్న 25 మండలాల్లో స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే–2023కు 987 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలను ఎంపిక చేశారు. 24168 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. 3వ తరగతి విద్యార్థులు 7604 మంది, 6వ తరగతి విద్యార్థులు 8424 మంది, 9వ తరగతి విద్యార్థులు 8140 మంది విద్యార్థులకు అభ్యసనా సామర్థ్యాల సర్వే నిర్వహించనున్నారు. 3వ తరగతి విద్యార్థుల్లో 915 మంది తెలుగు, 6558 మంది ఆంగ్లం, 131 మంది ఉర్దూ మాధ్యమంలో పరీక్ష రాయనున్నారు. 6వ తరగతి విద్యార్థుల్లో 1063 మంది తెలుగు, 7306 మంది ఆంగ్లం, 55 మంది ఉర్దూ, 9వ తరగతి విద్యార్థుల్లో 1417 మంది తెలుగు, 6723 మంది ఆంగ్లం మాధ్యమాల్లో పరీక్ష రాయబోతున్నారు.

పరీక్ష నిర్వహణ ఇలా......

గతంలో మాదిరిగా ఈవీఎస్, సైన్సు, సోషల్ సబ్జెక్టులలో ప్రశ్నలు ఈ దఫా ఉండవు. కేవలం ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసీ తరగతి స్థాయిలో గణితం, లాంగ్వేజ్‌లలో మాత్రమే ఈ సర్వే కొనసాగనుంది. 3వ తరగతి విద్యార్థులకు 60 నిమిషాల పరీక్షా సమయం ఉంటుంది. లాంగ్వేజ్ 10 ప్రశ్నలు, న్యూమరసీ 10 ప్రశ్నలు, గణితం 10 ప్రశ్నలు, సాధారణ లాంగ్వేజ్‌లో 10 ప్రశ్నలు ఉంటాయి. 6వ తరగతి విద్యార్థులకు 75 నిమిషాల పరీక్షా సమయం ఉంటుంది. ఎఫ్ఎల్ఎన్ లాంగ్వేజ్ 10 ప్రశ్నలు, న్యూమరసీ 10 ప్రశ్నలు, గణితం 15 ప్రశ్నలు, లాంగ్వేజ్ 15 ప్రశ్నలు ప్రశ్నాపత్రంలో వస్తాయి. 9వ తరగతి విద్యార్థులకు 90 నిముషాల సమయం ఉంటుంది. ఎఫ్ఎల్ఎన్ లాంగ్వేజ్ 10 ప్రశ్నలు, న్యూమరసీ 10 ప్రశ్నలు, గణితం 20 ప్రశ్నలు, లాంగ్వేజ్ 20 ప్రశ్నలు ఉంటాయి.

ఇన్విజిలేటర్లకు శిక్షణ పూర్తి....

ఎంపిక చేసిన పాఠశాలల్లో పరీక్షలను సమర్థంగా నిర్వహించేందుకు ఇన్విజిలేటర్లను విద్యాశాఖ నియమించింది. ఉపాధ్యాయులకు బాధ్యతలు అప్పగిస్తే అభ్యసనా సామర్థ్యాలు సజావుగా వెలుగుచూసే అవకాశం ఉండదని భావించి ఇన్విజిలేటర్లుగా డిగ్రీ, డైట్, ఇంజినీరింగ్ విద్యార్థులను ఎంపిక చేసి ఇన్విజిలేటర్లుగా బాధ్యతలు అప్పగిస్తున్నారు. ఈమేరకు ఎంపిక చేసిన ఇన్విజిలేటర్లకు ఇప్పటికే దశలవారీగా శిక్షణ కూడా పూర్తి చేశారు. సర్వేలో వెలుగుచూసిన అంశాల వారీగా భవిష్యత్తులో మెరుగైన విద్యా ప్రణాళికలు, పాఠ్యాంశాల్లో మార్పులకు సామర్థ్య సర్వే గీటురాయి కానుంది.

సర్వేకు ఏర్పాట్లు పూర్తి



స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే–2023 నవంబరు 3న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. పరీక్ష నిర్వహణపై ఇన్విజిలేటర్లు, ఎంఈఓలకు ప్రత్యేక సూచనలు అందించాం. అందరినీ సమన్వయం చేస్తున్నాం. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పక్కాగా లెక్కించేందుకు, భవిష్యత్తులో పాఠ్యాంశాల్లో చేయాల్సిన మార్పులపై స్పష్టత ఏర్పడుతుంది. విద్యార్థులు పరీక్షకు సన్నద్ధం కావాలి.

తాహెరా సుల్తానా, డీఈఓ, కృష్ణా జిల్లా

ఏపీఎన్జీఓ భవన నిర్మాణానికి శంకుస్థాపన


భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు

ఉయ్యూరు(పెనమలూరు): జాతీయ రహదారి సమీపంలో ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ ఉయ్యూరు తాలుకా నూతన భవన నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు భూమి పూజలో పాల్గొని శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నవంబరు మూడో తేదీన రెండు వేల మందితో చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. జీపీఎస్‌ను ఉపయోగించుకుంటూ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమ సమస్యలపై సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి కేవీ శివారెడ్డి, పశ్చిమ కృష్ణా అధ్యక్షుడు విద్యాసాగర్, కార్యదర్శి ఇక్బాల్, ఉయ్యూరు తాలూకా యూనియన్ ప్రతినిధులు పామర్తి సుబ్బారావు, బొల్లా వెంకటేశ్వరరావు, మీగడ శ్రీనివాసరావు, శ్రీదేవి, కొలుసు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దిశ యాప్‌తో బాధితుడికి వైద్య సేవలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నడుచుకుంటూ వెళ్తున్న తన భర్తను గుర్తు తెలియని వ్యక్తులు బైక్ తో ఢీ కొట్టి పారిపోయారని ఓ మహిళ దిశ యాప్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయగా నిమిషాల వ్యవధిలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని తీవ్రంగా గాయపడిన ఆ వ్యక్తిని హాస్పటల్‌కు తరలించి వైద్య సేవలు అందేలా కృషి చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం న్యూరాజరాజేశ్వరిపేటలో నివాసం ఉండే నాగరాజు అనే వ్యక్తి బుధవారం రాత్రి 11 గంటల సమయంలో విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో సింగ్‌నగర్ పైపుల రోడ్డు నుంచి వైఎస్సార్ కాలనీ వైపు నడుచుకుంటూ వెళ్తున్న నాగరాజును గుర్తు తెలియని వ్యక్తులు బైక్ పై వేగంగా వచ్చి ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో నాగరాజు కాలుకు తీవ్ర గాయమై అక్కడికక్కడే కుప్పకూలి పడిపోయాడు.

సమాచారం తెలుసుకున్న బాధితుడి భార్య రాజేశ్వరి వెంటనే దిశ యాప్‌కు కాల్ చేసి సహాయం కోరింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు నిమిషాల వ్యవధిలోనే ఘటనా స్థలానికి చేరుకొని బాధితుడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీసీ ఫుటేజ్ ఆధారాలను పరిశీలించి త్వరలోనే నిందితులను అరెస్టు చేసేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ప్రేమ జంట కేసులో తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

కోనేరుసెంటర్: ఇంటి నుంచి పరారై పెళ్లి చేసుకున్న ప్రేమ జంటను పోలీసులు గుర్తించి స్టేషన్‌కు తీసుకొచ్చారు. చిలకలపూడి పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మచిలీపట్నం నారాయణపురానికి చెందిన బోడిచర్ల సాయికుమారి ఇంటర్ వరకు చదువుకుంది. డిగ్రీ పూర్తి చేసి ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న వీరంకి ప్రయాస్ అనే యువకుడితో ఆమెకు పరిచయం ఏర్పడింది. వీరి పరిచయం కాస్త ప్రేమగా మారింది. పెళ్లి చేసుకోవాలనుకున్న ఇద్దరూ పెద్దలకు చెప్పకుండా ఈ నెల 24వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయారు. సాయికుమారి కనిపించకపోవడంతో కంగారు పడిన కుటుంబ సభ్యులు బంధువులు, ఆమె స్నేహితుల వద్ద ఆరా తీశారు. ఆచూకీ తెలియకపోవడంతో తమ కుమార్తె కనిపించడం లేదంటూ సాయికుమారి తల్లి నాగేశ్వరమ్మ మరుసటి రోజు చిలకలపూడి పోలీసులకు ఫిర్యాదు చేసింది. సెల్ టవర్ల సిగ్నల్స్ ఆధారంగా పరారైన ఇద్దరూ చిన్న తిరుపతిలో ఉన్నట్లు సీఐ సీహెచ్ సతీష్ కుమార్ గుర్తించారు. సిబ్బందిని వెంటనే అక్కడికి పంపి ఫిర్యాదు అందుకున్న 24 గంటల్లో వారిని అదుపులోకి తీసుకున్నారు. ఇరు కుటుంబాల పెద్దలను స్టేషన్‌కి పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు వివాహం చేసుకున్న ప్రేమ జంటను షరతులపై కుటుంబసభ్యులకు అప్పగించారు. సీఐ సతీష్ కుమార్‌ను జిల్లా ఎస్పీ పి.జాషువా అభినందించారు.

విద్యార్థిని మృతి కేసులో పురోగతి

బోడగుంట(మోపిదేవి): మోపిదేవి పంచాయతీ పరిధిలోని బోడగుంట గ్రామంలో అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన ఇంటర్ విద్యార్థిని బి.హేమ కేసులో పురోగతి లభించినట్లు ఇన్‌చార్జి ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 24వ తేదీ మంగళవారం హేమ ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరేసుకొని మృతి చెందినట్లు కేసు నమోదైంది. మృతురాలు ఫోన్ కాల్‌డేటా పరిశీలించామని దీన్ని ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. హేమ అవనిగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. మృతురాలి కాల్ డేటాను ద్వారా త్వరలోనే కేసు ఓ కొలిక్కి వస్తుందని స్పష్టం చేశారు.

కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం

పమిడిముక్కల: కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై గురజాడ బైపాస్ వద్ద గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కంకిపాడుకు చెందిన మండపాక రామారావు (67) బైక్‌పై గురజాడలోని బంధువుల ఇంటికి బయలు దేరాడు. మార్గమధ్యలో బైపాస్ వద్ద వెనుక నుంచి వచ్చిన కారు బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో కిందపడిన రామారావు తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిషోర్‌కుమార్ తెలిపారు.

డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుకు తాత్సారం వద్దు

- భోగరాజు భవన నిర్మాణానికి అనుమతుల్లో జాప్యమేల
- వేగవంతం చేయాలని కమిషనర్‌కు ఎంపీ బాలశౌరి సూచన


కమిషనర్ చంద్రయ్యతో మాట్లాడుతున్న ఎంపీ బాలశౌరి

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనులకు సంబంధించి త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాలని, జాప్యాన్ని ఏమాత్రం అంగీకరించేదిలేదని కమిషనర్ చంద్రయ్యకు బందరు పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి సూచించారు. జిల్లా పరిషత్ సమావేశపు హాలులో గురువారం కృష్ణా జిల్లా అభివృద్ధి, సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత సమావేశంలో కమిటీ చైర్మన్ ఎంపీ బాలశౌరి అడిగిన ప్రశ్నలకు సమాధానాలు, చర్యలను జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు చదివి వినిపించారు. భోగరాజు పట్టాభి సీతారామయ్య భవన నిర్మాణ అనుమతుల కోసం ఏడాది కిందట మునిసిపాలిటీని కోరామని ఇంతవరకు ఎందుకు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. రూ.40 కోట్లతో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సీఎస్ఆర్) నిధులతో భవన నిర్మాణం చేపట్టేందుకు ముందుకు వచ్చారని ఇందుకు సంబంధించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రెండు ఎకరాల భూమిని సేకరించామని చెప్పారు. భవన నిర్మాణ సాధన కమిటీ సభ్యులు తరచూ ప్రతిపక్ష పార్టీలకు, తనకు అర్జీలు ఇస్తున్నారన్నారు. మహాత్మాగాంధీతో సమకాలికుడిగా పేరున్న భోగరాజు పట్టాభి సీతారామయ్య మచిలీపట్నంలో పుట్టడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఆంధ్రా బ్యాంకును స్థాపించి లక్షల మందికి ఉద్యోగాలు కల్పించారని గుర్తుచేశారు. అటువంటి మహానుభావుని భవనం నిర్మాణం విషయంలో జాప్యం తగదని, ఇందుకు కారణాలు తెలుపుతూ రాతపూర్వకంగా సమాధానం ఇవ్వాలని ఎంపీ కోరారు.

డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుపరిచేందుకు...

మచిలీపట్నం నగరం సముద్రమట్టాని కంటే పల్లంలో ఉండటంతో కొద్దిపాటి వర్షం పడినా రహదారులన్నీ జలమయం కావటంతో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకున్నామని ఎంపీ బాలశౌరి అన్నారు. ఇందుకోసం తాను కేంద్ర మంత్రికి విషయం తెలపటంతో ఆయన కేంద్ర కమిటీ నిపుణులను మచిలీపట్నం నగరానికి పంపి పరిస్థితులను పరిశీలించి డీపీఆర్ తయారుచేయించి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారన్నారు. కమిటీ సభ్యులు మచిలీపట్నంలో పర్యటించేందుకు కమిషనర్‌కు మెయిల్ పంపి ఆరు నెలలు అయినప్పటికీ సమాధానం ఇవ్వకపోవటం ఏమాత్రం సరికాదన్నారు. మునిసిపాలిటీ నిధులు, పెట్టుబడులు అవసరం లేకుండా తాను డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తున్నానన్నారు. కమిషనర్ తక్షణం స్పందించాలన్నారు.

పోలీసుల అదుపులో మణప్పురం నిందితులు

- నేడు కోర్టుకు తరలించే అవకాశం
- తనఖా పెట్టిన సొత్తు రికవరీలో పోలీసులు నిమగ్నం


కంకిపాడులోని మణప్పురం ఫైనాన్స్ సంస్థ కార్యాలయ భవనం

కంకిపాడు(పెనమలూరు): మణప్పురం ఫైనాన్స్ సంస్థలో బంగారు ఆభరణాల చోరీ కేసు కొలిక్కి వచ్చింది. ఈ కేసులో నిందితుల అరెస్టుకు పోలీసులు రంగం సిద్ధం చేశారు. నిందితులను అరెస్టు చేసి శుక్రవారం కోర్టుకు హాజరుపర్చనున్నట్లు సమాచారం. కంకిపాడు పట్టణంలోని మణప్పురం ఫైనాన్స్ సంస్థలో బంగారు ఆభరణాల చోరీపై ఈ నెల 18న కంకిపాడు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. కేసు విచారణలో సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించిన పోలీసులు ఈ నెల 16వ తేదీ రాత్రి బ్రాంచ్ హెడ్‌గా పనిచేస్తున్న రెడ్డి వెంకటపావని, తనకు సహకారంగా ఉన్న మరో వ్యక్తితో కలిసి బంగారు ఆభరణాలు కలిగిన బ్యాగుతో కారులో వెళ్లినట్లు గుర్తించిన విషయం తెలిసిందే. 17వ తేదీన విధులకు హాజరుకాకుండా ఉండటం, తనఖా పెట్టిన బంగారు ఆభరణాల కోసం ఖాతాదారులు వస్తే, వారి ఆభరణాలు కనిపించకపోవటంతో సిబ్బంది బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. దీంతో ఆడిట్ రికార్డులను పరిశీలించిన సంస్థ అధికారులు 10.660 కిలోల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు నిర్ధారించటం పాఠకులకు విదితమే. సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాల ఆధారంగా కారు నంబరుతో అడ్రస్ సేకరించి బ్రాంచ్ హెడ్ రెడ్డి వెంకట పావనికి సహకరించిన కృత్తివెన్నుకి చెందిన దుర్గాప్రసాద్‌ను అప్పుడే అదుపులోకి తీసుకున్నారు. పొదులో దాచిన బంగారు ఆభరణాలనూ స్వాధీనం చేసుకున్నారు. కేసు విచారణలో భాగంగా షిరిడీలో ఉన్న ప్రధాన నిందితురాలు రెడ్డి వెంకట పావనిని ఇటీవల అదుపులోకి తీసుకుని జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో ఉంచి విచారణ జరిపినట్లు తెలిసింది. విచారణ అనంతరం ప్రధాన నిందితురాలు రెడ్డి వెంకట పావని, ఆమెకు సన్నిహితంగా ఉన్న దుర్గాప్రసాద్‌ను శుక్రవారం కోర్టుకు తరలించనున్నారు.


నిందితురాలు రెడ్డి వెంకట పావని

తనఖా పెట్టిన బంగారం కోసం తంటాలు...

కేసు విచారణలో కీలక అంశాలు వెలుగుచూశాయి. కేవలం ఒక్క రాత్రి జరిగిన బంగారు ఆభరణాల చోరీ కాదని గుర్తించారు. ఫైనాన్స్ సంస్థ కార్యాలయంలో సీసీ కెమెరాలు పని చేయటం లేదని గుర్తించిన ప్రతి సారీ కొన్ని బంగారు ఆభరణాలను తీసుకుని కంకిపాడులో అద్దెకు ఉంటున్న ఇంటికి తీసుకొచ్చి దుర్గాప్రసాద్‌కు అప్పగించటం, తరచూ భీమవరం, గుడివాడ వెళ్తూ, ఆ సొత్తును అక్కడ అప్పగించటం చేస్తున్నట్లు గుర్తించారు. ఈ విధంగా వచ్చిన బంగారు ఆభరణాలను తనఖా పెట్టి తమ అవసరాలను తీర్చుకుంటుండే వారని పోలీసుల విచారణలో తేలింది. ఈ విధంగా తనఖాలో ఉన్న బంగారు ఆభరణాలను రికవరీ చేసి ఖాతాదారులకు భద్రత కల్పించేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. మరో కీలక అంశం ఏంటంటే రెడ్డి వెంకట పావని బంటుమిల్లి బ్రాంచిలో పనిచేస్తుండగానే ఆభరణాలు తనఖా పెట్టే నెపంతో దుర్గాప్రసాద్ బ్రాంచికి తరచూ వచ్చి పరిచయం పెంచుకుని సన్నిహితంగా మెలుగుతున్నట్లు తేలింది.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ మేరకు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. అంబాపురం పంచాయతీ కార్యాలయం సమీపంలో గరే సాయికుమారి తన భర్తతో కలిసి నివాసం ఉంటుంది. సాయికుమారి తల్లి శయనా పుణ్యవతి కొంత కాలం కిందట కొత్తపేట నెహ్రూ బొమ్మసెంటర్‌లో ఇల్లు కొనుగోలు చేసింది. అయితే ఇంటి కోసం తెలిసిన వారి వద్ద అప్పులు చేసింది. అప్పులు ఇచ్చిన వాళ్లు తిరిగి చెల్లించాలని సాయికుమారికి ఫోన్ చేసి అడిగారు. దీంతో అప్పుల వాళ్లకు సమాధానం చెప్పాలని సాయికుమారి తన తల్లికి సూచించింది. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరగడంతో పుణ్యవతి బుధవారం పురుగుల మందు తాగింది. దీంతో అమెను కుటుంబ సభ్యులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పుణ్యవతి గురువారం మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎస్టీవీఆర్ విద్యార్థులు


ఎంపికయిన విద్యార్థులతో ఫిజికల్ డైరెక్టర్ జలసూత్రం వెంకట్రావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉమ్మడి కృష్ణా జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 19 రాష్ట్ర స్థాయి పోటీలకు ఎస్టీవీఆర్ నగర పాలక సంస్థ పాఠశాల విద్యార్థులు ఐదుగురు ఎంపికయ్యారు. ఆత్కూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రవికాంత నేతృత్వంలో గురువారం ఫెన్సింగ్ బాల బాలికల పోటీలు నిర్వహించారు. పోటీల్లో దుర్గాపురం ఎస్టీవీఆర్ నగర పాలక సంస్థ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బాలికల విభాగంలో ఎం.శిరీష, బి.ప్రవల్లిక, బాలుర విభాగంలో కె.మోహనరావు, కె.రాహుల్ జాన్, ఎం. సజీవ్ కుమార్ జిల్లా జట్టులో విజయాలు సాధించి వచ్చే నెల నవంబర్ 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు నంద్యాల కర్నూలు జిల్లాలో జరగబోవు రాష్ట స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–19 ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సూర్యప్రభ, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జలసూత్రం వెంకటరావు అభినందించారు .

వైభవంగా కనకదుర్గమ్మ గ్రామోత్సవం



పెదకాకాని: దసరా నవరాత్రోత్సవాల్లో భాగంగా నంబూరు జయభారతరెడ్డి నగర్‌లో కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నంబూరు గ్రామంలో బుధవారం రాత్రి కనకదుర్గమ్మకు మేళ తాళాలు, బాణసంచా భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం నిర్వహించారు. పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నల అవినాష్‌రెడ్డి, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు భీమిరెడ్డి వేణుగోపాలరెడ్డి, కూసం విష్ణు, తిరుమలరెడ్డి, జొన్నల కరుణాకరరెడ్డి పాల్గొన్నారు.

ఎన్‌సీసీ, రెడ్‌క్రాస్ మధ్య సేవా ఒప్పందం


ఎన్‌సీసీ, రెడ్‌క్రాస్ మధ్య సేవా ఒప్పదం చేసుకుంటున్న దృశ్యం

గుణదల(విజయవాడ తూర్పు): రాష్ట్రంలోని ఎన్‌సీసీ, రెడ్‌క్రాస్ సొసైటీల మధ్య సేవా ఒప్పందం కుదిరింది. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఆంధ్రా లయోల కాలేజీ వేదికగా ఎయిర్ కమాండర్, ఎన్‌సీసీ డెప్యూటీ డైరెక్టర్ జనరల్ (ఆంధ్రా, తెలంగాణ) వి.ఎస్.రెడ్డి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జనరల్ సెక్రటరీ ఎ.కె.పరిడా ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ ఎ.శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ట్రైబల్ ఏరియాతో పాటు, ప్రకృతి విపత్తుల సంభవించినప్పుడు మానవత దృక్పథంతో సేవలు అందించేందుకు ఎన్‌సీసీ ముందుకు రావడం అభినందనీయమని చెప్పారు. రెడ్‌క్రాస్ సేవలు అన్ని ప్రాంతాలకు విస్తృతం చేసేందుకు ఈ ఒప్పందం దోహదం చేస్తుందని తెలిపారు. ఎయిర్ కమాండర్ వి.ఎస్.రెడ్డి మాట్లాడుతూ అంతర్జాతీయంగా మానవతా సేవలందిస్తున్న రెడ్‌క్రాస్‌తో కలిసి ఎన్‌సీసీ పని చేయడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. విపత్తుల సమయంలో ప్రజలకు అండగా నిలిచేందుకు రెడ్‌క్రాస్ ద్వారా లభించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎన్‌సీసీకి సూచించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జనరల్ సెక్రటరీ ఎ.కె.పరిడా మాట్లాడుతూ ఎన్‌సీసీ, రెడ్‌క్రాస్ సొసైటీల మధ్య సేవా ఒప్పందం కుదరడం దేశంలోనే ప్రథమమన్నారు. ఈ ఒప్పందంతో ఎన్‌సీసీ, రెడ్‌క్రాస్‌లు మరింత బలోపేతం అవుతాయని వెల్లడించారు. రెడ్‌క్రాస్ యాప్‌ను ఇప్పటి వరకు ఒక మిలియన్ ప్రజలు వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ రెడ్‌క్రాస్ సొసైటీ కో ఆర్డినేటర్ బి.వి.ఎస్.కుమార్, కల్నల్ సభ్యసాచిదాస్, కల్నల్ సంజయ్‌గుప్తా, కల్నల్ బలిందర్‌సింగ్, కెప్టెన్ ఆర్.ఎస్.రావు, కల్నల్ సంజయ్‌తన్వర్, లెఫ్టినెంట్ కల్నల్ సురేంద్రన్, ఎన్‌సీసీ ఆఫీసర్ నిరంజన్ పాల్గొన్నారు.



క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



గుణదల(విజయవాడ తూర్పు): అనారోగ్యంతో బాధపడుతున్న ముగ్గురికి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్) చెక్కులను గురువారం వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గం కార్యాలయంలో కార్పొరేటర్లు, పార్టీ నాయకులు అందజేశారు. రెండో డివిజన్‌కు చెందిన శిరీషకు రూ. 1.30 లక్షలు, ఐదో డివిజన్‌కు చెందిన సైదమ్మకు రూ. 70 వేలు, 21వ డివిజన్‌కు చెందిన విజయదుర్గకు రూ.90 వేలను వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం మంజూరు చేసింది. చెక్కులను కార్పొరేటర్లు అంబడిపూడి నిర్మలకుమారి, కలపాల అంబేద్కర్, పుప్పాల కుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు సొంగా రాజ్‌కమల్, చిత్రం లోకేష్ లబ్ధిదారులకు అందజేశారు.

పోలీసు విధులపై అవగాహన



కృష్ణలంక(విజయవాడతూర్పు): పోలీసు అమరవీరుల వారోత్సవాలు పురస్కరించుకుని కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో గురువారం స్కూల్ విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. సీఐ ఎం.వి.దుర్గారావు ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో పోలీసు పరికరాల పని తీరు, పోలీసు శాఖకు సంబంధించిన పలు విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయుధాలు, కమ్యూనికేషన్ సెట్, కంప్యూటర్ రూమ్, స్టేషన్ రికార్డులు, లాకప్‌లను విద్యార్థులకు చూపించి వాటి పనితీరు వివరించారు. ఆసక్తిగా తిలకించిన విద్యార్థులు.. పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఎస్ఐలు కృష్ణ సాయి, ప్రకాష్, మనోహర్, రైటర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): తమ కళాశాలలో బీబీఏ మొదటి సంవత్సరం విద్యార్థి కె.శ్రీను ఆంధ్ర ఆల్ బ్యాడ్మింటన్ జట్టుకు ఎంపికయ్యాడని నలంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనును నలంద విద్యా సంస్థల చైర్మన్ ఎ.విజయబాబు అభినందించారు. 2024 జనవరిలో బిహార్‌లో నేషనల్ మీట్ జరుగుతుందని, అందులో శ్రీను సత్తా చాటాలని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు ఆకాంక్షించారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భర్త కనిపించడం లేదంటూ వివాహిత కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రైజర్‌పేట తెలుగు బాపిస్టు చర్చి ప్రాంతానికి చెందిన బోతపాటి నాగమణి, నవీన్‌బాబు దంపతులు. వీరికి 15 ఏళ్ల క్రితం వివాహమవ్వగా నాగమణి అంగన్‌వాడీలో ఆయాగా పని చేస్తుంటుంది. నవీన్‌బాబు కొంత కాలం క్రితం ఓ ఫైనాన్స్ కంపెనీలో లోన్ తీసుకోవడమే కాకుండా తన స్నేహితుడికి కూడా ఇప్పించాడు. కొద్ది రోజులుగా ఆ డబ్బుల విషయంలో తీవ్రంగా ఆందోళన చెందుతున్నాడు. గురువారం ఉదయం భార్యను అంగన్‌వాడీ కేంద్రం వద్ద దింపి ఇంటికి వెళ్తున్నానని చెప్పిన నవీన్‌బాబు కనపించలేదు. నాగమణి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

కళాకారులు సాంస్కృతిక రాయబారులు

విజయవాడ కల్చరల్: సాంస్కృతిక కళా సంస్థలు కళాకారుల సంక్షేమం కోసం కృషి చేయాలని ప్రణవి మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపకుడు కారుమంచి రాజు అన్నారు. విశ్వకవి సామ్రాట్ జాషువా కళాపీఠం, ప్రణవి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యాన గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో సినీ సంగీత విభావరి, గాయకుడు డేవిడ్‌రాజుకు గాన సామ్రాట్ బిరుదు ప్రదాన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. రాజు మాట్లాడుతూ కళాకారులు సాంస్కృతిక రాయబారులని తెలిపారు. పురస్కార ప్రదాత డేవిడ్‌రాజు గురించి మాట్లాడుతూ పోలీస్ అధికారిగా విశేషమైన సేవలను అందించారని పేర్కొన్నారు. అంబేద్కర్ సాంస్కృతిక సంస్థ ద్వారా అనేక మంది నూతన గాయనీ గాయకులను పరిచయం చేశారని చెప్పారు. నిర్వాహకుడు డేవిడ్‌రాజును గాన సామ్రాట్ బిరుదుతో సత్కరించారు. కార్యక్రమంలో సంరక్ష సొసైటీ జనరల్ సెక్రటరీ సునీల్‌కుమార్, కొప్పుల ఆనంద్, బీవీ వీరభద్రరావు పాల్గొన్నారు. గాయనీ గాయకులు పి.శ్రీనివాస్, మారేపల్లి జోషి, కె.రత్నకుమారి, పావని, సిరిమోక్ష పాల్గొన్నారు.

చురుగ్గా నాడు-నేడు పనులు

- రూ.60 లక్షల నిధులతో వీఎం రంగా హైస్కూల్ అభివృద్ధి
- ఐదు అదనపు తరగతి గదుల నిర్మాణం
- ఫర్నిచర్, ఇతర మౌలిక వసతుల కల్పన



వీఎం రంగా బాలికోన్నత పాఠశాల భవనంపై జరుగుతున్న అదనపు గదుల నిర్మాణం

కృష్ణలంక(విజయవాడతూర్పు): చురుగ్గా నాడు-నేడు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా నాణ్యమైన ఇంగ్లిష్ మీడియం విద్యను ప్రభుత్వం అందిస్తోంది. దీని కోసం పాఠశాలల అభివృద్ధి పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మనబడి నాడు-నేడు పథకంలో పాఠశాలల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులను ప్రభుత్వం కేటాయించింది. ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ తేవడానికి చర్యలు తీసుకుంటోంది.

అదనపు గదుల నిర్మాణం

కృష్ణలంక 21వ డివిజన్‌లోని వీఎం రంగా నగర పాలక సంస్థ ప్రత్యేక బాలికోన్నత పాఠశాలలో అభివృద్ధి పనులు చకచకా జరుగుతున్నాయి. నాడు-నేడు పథకంలో భాగంగా రూ.60 లక్షల అంచనాతో ఐదు అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు చురుకుగా చేస్తున్నారు. బాలికోన్నత పాఠశాల కావడంతో కృష్ణలంకతో పాటు రాణిగారితోటకు చెందిన విద్యార్థినిలు ఎక్కువగా ఈ పాఠశాలలో చదువుతున్నారు. 230 మంది విద్యార్థులకు ఈ పాఠశాలలో ఇప్పటికే రెండు అంతస్తుల్లో ఆరు గదుల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. గదులు చాలకపోవడంతో విద్యార్థుల సౌకర్యార్థం నాడు-నేడు పథకంలో భాగంగా అదనంగా పాఠశాల భవనంపై మూడో అంతస్తులో మరో ఐదు అదనపు గదుల నిర్మాణ పనులు చేపట్టారు.

తుది దశకు..

ప్రధానోపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ పర్యవేక్షణలో నిర్మాణ పనులు వేగంగా జరుగుతూ చివర దశకు చేరుకున్నాయి. అదనపు తరగతి గదుల నిర్మాణంతో పాటు పాఠశాలకు అవసరమైన టేబుల్స్, కుర్చీలు, బ్లాక్ బోర్డులు, విద్యుత్ ఉపకరణాలు తదితర మౌలిక వసతులను ఏర్పాటు చేయనున్నారు. త్వరలోనే పనులు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొస్తామని ప్రధానోపాధ్యాయురాలు గ్రేసమ్మ తెలిపారు. విద్యను మరింత ఆధునిక పద్ధతుల్లో అందించడానికి ప్రభుత్వం నాడు-నేడులో భాగంగా చేస్తున్న అభివృద్ధి పనులపై విద్యార్థినిల నుంచి అభినందనలు వెల్లువెత్తున్నాయి.

క్వాంటమ్ డాట్స్‌పై మరిన్ని ఆవిష్కరణలు రావాలి



మాట్లాడుతున్న డాక్టర్ సవ్యసాచి చక్రవర్తి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రసాయన శాస్త్రంలోని క్వాంటమ్ డాట్స్‌పై మరిన్ని ఆవిష్కరణలు రావాలని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం రసాయనశాస్త్ర విభాగ ఆచార్యుడు డాక్టర్ సవ్యసాచి చక్రవర్తి అన్నారు. కేబీఎన్ కళాశాల రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యాన ఇటీవల నోబెల్ బహుమతి పొందిన క్వాంటమ్ డాట్స్ ఆవిష్కరణ, అభివృద్ధి అంశంపై గురువారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సవ్యసాచి చక్రవర్తి మాట్లాడుతూ నానో టెక్నాలజీ తరువాత క్వాంటమ్ డాట్స్‌కు సంబంధించిన ఆవిష్కరణ ఇటీవల ముందుకు వచ్చిందన్నారు. దీంతో భవిష్యత్తులో ఎలక్ట్రానిక్స్, మినీ సెన్సర్లు, క్వాంటమ్ కమ్యూనికేషన్ వ్యవస్థ విస్తరణకు దోహదపడుతుందన్నారు. క్వాంటమ్ డాట్స్ చాలా ప్రత్యేకమైన లక్షణాలను కలిగి ఉండటమే కాకుండా వివిధ రంగాల అభ్యున్నతికి అండగా ఉండొచ్చన్నారు. ఈ రంగంలో చాలా విస్తృతమైన పరిశోధనలకు అవకాశముందన్నారు. అదే విశ్వవిద్యాలయానికి చెందిన మరో ఆచార్యుడు డాక్టర్ సతీష్ మాట్లాడుతూ క్వాంటమ్ డాట్స్‌తో వ్యాక్సిన్ల సంశ్లేషణకు సంబంధించి వైద్యరంగంలో చాలా ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. భవిష్యత్తులో మానవాళి వైద్యానికి సంబంధించిన అంశాల్లో క్వాంటమ్ డాట్స్ వినియోగంతో చాలా మేలు జరిగే అవకాశముందని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులు వారి రంగాలపై లోతైన అవగాహన పెంచుకోవాలన్నారు. దానికి అవసరమైన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, వాటిని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ జి.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా కార్పొరేషన్ స్కూల్స్



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): కార్పొరేట్ స్కూల్స్ కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని, విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నడుం బిగించారని 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షాహినా సుల్తానా అన్నారు. సింగ్ నగర్ ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్‌లో రూ.3 కోట్ల వ్యయ అంచనాతో నూతనంగా నిర్మిస్తున్న అదనపు తరగతులు భవన నిర్మాణం పనులను కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులతో కలసి గురువారం ఆమె పరిశీలించారు. పనులకు సంబంధించిన వివరాలు ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. భవన నిర్మాణ పనులు దాదాపుగా పూర్తయ్యాయని, డోర్లు, కిటికీలు, విద్యుత్ పనులు పెండింగ్ లో ఉన్నాయని అధికారులు తెలిపారు. పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేసి, భవనాన్ని త్వరలో విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని సూచించారు. అనంతరం పాఠశాల వెనుక భాగంలో పిచ్చి మొక్కలు ఎక్కువగా పెరిగి ఉండడాన్ని గమనించి శానిటరీ ఇన్‌స్పెక్టర్ వందన బాబును పిలిపించి పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మధ్యాహ్నం భోజనం పథకం రుచి చూసి, సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల హెచ్ఎంలు పి.వెంకటేశ్వర్లు, ఇమామ్‌బాషా, వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హాఫీజుల్లా తదితరులు పాల్గొన్నారు.

'మార్పిడి'.. యూనివర్సిటీ విద్యార్థులకు వరం



మాట్లాడుతున్న మహ్మద్ ఇంతియాజ్

గుణదల(విజయవాడ తూర్పు): విదేశాల్లోని సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకునేందుకు రూపొందించిన ఎక్స్చేంజ్ ప్రోగ్రాం యూనివర్సిటీల విద్యార్థులకు ఉపయోగపడుతుందని ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ మహ్మద్ ఇంతియాజ్ అన్నారు. ఆంధ్ర లయోల కాలేజీలో గురువారం స్టూడెంట్ ఎక్స్చేంజ్ ప్రోగ్రాంపై అవగాహన సదస్సులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ ప్రపంచం ప్రజల సంస్కృతికి కేంద్రంగా ఉందన్నారు. భిన్నమైన వాతావరణ పరిస్థితుల నడుమ విభిన్న సంస్కృతులను అధ్యయనం చేయడానికి స్టూడెంట్ మార్పిడి ప్రోగ్రాంను రూపొందించారన్నారు. కొత్త వ్యక్తులను కలవడం, వారి సంస్కృతి, సంప్రదాయాలను అవగతం చేసుకునేందుకు విద్యార్థులకు దోహదం పడుతుందని తెలిపారు. ఫాదర్ జోజిరెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన అంతర్జాతీయ విద్యార్థి మార్పిడి కార్యక్రమం నైపుణ్యాల పెంపునకు దోహదపడుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మహేష్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు అవగాహన సదస్సులు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఫాదర్ బాలస్వామి, సీఎస్ఈ హెచ్‌వోడీ డాక్టర్ సీహెచ్ రాజేంద్రబాబు, డాక్టర్ కిషోర్ బాబు, డాక్టర్ ఎం.రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



మాట్లాడుతున్న ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు భాస్కరరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఎంబీఏ విభాగం ఆధ్వర్యాన ఎంఎస్ఎంఈ సౌజన్యంతో 'పారిశ్రామికరంగం - అవకాశాలు' అంశంపై సదస్సును గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ నిర్వహించారు. సదస్సును ప్రారంభించిన భాస్కరరావు మాట్లాడుతూ యువతకు అవకాశాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వాటిని అందిపుచ్చుకోవడానికి తమలోని నైపుణ్యాలకు పదును పెట్టాలన్నారు. నేడు ఉత్పత్తి, సేవా రంగాల్లో విస్తృతమైన ఆలోచనలు ముందుకు వస్తున్నాయని తెలిపారు. విద్యార్థులు ఆలోచనలకు పదును పెడితే అద్భుతమైన విజయాలను అందుకుంటారని చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా ఓఐసీ జనరల్ మేనేజర్ సుధాకర్ మాట్లాడుతూ పారిశ్రామికరంగం దిశగా విద్యార్థులు అడుగులు వేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి అవసరమైన అనేక అవకాశాలు, సదుపాయాలను కల్పిస్తున్నాయన్నారు. మంచి ఆలోచనలతో ముందుకు వచ్చే ప్రతి ఒక్కరికీ అవకాశాలు ఎదురు చూస్తుంటాయని చెప్పారు.

కార్యక్రమంలో ఏపీ ఇనోవేటివ్ సొసైటీ సీఈవో అనిల్‌కుమార్, స్పెస్ ఇన్ఫో టెక్నాలజీస్ సీఈవో డాక్టర్ శ్రీదేవి తదితరులు వివిధ అంశాలపై ప్రసంగించారు. ఎంఎస్ఎంఈ (విశాఖపట్నం) డెవలప్‌మెంట్ అండ్ ఫెసిలిటేషన్ ఆఫీస్ సహాయ సంచాలకుడు జె.చంద్రమౌళి నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అక్యూట్ టి లింపోబ్లాస్టిక్ లుకేమియాకు విజయవంతంగా చికిత్స



అక్యూట్ టి లింపోబ్లాస్టిక్ లుకేమియా నుంచి కోలుకున్న చిన్నారితో వైద్య బృందం

లబ్బీపేట(విజయవాడతూర్పు): పోషకాహార లోపం ఉన్న చిన్నారిలో పిడియాట్రిక్ అక్యూట్ టి-లింఫోబ్లాస్టిక్ లుకేమియాను గుర్తించి విజయవంతంగా చికిత్స చేసినట్లు అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ రాం ప్రహ్లాద్ కె.ఎం తెలిపారు. మీడియాకు గురువారం తెలిపిన వివరాల ప్రకారం తీవ్రమైన పోషకాహార లోపంతో బాధపడుతున్న నాలుగేళ్ల చిన్నారి బరువు తక్కువగా ఉంది. సాధారణంగా ఆ వయస్సులో 16–20 కేజీలు ఉండాల్సి ఉండగా, కేవలం 9 కేజీలు మాత్రమే ఉంది. క్యాకెక్సియా తీవ్రత కారణంగా చికిత్సకు కూడా నిరాకరించే అసాధారణమైన కేసుగా తీసుకుని, చికిత్స చేయడం సవాల్‌గా భావించినట్లు డాక్టర్ రాంప్రహ్లాద్ తెలిపారు. ప్రొటీన్ సప్లిమెంట్‌తో డైట్‌ను సంవృద్ధి చేయడం, బరువుకు తగినట్లుగా ఔషధ మోతాదు సర్దుబాటుతో కిమోను ప్రారంభించినట్లు తెలిపారు. కీమోథెరపీ సమయంలో పలు రకాల ఇన్‌ఫెక్షన్‌లకు గురైనట్లు తెలిపారు. కేసు అత్యవసర స్థితిని గుర్తించి సమగ్ర వైద్య విధానంతో సరైన మోతాదులో కీమో ఇవ్వడంతో కోలుకున్నట్లు తెలిపారు. తమకు ఇదొక అద్భుతమైన చికిత్సగా ఆస్పత్రి రీజినల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మహేంద్రరెడ్డి తెలిపారు.

శ్మశానవాటికలో మరమ్మతులు చేయరూ!



పకీరుగుడెం శ్మశానవాటికలో పిచ్చి మొక్కలు

16వ డివిజన్ భూపేష్ గుప్తానగర్‌లోని దళితుల శ్మశానవాటికలో మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు. కొంతకాలంగా శ్మశానవాటికలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. అంత్యక్రియలకు ఇబ్బందికరంగా ఉందని కాలనీ వాసులు వాపోయారు. శ్మశానవాటికలో మరమ్మతులు చేసిసౌకర్యాలను కల్పించాలని కోరుతున్నారు.

– ఆటోనగర్ (విజయవాడతూర్పు)

భజే భవాని..







ఇంద్రకీలాద్రి పరిసరాలు భవానీ నామస్మరణతో మార్మోగాయి. ఇతర ప్రాంతాల నుంచి భవానీలు అధిక సంఖ్యలో తరలిరావడంతో గురువారం దుర్గగుడిలోని క్యూలు ఆధ్యాత్మిక తరంగాలుగా కనిపించాయి. విదేశాల నుంచి వచ్చిన భక్తులు కనకదుర్గమ్మను కనులారా దర్శించుకున్నారు. అన్నదాన ప్రాంగణం, ప్రసాదాలకౌంటర్లు భవానీలతో కిక్కిరిశాయి. జగన్మాతను స్మరించుకుంటూ భక్తజనం వెనుదిరిగారు. -సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ









అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

ఎమ్మెల్యే మల్లాది విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): కనకదుర్గ అమ్మవారి దివ్య ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఎళ్ల వేళలా ఉండాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆకాంక్షించారు. శ్రీదుర్గాదేవి అమ్మవారి నవరాత్రుల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని ఎమ్మెల్యే మల్లాది విష్ణు కార్యాలయం వద్ద చేపట్టిన శ్రీదేవీ శరన్నవరాత్రుల ముగింపు కార్యక్రమాలు గురువారం ఘనంగా జరిగాయి. మధ్యాహ్నం 5 వేల మందికి అన్నదానం నిర్వహించగా, రాత్రి చేపట్టిన అమ్మవారి ఊరేగింపు వైభవోపేతంగా జరిగింది. వీటికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ అమ్మవారి కృప, కరుణ ప్రజలందరికి తోడుండాలని, అమ్మవారి ఆశీస్సులతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2024లోనూ అత్యధిక మెజార్టీతో విజయఢంకా మోగించాలని కోరారు. డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, ఉత్సవ కమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు తోపుల వరలక్ష్మి, పేరం త్రివేణి రెడ్డి, యక్కల మారుతీ, బంకా బాబి, కొలంటి రవి, మనోహర్, చక్రి, యక్కల మల్లి, శోభన్ చక్రాల, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు శ్రీరామలింగేశ్వర ఆలయం మూసివేత

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారి దేవస్థానం ఈ నెల 28న మూసివేయనున్నట్లు ఆలయ ఈఓ ఎం.గంగాధరరావు అన్నారు. చంద్రగ్రహణం సందర్భంగా 28న ఉదయం 8 నుంచి 29వ తేదీ ఉదయం 8గంటల వరకు ఆలయ ద్వారాలు మూసివేస్తామని తెలిపారు. సంప్రోక్షణ చేసిన అనంతరం ఆలయాన్ని తెరుస్తామని పేర్కొన్నారు.

భక్తులకు అన్న ప్రసాద వితరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎంతో మహిమాన్వితమైన శివ కామేశ్వరీ అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆకాంక్షించారు. అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో గురువారం శ్రీధర్మపరిషత్ మహా సంస్థాన్ ఆధ్వర్యాన భారీ అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి పూజలు చేసి అన్నప్రసాద వితరణను అవ్వా హేమసుంద వరప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా అంగరంగ వైభవంగా శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్న మహా సంస్థానమ్ సేవలను కొనియాడారు. అనంతరం సుమారు ఐదు వేల మందికి అన్నప్రసాద వితరణ జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి గుండే సుందర్‌పాల్, వేణుగోపాల్, గవాస్కర్, పేరం త్రివేణి రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎయిమ్స్‌కు బస్సు సర్వీసు

ఉయ్యూరు: మంగళగిరి ఎయిమ్స్‌కు ఆర్టీసీ సర్వీసులు ప్రారంభించామని ఉయ్యూరు డిపో మేనేజరు కెఎస్ ఆర్‌కె ప్రసాద్ తెలిపారు. స్థానిక బస్టాండు ఆవరణలో కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాల అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. డీఎం ప్రసాద్ మాట్లాడుతూ ఉయ్యూరు డిపో నుంచి కంకిపాడు బస్టాండు మీదుగా ప్రతి రోజూ ఉదయం 5.25 నుంచి రాత్రి 7.05 గంటల వరకూ 247 వి సర్వీసును మంగళగిరి ఎయిమ్స్ మీదుగా ఎస్ఆర్ఐ వరకూ ప్రారంభించామన్నారు. ఎయిమ్స్, ఎస్ఆర్ఐ ఆసుపత్రులకు వెళ్లే వారు ఈ సర్వీసులను వినియోగించుకోవాలని కోరారు. శుక్రవారం డయల్ యువర్ డిఎం ఉదయం 11 నుంచి 12 గంటల వరకూ జరుగుతుందన్నారు. సలహాలు, సూచనలు ఇచ్చే ప్రయాణికులు 9959224796 నంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

ముగిసిన షిరిడీ సాయినాథుని పుణ్యతిథి మహోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిరంలో పుణ్యతిథి మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మధ్యాహ్నం దాత కుంచనపల్లి రవిశంకర్ దంపతులచే భారీ అన్నప్రసాద వితరణ జరిగింది. మందిర గౌరవాధ్యక్షులు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని అన్నప్రసాద వితరణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రాషిరిడీగా విరాజిల్లుతున్న ముత్యాలంపాడు షిర్డీసాయిబాబా మందిరంలో భక్తులు, దాతల మనోభావాలకు అనుగుణంగా సేవలు అందజేస్తున్నామన్నారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

నేను బయట.. ఆయన లోపల..!

చంద్రబాబును ఉద్దేశించి డైరెక్టర్ రాంగోపాల్‌వర్మ పోస్ట్



రాంగోపాల్ వర్మ చేసిన ట్వీట్

సాక్షి, రాజమహేంద్రవరం: సంచలన దర్శకుడు రాంగోపాల్ వర్మ ఆసక్తికర ట్వీట్ చేశారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్ వద్ద సెల్ఫీ దిగిన ఆయన ఆ ఫొటోను ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ చేశారు. 'నేను బయట.. ఆయన లోపల' అని స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్‌లో ఉన్న బాబును ఉద్దేశించి ట్వీట్ చేశారు. రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సోదరుడు జక్కంపూడి గణేష్ రిసెప్షన్‌కు వచ్చిన ఆయన సెంట్రల్ జైల్ వద్ద ఆగి.. ఫొటో దిగారు.

నేను రెడీ.. మీరూ సిద్ధమేనా?

సీబీఐ విచారణ వ్యాఖ్యలపై భువనేశ్వరికి మంత్రి రోజా సవాల్



సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): మాజీ సీఎం చంద్రబాబు సతీమణి భువనేశ్వరి చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా స్పందించారు. భువనేశ్వరి కోరినట్లుగా తన ఆస్తులపై సీబీఐతో విచారణకు సిద్ధంగా ఉన్నానని, మరి మీరు కూడా సిద్ధమేనా భువనేశ్వరీ అంటూ సవాల్ విసిరారు. గురువారం ఆమె రాజమహేంద్రవరంలోని శ్రీ ఉమా మార్కండేయేశ్వరస్వామి ఆలయాన్ని ఎంపీ మార్గాని భరత్‌రామ్‌తో కలిసి సందర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. 1991లో చిత్ర పరిశ్రమకు వచ్చిన నాటి నుంచి తన సంపాదన ప్రారంభమైందని, దానిపై సీబీఐతో విచారణకు తాను సిద్ధమేనని చెప్పారు. మరి అదే సమయంలో భువనేశ్వరి కూడా ఆమె ఆస్తులపై సీబీఐ విచారణకు సిద్ధమేనా అని సవాల్ విసిరారు. ఆర్థిక నేరగాడికి సంకెళ్లు వేస్తే మొత్తం రాష్ట్రానికే సంకెళ్లు వేసినట్టు భువనేశ్వరి వ్యాఖ్యానించడాన్ని చూసి రాష్ట్ర ప్రజలు నవ్వుతున్నారని అన్నారు.

బాబుకు బెయిల్ కోసం కొత్త డ్రామానా?

టీడీపీ నేతలకు వైఎస్సార్‌సీపీ వికలాంగుల విభాగం అధ్యక్షుడు బందేల కిరణ్ ప్రశ్న



సాక్షి,అమరావతి: బెయిల్ కోసం రోగాల పేరుతో కొత్త డ్రామా మొదలుపెట్టారా? అని చంద్రబాబు, టీడీపీ నేతలను వైఎస్సార్‌సీపీ వికలాంగుల విభాగం అధ్యక్షుడు బందేల కిరణ్‌రాజు ప్రశ్నించారు. గురువారం తాడేపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడారు. భూమి మీద తన అంత ఆరోగ్యవంతుడు లేడన్న చంద్రబాబుకు ఒక్కసారిగా ఇన్ని జబ్బులు వచ్చాయని టీడీపీ నేతలు, ఎల్లో మీడియా చెప్పడంతో ప్రజలు ఆశ్చర్యపోతున్నారని అన్నారు. అవినీతి కేసులో పక్కా సాక్ష్యాధారాలతో అరెస్ట్ అయిన చంద్రబాబుకు బెయిల్ వచ్చే అవకాశం లేదని తెలిసే.. టీడీపీ నేతలు ఇప్పుడు అనారోగ్య కారణాలను తెరపైకి తెచ్చారని విమర్శించారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు కంటి కింద కురుపు ఉన్నా లెక్కచేయకుండా కష్టపడ్డారని, దావోస్‌లో గడ్డకట్టించే చలిని పట్టించుకోకుండా శ్రమించారంటూ ఎల్లో మీడియా జాకీలు పెట్టి లేపాయి. ఇప్పుడేమో జైలుకు వెళ్లేసరికి చంద్రబాబుకు కంటి నొప్పులు, ఒళ్లు నొప్పులంటూ గోల చేస్తున్నారని మండిపడ్డారు.

నేటి రాత్రి వరకు వెబ్ ఆప్షన్స్ నమోదు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 2023–24 విద్యా సంవత్సరానికి బీడీఎస్ కోర్సులో స్టే వెకెన్సీ సీట్ల భర్తీకి వెబ్ ఆప్షన్స్ నమోదుకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. గురువారం రాత్రి తొమ్మిది గంటల నుంచి ఆప్షన్స్ నమోదు ప్రారంభించారు. ఆప్షన్స్ నమోదుకు శుక్రవారం రాత్రి తొమ్మిది గంటల వరకు అవకాశం ఉంది. https:// bdsstray.ysruhs.com వెబ్‌సైట్‌లో విద్యార్థులు ఆప్షన్స్ నమోదు చేసుకోవచ్చు.

మంత్రి అంబటికి తప్పిన ప్రమాదం

సత్తుపల్లి: ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుకు తృటిలో ప్రమాదం తప్పింది. మంత్రి రాంబాబు గురువారం రాత్రి 8 గంటల సమయంలో రాజమండ్రి నుంచి ఖమ్మం వైపు కాన్వాయ్‌తో జాతీయ రహదారిపై వెళ్తున్నారు. అదే సమయంలో సత్తుపల్లి జేవీఆర్ పార్కు సమీపంలో మహారాష్ట్ర నుంచి ఓ గోధుమల బస్తాల లోడ్ లారీ ఎదురుగా వచ్చింది. ఈ క్రమంలో బస్తాలపై బిగించిన టార్పాలిన్ చిరిగిపోవడమేకాక తాళ్లు విడిపోవడంతో రెండు బస్తాలు జారి మంత్రి ప్రయాణిస్తున్న కారుపై పడ్డాయి. దీంతో కారు స్వల్పంగా దెబ్బతింది. ఆ తర్వాత మంత్రి అంబటి మరో కారులో ఖమ్మం వెళ్లిపోయారు.

మిల్లెట్ మహారాణులు

విజయనగరం జిల్లాలో వెల్లివిరిసిన మహిళా రైతుల చైతన్యం

1,500 మందితో రేగ పంచాయతీ వద్ద ఆరోగ్య మిల్లెట్ ప్రొడ్యూసర్స్ కంపెనీకి శ్రీకారం

(పంపాన వరప్రసాదరావు, విజయనగరం జిల్లా రేగ గ్రామం నుంచి..)

సాధారణంగా ఏదైనా ఉత్పత్తి మార్కెట్లోకి రావాలంటే బోలెడంత తతంగం ఉంటుంది. ముడి సరుకు తయారీ నుంచి వస్తువు మార్కెట్లోకి వచ్చే వరకూ అంటే.. విత్తు నుంచి విక్రయం వరకూ వివిధ స్థాయిల్లో ఎంతో మంది నిపుణులు భాగస్వాములవుతారు. కానీ, వీరెవరూ లేకుండా నాట్లు.. ఉత్పత్తి.. అక్కడ నుంచి ప్రాసెసింగ్.. ఆ తర్వాత వస్తు తయారీ.. ప్యాకింగ్.. అనంతరం మార్కెటింగ్.. ఇలా అన్ని ఒక్కళ్లే చేస్తే.. విజయనగరం జిల్లా లక్కవరపు కోట మండలం రేగ పంచాయతీ పరిధిలో పచ్చని పొలాల మధ్య ఉన్న 'ఆరోగ్య మిల్లెట్ ప్రొడ్యూసర్ కంపెనీ'లో అదే జరుగుతోంది. పదో పరకో కాదు.. ఏకంగా 1,500 మందితో ఈ వ్యవస్థ నడుస్తోంది. అదీ ఒక్క మహిళలతోనే. వీరంతా ఈ రంగంలో విశేష అనుభవంగానీ, పెద్దపెద్ద చదువులుగానీ ఉన్నవారు కాదు. అందరూ సాధారణ మహిళా రైతులే. చిరుధాన్యాలు, అపరాలను తమ సొంత పొలాల్లో పండిస్తూ వాటిని వివిధ రూపాల్లో ప్రాసెస్ చేస్తూ చిక్కీలు, బిస్కెట్లు, సేమియా, పాస్తా, కేకులు వంటి నోరూరించే 50 రకాల ఆహార ఉత్పత్తుల తయారీ అంతా మహిళల సారథ్యంలోనే సాధ్యమవుతోంది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటు అంతాఇంతా కాదు. దేశంలో పూర్తిగా మహిళలతోనే నడుస్తున్న తొలి మిల్లెట్ ఆధారిత పరిశ్రమ అయిన 'ఆరోగ్య మిల్లెట్ ప్రొడ్యూసర్ కంపెనీ'పై సాక్షి గ్రౌండ్ రిపోర్టు..



చిరుధాన్యాలను కొనుగోలు చేస్తున్న ఆరోగ్య మిల్లెట్ ప్రొడ్యూసర్ కంపెనీకి చెందిన మహిళా రైతులు



చిరుధాన్యాలతో ఆరోగ్య మిల్లెట్ ప్రొడ్యూసర్ కంపెనీ సభ్యులు తయారుచేస్తున్న ఆహార ఉత్పత్తులను పరిశీలిస్తున్న విదేశీ మహిళలు

ఇలా మొదలయ్యింది..

నిజానికి.. ఈ ప్రాంతంలో పెద్దగా సాగునీటి వసతి లేదు. పూర్తిగా వర్షాధారంపై ఆధారపడాల్సిన పరిస్థితి. దీంతో చిరుధాన్యాలు, అపరాలు, నూనెగింజలు సాగుచేసే ఇక్కడి రైతులు సరుగుడు, నీలగిరి తోటలు సాగువైపు మళ్లారు. ఇదే సమయంలో సబల అనే స్వచ్ఛంద సంస్థ ఏర్పాటైంది. ప్రభుత్వ తోడ్పాటుతో రైతు కుటుంబాల్లోని మహిళల్లో చిరుధాన్యాలు, అపరాల సాగుపై ఆసక్తిని పెంచింది. డక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ ద్వారా ప్రత్యామ్నాయ ఆహార పంపిణీ కార్యక్రమం కింద ముందుకొచ్చిన మహిళా రైతులకు ఎకరాకు రూ.5,300 చొప్పున ఆర్థిక చేయూతనిచ్చింది. వీరిని గ్రూపులుగా ఏర్పాటుచేసి ప్రభుత్వ సహకారంతో రూ.10వేల నుంచి రూ.50వేల వరకు ఆర్థిక తోడ్పాటునిచ్చింది. ఇలా 200 గ్రూపులకు రూ.కోటికి పైగా రుణపరపతి కల్పించడంతో ఈ ప్రాంతంలో క్రమేపీ చిరుధాన్యాలు, అపరాలు, నువ్వులు, కాయగూరల సాగు మొదలైంది. విజయనగరం జిల్లా ఎస్.కోట నియోజకవర్గ పరిధిలోని కొత్తవలస, లక్కవరపు కోట (ఎల్.కోట) మండలాల్లో ఐదు గ్రామాల్లో 200 ఎకరాలతో మొదలైన ఈ ఉద్యమం క్రమేపీ 50 గ్రామాల్లో రెండు వేల ఎకరాలకు విస్తరించింది. అలాగే, 10 రైతు క్లబ్‌ల నుంచి 35 రైతు క్లబ్‌లు విస్తరించగా, దాదాపు 2వేల మంది భాగస్వాములయ్యారు.

ఇంట్లో డిమాండ్ కల్పించడం ద్వారా..

ఆ తర్వాత.. పాతపంటలు సరికొత్త వంటలు, సంప్రదాయ వంటలు, వినూత్న వంటలపై మహిళలకు, వక్తృత్వ, వ్యాసరచన పోటీల ద్వారా పాఠశాల, కళాశాల విద్యార్థులకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఇలా ఇంట్లో డిమాండ్ కల్పించడం ద్వారా చిరుధాన్యాల సాగు ఉద్యమ రూపం దాల్చింది. ఫలితంగా విస్తీర్ణం, ఉత్పత్తి పెరిగింది. పండించడం, వినియోగించడం, నిల్వచేయడం, మార్కెటింగ్‌లను చైన్‌గా ఏర్పాటుచేశారు. సొంతంగా వినియోగించుకోగా మిగిలిన పంటను గిట్టుబాటు ధరకు అమ్ముకునేందుకు వీలుగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటుచేశారు. ఇలా 220 మందితో రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని (ఎఫ్‌పీఓ) ఏర్పాటుచేసుకున్నారు. విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ ద్వారా అదనపు ఆదాయం ఆర్జించాలన్న సంకల్పంతో 90 మందిని ఎంపిక చేసి 'రెడీ టూ ఈట్.. రెడీ టూ మేక్' అనే విధానంలో 50 రకాల ఆహార పదార్థాల తయారీపై ఈ మహిళలకు ప్రత్యేక శిక్షణనిచ్చారు. నాబార్డు ఆర్థిక చేయూతతో చిన్నచిన్న యూనిట్లు ఏర్పాటుచేసి మిల్లెట్స్‌తో ఆహార ఉత్పత్తుల తయారీకి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ సహకారంతో ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్స్, హాస్టళ్లలో మధ్యాహ్న భోజనంలో వాటిని భాగమయ్యేలా చేశారు. అయితే, జాతీయ, అంతర్జాతీయ వేదికలపై తమ ఉత్పత్తుల విక్రయాలకు హైజనిక్, స్టాండర్డ్స్ వంటివి ప్రతిబంధకంగా మారడంతో ఆ స్థాయిలో ఉత్పత్తి చేసేందుకు సైతం భారీ యూనిట్ ఏర్పాటుచేయాలని సంకల్పించారు.

సకాలంలో సర్కారు సాయం..

ఇదే సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీని తీసుకొచ్చింది. నియోజకవర్గ స్థాయిలో సెకండరీ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుతో పాటు ముందుకొచ్చే వారికి ఆర్థిక చేయూతనిస్తామని ప్రకటించడం వీరికి వరంగా మారింది. రెండు దశాబ్దాలుగా తాము చేస్తున్న కృషిని వీరు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో ఎలాంటి సిఫార్సులు, పైరవీలకు తావులేకుండా ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా సెకండరీ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రభుత్వం వెంటనే మంజూరు చేసింది. సాధారణంగా యూనిట్ స్థాయిని బట్టి 35–60 శాతం వరకు సబ్సిడీ.. మిగిలింది రుణం రూపంలో సమకూరుస్తారు. కానీ, ఈ యూనిట్‌కు మాత్రం అంచనా వ్యయం రూ.4.06 కోట్లను గ్రాంట్ రూపంలో అందించి ప్రభుత్వం అండగా నిలిచింది. ఇందులో భాగస్వాములైన 1,500 మంది సభ్యులు ఒక్కొక్కరు రూ.1,000 చొప్పున రూ.15 లక్షలు సమీకరించుకోగా, స్మాల్ ఫార్మర్ అగ్రి బిజినెస్ కన్సార్టియం కింద ప్రభుత్వం మరో రూ.9 లక్షలు సమకూర్చింది. అంతే.. ఎల్.కోట మండలం రేగ పంచాయతీ పరిధిలో లీజుకు తీసుకున్న ఎకరం భూమిలో ఏటా 7,600 టన్నుల సామర్థ్యంతో భారీ యూనిట్ ఏర్పాటైంది. ఆరోగ్య మిల్లెట్ ప్రొడ్యూసర్ కంపెనీ పేరిట సెకండరీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే ప్రారంభించగా, ఇటీవలే ఉత్పత్తికి శ్రీకారం చుట్టారు. ఇప్పుడిక్కడ అన్ని రకాల చిరుధాన్యాలను ప్రాసెస్ చేస్తున్నారు. క్లీనింగ్, గ్రేడింగ్, సార్టింగ్‌తో పాటు పొట్టు తీయడం, చిరుధాన్యాలను బియ్యం రూపంలోనే కాదు పిండి, రవ్వ, నూక, అటుకుల రూపంలోకి మార్చవచ్చు. అంతేకాదు.. సేమియా, పాప్‌కార్న్, చిక్కీలు, బిస్కెట్లు, సేమియా, పాస్తా, కేకులు ఇలా.. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 50కి పైగా ఉత్పత్తులను తయారుచేస్తున్నారు. ఇక్కడ నేరుగా 20 మందికి.. పరోక్షంగా 5వేల మందికి జీవనోపాధి లభిస్తోంది. ఈ ఉద్యమ ఫలితంగా పోషకాహార, ఆరోగ్య, పశుగ్రాస, పర్యావరణ భద్రతలతో పాటు ప్రభుత్వ తోడ్పాటుతో ఆర్థిక భద్రత కూడా కలిగిందని వీరంతా సంతోషం వ్యక్తంచేస్తునారు.

అందరూ సామాన్య మహిళా రైతులే..

ఇక ఈ యూనిట్‌ను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలో లేక ఈ రంగంలో విశేష అనుభవమున్న వారో ఏర్పాటుచేసుకున్నది కాదు. పూర్తిగా మహిళా రైతుల సమష్టి కృషి ఫలితమిది. పోనీ వారంతా చదువుకున్న వారు.. పరిశ్రమలు నడపడంలో విశేష అనుభవమున్న వారనుకుంటే కూడా పొరపాటే.. కేవలం 20 శాతం మంది మాత్రమే ఇంటర్, డిగ్రీ ఆ పైబడి చదువుకున్న వారు. మిగిలిన వారిలో 50 శాతం మంది టెన్త్‌లోపు చదువుకుంటే, 30 శాతం మంది నిరక్షరాస్యులే. వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న సామాన్య మహిళా రైతులు తమ అసామాన్య కృషికి నిలువెత్తు నిదర్శనం ఈ పరిశ్రమ. ఓ స్వచ్ఛంద సంస్థ సహకారం, ప్రభుత్వ తోడ్పాటుతో అనుకున్న లక్ష్యాన్ని అందుకుని ఓ భారీ పరిశ్రమలో భాగస్వాములయ్యారు. ఒకప్పుడు వ్యవసాయ, ఉపాధి పనులకు వెళ్లే వీరంతా నేడు సొంత పరిశ్రమ కోసం పనిచేస్తున్నారు. ఇందుకు నెలవారీ జీతభత్యాలతో పాటు ఏటా వచ్చే లాభాల్లో డివిడెండ్ కూడా పొందనున్నారు.

బోర్డు, కమిటీల ఏర్పాటు..

మరోవైపు.. 220 మంది సభ్యులతో ఏర్పాటైన ఎఫ్‌పీఓలో నేడు 1,500 మంది సభ్యులుగా ఉన్నారు. వీరంతా ఐదుగురు సభ్యులతో ప్రత్యేకంగా ఓ బోర్డును ఏర్పాటుచేశారు. అలాగే, రైతుక్లబ్ లీడర్లతో ప్రొడక్షన్, మార్కెటింగ్, ఫైనాన్షియల్ రీసోర్సెస్, ఇంటర్నల్ ఆడిటింగ్ పేరిట నాలుగు సబ్ కమిటీలను ఏర్పాటుచేసుకున్నారు. ఒక్కో కమిటీకీ ఒక్కో బాధ్యత అప్పగించారు. ప్రొడక్షన్ కమిటీలో ఉండే సభ్యులు గ్రామాల వారీగా రైతులతో సమావేశమై సీజన్‌లో ఎంత సాగవుతుంది.. ఎంత దిగుబడి వస్తుంది.. ఇంటి అవసరాలకు వినియోగించుకోగా ఒక్కో రైతు నుంచి ఏ మేరకు సమీకరించవచ్చో అంచనా వేస్తారు.

మద్దతు ధర కంటే అదనంగా చెల్లింపు..

ఇక పండించిన పంటకు ఎమ్మెస్పీ (మద్దతు ధర) కంటే టన్నుకు రూ.3వేల నుంచి రూ.5వేలు అదనంగా చెల్లించి కంపెనీ వారి నుంచి ఆ పంటను కొనుగోలు చేస్తుంది. అలా సేకరించిన పంట ప్రాసెసింగ్ మొదలుపెడతారు. అంతేకాదు.. సబల సంస్థ కృషి ఫలితంగా ఈ ప్రాంతంలో ఇప్పటికే 20-30 ఎఫ్‌పీఓలను ప్రోత్సహించారు. వీరి నుంచి కూడా అవసరమైన మేరకు సమీకరిస్తారు. కిలో కొర్రలు రూ.32, గంట్లు రూ.80, రాగులు రూ.40, జొన్నలు రూ.40, సామలు రూ.35 చొప్పన చెల్లించి కళ్లాల వద్ద ఇటీవలే 200 టన్నులు కొనుగోలు చేశారు. వర్కింగ్ క్యాపిటల్ కింద రూ.కోటి వరకు రుణం తీసుకుని తిరిగి చెల్లించారు. మరో రూ.కోటి రుణం కోసం ప్రయత్నిస్తున్నారు. ఈ యూనిట్ ద్వారా ఏటా కనీసం రూ.2 కోట్ల టర్నోవర్ సాధించడమే లక్ష్యంగా ఈ మహిళా శక్తి ముందుకెళ్తోంది.

ఆర్థిక భరోసా వచ్చింది..



మాకు రెండెకరాలుంది. చోళ్లు, పెసలు, గంట్లు పండిస్తున్నాం. ఇంటి అవసరాలకు పోగా మిగిలింది కిలో రూ.30 నుంచి రూ.40కి కంపెనీకే అమ్ముతున్నా. గతంలో కుటుంబ పోషణ కోసం వ్యవసాయ పనులకు వెళ్లేదాన్ని ఇప్పుడు మా పరిశ్రమలో పనిచేసుకుంటున్నా. నెలకు రూ.7వేల వరకు ఇస్తున్నారు. పైగా ఏటా డివిడెండ్ కూడా ఇస్తామంటున్నారు. మా కుటుంబానికి ఆర్థిక భద్రత లభించింది. చాలా సంతోషంగా ఉంది.

– పెదిరెడ్ల కళ, పెదిరెడ్లపాలెం, ఎల్.కోట మండలం

ఆరోగ్యం మెరుగుపడింది..



మాకు రెండెకరాలుంది. కొర్రలు, చోళ్లు పండిస్తున్నాం. గతంలో చీటికిమాటికి అనారోగ్యం పాలయ్యేవాళ్లం. ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ప్రస్తుతం ఇంట్లో చేసే ప్రతీ వంటకాల్లో చిరుధాన్యాలను భాగస్వామ్యం చేసుకున్నాం. చాలా ఆరోగ్యంగా ఉన్నాం. వీటిని పిల్లలూ ఇష్టపడుతున్నారు. ఇంటి అవసరాలకు పోను మిగిలినవి మా కంపెనీకే ఇస్తున్నా. కిలోకి రూ.3కు పైగా అదనంగా ఇస్తున్నారు.

– గనివాడ లక్ష్మి, కళ్లేపల్లి, ఎల్.కోట మండలం

ప్రభుత్వ తోడ్పాటు మరిచిపోలేం..



చిరుధాన్యాల సాగు, వినియోగాన్ని పెంచడమే లక్ష్యంగా రెండు దశాబ్దాలు ఉద్యమించాం. ప్రారంభంలో సబల సంస్థ ద్వారా చేసిన చిరు ప్రయత్నం నేడు ఇంతింతై అన్నట్లుగా విస్తరించి సుమారు 5వేల కుటుంబాలకు జీవనాధారమైంది. ఈ యూనిట్ ఏర్పాటుకు ప్రభుత్వ తోడ్పాటును మర్చిపోలేం. వచ్చిన లాభాలను డివిడెండ్ రూపంలో 1,500 మంది సభ్యులకు సమానంగా ఇస్తాం.

– కోమ్మోజుల సరస్వతి, సీఈఓ, ఆరోగ్య మిల్లెట్ ప్రొడ్యూసర్ కంపెనీ

100 శాతం గ్రాంట్‌గా ఇచ్చాం..



సీఎం వైఎస్ జగన్ సంకల్పం మేరకు రాష్ట్రంలో పెద్దఎత్తున ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నాం. ఇందులో భాగంగా.. చిరుధాన్యాల కోసం కృషిచేస్తున్న ఎఫ్‌పీఓ ఆరోగ్య మిల్లెట్స్ రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని గుర్తించి ఆర్థిక తోడ్పాటునందించాలని సంకల్పించాం. ఈ ఎఫ్‌పీఓకు 100 శాతం గ్రాంట్‌తో సెకండరీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ మంజూరు చేశాం. ఏటా 7,600 టన్నుల సామర్థ్యంతో ఈ యూనిట్ ఏర్పాటైంది. మహిళలు స్వయంగా నడిపే యూనిట్‌గా ఇది దేశంలోనే రోల్ మోడల్‌గా నిలవనుంది.

– ఎల్. శ్రీధర్‌రెడ్డి, సీఈఓ, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ

ఆహార శుద్ధి పరిశ్రమలకు పెద్దపీట



పండించిన పంటలకు అదనపు విలువ చేకూర్చడం ద్వారా రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా రాష్ట్రంలో ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. దేశంలో మరెక్కడా లేని విధంగా పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయిలో సెకండరీ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటుచేస్తోంది. చిరుధాన్యాలను ప్రోత్సహించేందుకు ముందుకొచ్చే వారికి ఆర్థిక చేయూతనిస్తోంది. విజయనగరం జిల్లా రేగ గ్రామం వద్ద ఏర్పాటైన ఆరోగ్య మిల్లెట్ సెకండరీ ప్రాసెసింగ్ యూనిట్ ఒక రోల్ మోడల్‌గా నిలవనుంది.

– కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి

'పట్టణ మహిళల ప్రగతి'కి తోడ్పాటు

- ఎస్‌హెచ్‌జీ సభ్యులతో 165 సూక్ష్మ పరిశ్రమల ఏర్పాటు చేయాలని నిర్ణయం
- ఒక్కో యూనిట్‌కు రూ.2.50 లక్షల ఆర్థిక సాయం
- వచ్చే నెలలో శిక్షణ

సాక్షి, అమరావతి: ఆర్థికంగా కాస్త ఆసరా ఇచ్చి అండగా నిలిస్తే మహిళలు అద్భుతాలు సాధిస్తారని మనస్ఫూర్తిగా నమ్మిన వైఎస్ జగన్ ప్రభుత్వం అడుగడుగునా వారిని ప్రోత్సహిస్తూనే ఉంది. స్వయం సహాయక సంఘాల మహిళలకు తక్కువ వడ్డీకి రుణాలు అందించి చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే దిశగా సహకరిస్తోంది. జగనన్న మహిళామార్టులు, ఆహా క్యాంటీన్లు, అర్బన్ మార్కెట్‌లు విజయవంతం కావడంతో పట్టణాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళల కోసం పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) మరో ముందడుగు వేసింది. ఎస్‌హెచ్‌జీ సభ్యులకు ఆసక్తి ఉన్న రంగాల్లో, పర్యావరణ హితమైన సూక్ష్మ పరిశ్రమల స్థాపనకు కార్యాచరణ చేపట్టింది. ఈ అంశంపై గత నెలలో పట్టణ సమాఖ్యలకు చెందిన టీఎల్ఎఫ్ రిసోర్స్ పర్సన్లు, సమాఖ్య అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులతో మెప్మా మిషన్ డైరెక్టర్ సమావేశం నిర్వహించారు. ఇందులో దాదాపు 165 సూక్ష్మ పరిశ్రమల ఏర్పాటుకు ఆమోదించారు. ఒక్కో పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం తరఫున రూ.2.50 లక్షల సాయం అందించాలని నిర్ణయించారు. యూనిట్ల ఏర్పాటు, నిర్వహణపై ఆయా రంగాల నిపుణులతో వచ్చే నెలలో మహిళలకు శిక్షణ ఇస్తారు. గత నాలుగున్నరేళ్లుగా మెప్మా పట్టణ పొదుపు సంఘాల మహిళలను వ్యాపార యూనిట్ల ఏర్పాటు దిశగా ప్రోత్సహిస్తోంది. ఇప్పటివరకు 11 మహిళా మార్టులు ఏర్పాటు చేసి విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఇదే తరహాలో 140కి పైగా ఆహా క్యాంటీన్లు ఏర్పాటు చేశారు. 110 యూఎల్బీల్లో ప్రతినెలా అర్బన్ మార్కెట్లు సైతం ఏర్పాటు చేసి, మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను మార్కెట్ చేస్తున్నారు. ఇవన్నీ విజయవంతం కావడంతో మెప్మా పర్యావరణ హిత సూక్ష్మ పరిశ్రమలను పట్టణ మహిళా ప్రగతి యూనిట్ల పేరిట ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

32 రకాల యూనిట్ల ఏర్పాటుకు మహిళల ఆసక్తి

మహిళల ఆధ్వర్యంలో స్థాపించే సూక్ష్మ పరిశ్రమలకు అవసరమైన మూలధనం సేకరణ, పరిశ్రమ స్థాపన, నిర్వహణ, మార్కెటింగ్ వంటి అంశాలపై వచ్చే నెలలో నిపుణులతో శిక్షణనివ్వాలని మెప్మా నిర్ణయించింది. రాష్ట్రంలోని 120 యూఎల్బీల నుంచి 32 రకాల యూనిట్ల ఏర్పాటుకు మహిళలు ఆసక్తి చూపారు. ఇలా వచ్చిన ఆసక్తుల్లో మొత్తం 165 యూనిట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో ఇద్దరు సభ్యుల నుంచి 35 మంది సభ్యుల వరకు నిర్వహించే పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో వాడిపోయిన పూల నుంచి అగర్‌బత్తీల తయారీ, పేపర్ కప్పులు, ప్లేట్లు తయారీ, కంప్యూటర్ ఎంబ్రాయిడరీ, చిరుధాన్యాలతో ఆహార పదార్థాల తయారీ, జ్యూట్ బ్యాగ్‌ల మేకింగ్, కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్, అరటినార ఉత్పత్తులు, మిల్లెట్స్‌తో నూడుల్స్ తయారీ, డ్రై వెజిటబుల్ ఫ్లేక్స్ తయారీ వంటివి ఉన్నాయి.

అద్దె భారం లేకుండా చర్యలు



మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అందుకు అనుగుణంగా మెప్మా కృషి చేస్తోంది. సాధారణంగా పట్టణాల్లో చిన్న వ్యాపారం పెట్టాలన్నా గదుల అద్దె అధికంగా ఉంటుంది. మెప్మా ఏర్పాటు చేసే మహిళా ప్రగతి యూనిట్లను మున్సిపల్ భవనాల్లోనే ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. దీనివల్ల భవనాల అద్దె భారం, అడ్వాన్స్ చెల్లింపులు పెద్దగా ఉండవు. ఇది మహిళలకు ఊరటనిస్తుంది. ఒక్కో యూనిట్ ఏర్పాటుకు ప్రభుత్వం తరఫున గరిష్ఠంగా రూ.2.50 లక్షలు ఆర్థిక సాయం అందిస్తాం.

– వి.విజయలక్ష్మి, మెప్మా మిషన్ డైరెక్టర్

చంద్రబాబును ప్రజలు ఎందుకు పట్టించుకోవడం లేదు?

తిరుపతి సభలో భువనేశ్వరి ఆవేదన

తిరుపతి సిటీ/సాక్షి, తిరుపతి : తిరుపతిలోనే పుట్టి తిరుపతిని అంతర్జాతీయ స్థాయిలో నిలిపిన వ్యక్తిని ప్రజలు ఎందుకు పట్టించుకోవడం లేదని చంద్రబాబు సతీమణి భువనేశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతి రేణిగుంట రోడ్డులో గురువారం 'నిజం గెలవాలి'పేరుతో ఏర్పాటు చేసిన సభలో ఆమె ప్రసంగించారు. తిరుపతి నేడు అభివృద్ధిలో ముందుకు సాగుతోందంటే దానికి చంద్రబాబు కృషే కారణమన్నారు. ఏపీకి రావాల్సిన ఫ్యాక్టరీలు ఈ ప్రభుత్వం దుశ్చర్యల వల్ల ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయాయని ఆరోపించారు. అమర్‌రాజా, టీసీఎల్ వంటి అత్యున్నత సంస్థలు కూడా పక్క రాష్ట్రాలకు వెళ్లిపోయాయని చెప్పారు. అవినీతి ఆరోపణలు లేకున్నా.. ఎఫ్ఐఆర్‌లో పేరు లేకున్నా.. చంద్రబాబును అరెస్ట్ చేయడం దారుణమన్నారు. చంద్రబాబు నిత్యం ప్రజల కోసమే పనిచేస్తున్నారంటూ పలువురు కేంద్ర నేతలు ఆయన అరెస్ట్‌ను వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. ప్రజాక్షేత్రంలో నిజమే గెలుస్తుందని ఆమె స్పష్టం చేశారు. కాగా, తిరుపతిలో జరిగిన నిజం గెలవాలి సభకు జనసేన ప్రధాన నేతలు ముఖం చాటేశారు. కనీసం ఆ పార్టీ జెండాలు కూడా సభలో కనిపించకపోవడంతో టీడీపీ శ్రేణులు ఆశ్చర్యపోయారు. ఇదిలా ఉండగా, ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా టీడీపీ నాయకులు మహిళలను సభకు తరలించే ప్రయత్నం చేశారు. ఒక్కొక్కరికి రూ.300 చెల్లించి ఆటోలు, వ్యాన్లతో తరలించారు. భువనేశ్వరి ప్రసంగిస్తుండగా సభ నుంచి వారు నిష్క్రమించడం కనిపించింది.



భువనేశ్వరి ప్రసంగిస్తుండగా సభ నుంచి వెళ్లిపోతున్న మహిళలు

టీడీపీ ముఖ్యనేతలకు ఘోర అవమానం

చంద్రబాబు సతీమణి భువనేశ్వరి చేపట్టిన 'నిజం గెలవాలి' యాత్ర రెండో రోజే టీడీపీలో అసంతృప్తులు బయటపడ్డాయి. చంద్రబాబు స్క్రిప్ట్ ప్రకారం నడచుకున్న ఇన్‌చార్జ్‌లు.. జిల్లా నేతలను పూర్తిగా పక్కనపెట్టారు. వారికి కనీస గౌరవం కూడా ఇవ్వకపోవడంతో అలిగి వెళ్లిపోయారు. తిరుపతి సభలో ముందు వరుసలో కూర్చున్న మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి, పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు పులివర్తి నాని, తుడా మాజీ చైర్మన్ నరసింహయాదవ్‌లను లేపి వెనక్కు పంపేశారు. తీవ్ర అవమాన భారాన్ని తట్టుకోలేక వారు అలిగి అక్కడ నుంచి వెళ్లిపోయారు. చంద్రబాబు, రాబిన్‌శర్మ టీం, ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తున్న ఎమ్మెల్సీలు రాంభూపాల్‌రెడ్డి, అనూరాధలపై వారు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. మొదటి రోజు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్న తపనతో స్థానికులు రాకున్నా.. టీడీపీ నేతలు తమ సామాజిక వర్గానికి చెందిన మహిళలను సభకు రప్పించుకున్నారు. అయినా సభ విజయవంతం కాకపోవడంతో నిరుత్సాహానికి గురయ్యారు. భువనేశ్వరి ప్రసంగించేటప్పుడు కన్నీరు పెట్టుకోవాలని చంద్రబాబు, రాబిన్ శర్మ టీం సూచించినట్టు తెలిసింది. అలాగే భువనేశ్వరి మాట్లాడేటప్పుడు సభలోని వారు సైతం కన్నీరు మున్నీరు కావాలని.. ఆ మేరకు పలువురుకి శిక్షణ కూడా ఇచ్చినట్టు విశ్వసనీయ సమాచారం. అయినా ఎవరూ కన్నీరు పెట్టకపోవడం విశేషం. రెండో రోజైనా జనాన్ని మభ్యపెట్టాలని తీవ్ర స్థాయిలో ప్రయత్నం చేశారు. ఎంపిక చేసిన వారితో మాట్లాడించారు. అయినా జనం వీరి ప్రసంగాలను నమ్మలేదు.

సాధారణ మరణాలూ చంద్రబాబు అరెస్ట్ ఖాతాకే!

- 'నిజం గెలవాలి' యాత్రపై విమర్శలు
- మృతుల కుటుంబాలకు చెక్కులు అందించిన భువనేశ్వరి

శ్రీకాళహస్తి/రేణిగుంట(తిరుపతి జిల్లా): సాధారణ మరణాలను సైతం చంద్రబాబు ఖాతాలో వేసి రాజకీయ ప్రయోజనం పొందేందుకు టీడీపీ చేస్తున్న యత్నాలు విమర్శలపాలవుతున్నాయి. చంద్రబాబు అరెస్ట్‌ను తట్టుకోలేక టీడీపీ కార్యకర్తలు గుండె ఆగి మృతి చెందారంటూ 'నిజం గెలవాలి' పేరుతో గురువారం నారా భువనేశ్వరి తొట్టంబేడు మండలంలో బాధిత కుటుంబాలకు చెక్కులు పంపిణీ చేశారు. తంగేళ్లపాళేనికి చెందిన మోడెం వెంకటరమణ, దిగువ కొణతనేరికి చెందిన గాలి సుధాకర్‌నాయుడు, కాసరానికి చెందిన పర్చూరి వెంకటసుబ్బయ్యగౌడ్‌ల ఇళ్లకు వెళ్లి రూ.3 లక్షల చొప్పున చెక్కులు పంపిణీ చేశారు.



వెంకటసుబ్బయ్య గౌడ్ కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న భువనేశ్వరి

బాబు అరెస్ట్‌కు, ఈ మరణాలకు ఎలాంటి సంబంధమూ లేదు..

- మోడెం వెంకటరమణ(45) సెప్టెంబర్ 9న ప్రమాదవశాత్తూ జారిపడి గాయాలపాలయ్యాడు. ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అతను టీడీపీ కార్యకర్త కావడం, ఆయన భార్య హైమవతి గతంలో టీడీపీ ఎంపీటీసీగా చేసి ఉండటంతో ఆయన మరణాన్ని గుండెపోటుగా మార్చి.. చంద్రబాబు అరెస్ట్ తట్టుకోలేక మరణించినట్టు చిత్రీకరించారు.
- గాలి సుధాకర్‌నాయుడు(73) సెప్టెంబర్ 29న అనారోగ్యంతో మరణించారు. అతను టీడీపీ కార్యకర్త. చంద్రబాబు అరెస్ట్ అయిన 20 రోజుల తర్వాత సుధాకర్‌నాయుడు మరణించినప్పటికీ దాన్ని చంద్రబాబు అరెస్ట్‌కు ముడిపెట్టడంపై గ్రామస్తులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.
- పర్చూరి వెంకటసుబ్బయ్యగౌడ్(70) ఈ నెల 15న మృతి చెందాడు. అంటే చంద్రబాబు అరెస్ట్ అయిన 36 రోజుల తర్వాత. ఆయన టీడీపీ అభిమాని కావడంతో ఆయన సహజ మరణాన్ని చంద్రబాబు అరెస్ట్ ఖాతాలో వేసేశారు.

జగనన్న ఆరోగ్య సురక్ష

జగనన్న ఆరోగ్య సురక్ష

19వ రోజు

నిర్వహించిన మొత్తం శిబిరాలు	11,764
నమోదైన ఓపీలు	50,33,600
నిర్వహించిన వైద్య పరీక్షలు	6,31,71,314
మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రులకు రెఫర్ చేసినవారి సంఖ్య	77,469


ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలంలోని తునికిపాడు గ్రామంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో మందులు తీసుకుంటున్న రోగులు


పల్నాడు జిల్లా కేసానుపల్లిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ప్రజలకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది


కొండపి నియోజకవర్గం జంగినపల్లి పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి హాజరైన ప్రజలు


పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం కొవ్వాడ అన్నవరం గ్రామంలో ఆరోగ్య సురక్ష శిబిరంలో కళ్ల పరీక్షలు చేస్తున్న వైద్యులు


విజయనగరం జిల్లా బాడంగి వైద్యశిబిరంలో సేవలు పొందేందుకు హాజరైన ప్రజలు


శ్రీకాకుళం జిల్లా సిరుసువాడ గ్రామంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పేర్లు నమోదు చేసుకుంటున్న ప్రజలు


తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలం వేణుంబాకంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో మందులు తీసుకుంటున్న స్థానికులు


నంద్యాల జిల్లా చాగలమర్రి మండలంలోని పెద్దబోధనంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది


శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా పెద్దకొండూరులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో ఆరోగ్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

కంటికి శస్త్రచికిత్స చేయించుకోవాలి.. మధ్యంతర బెయిల్ ఇవ్వండి

- హైకోర్టులో చంద్రబాబు అత్యవసర పిటిషన్
- అత్యవసర విచారణకు నో చెప్పిన ధర్మాసనం

సాక్షి, అమరావతి: రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న చంద్రబాబు మధ్యంతర బెయిల్ కోసం మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. కంటికి శస్త్ర చికిత్స చేయించుకోవాల్సి ఉందని, అందువల్ల తనకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలంటూ పిటిషన్ దాఖలు చేశారు. హౌస్ మోషన్ రూపంలో దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై అత్యవసర విచారణ జరపాలని కోరారు. కంటి శస్త్ర చికిత్స అత్యవసరమని వైద్యులు స్పష్టంగా చెప్పారని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. అలాగే తాను పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్టు వైద్యులు తేల్చారని తెలిపారు. బీపీ, షుగర్‌లతో పాటు ఇతర సమస్యలకు పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సిఫారసు చేశారని చంద్రబాబు తన పిటిషన్‌లో పేర్కొన్నారు.అందువల్ల తనకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని అభ్యర్థించారు.ఈ హౌస్‌మోషన్ పిటిషన్‌పై అత్యవసర విచారణకు హైకోర్టు నిరాకరించింది.

సీజే రోస్టర్‌కే జడ్జీలు కట్టుబడి ఉండాలి

సాక్షి, అమరావతి: ప్రధాన న్యాయమూర్తి (సీజే) మాత్రమే నిర్ణయించే రోస్టర్ (ఏ న్యాయమూర్తులు ఏ రకమైన కేసులు వినాలి)ను అనుసరించే విషయంలో సుప్రీంకోర్టు ఇటీవల కీలక తీర్పు వెలువరించింది. ప్రధాన న్యాయమూర్తి కేటాయించని కేసుపై న్యాయమూర్తులు విచారణ జరపడం తీవ్రమైన అనౌచిత్యమని స్పష్టంచేసింది. న్యాయమూర్తులందరూ కూడా ప్రధాన న్యాయమూర్తి నిర్దేశించిన రోస్టర్‌కు కట్టుబడి ఉండాలని తేల్చిచెప్పింది. అలాగే, వారంతా క్రమశిక్షణతో వ్యవహరించాలని, సీజే కేటాయించిన కేసు తప్ప మరే ఇతర కేసును విచారించడానికి వీల్లేదని తెలిపింది. రోస్టర్ ప్రకారం నిర్దిష్ట కేటగిరి కింద తమ ముందుకొచ్చిన కేసును విచారించడం లేదా సీజే నిర్దిష్టంగా అప్పగించిన కేసును విచారించడం మాత్రమే న్యాయమూర్తులు చేయాల్సి ఉంటుందని 'సుప్రీం' స్పష్టంచేసింది. అలాగే, కొందరు కక్షిదారులు తాము అనుకున్న ఉత్తర్వులు పొందేందుకు తమ కేసును నిర్దిష్టంగా ఓ న్యాయమూర్తి వద్దకు వచ్చేలా చేయడం.. ఉత్తర్వులిచ్చే అవకాశం లేని న్యాయమూర్తి ముందు నుంచి తమ కేసును తప్పించడం వంటి అనైతిక చర్యలకు పాల్పడుతుండటాన్ని కూడా సుప్రీంకోర్టు తీవ్రంగా ఆక్షేపించింది. ఈ విధంగా ఫోరం షాపింగ్ (కావాల్సిన జడ్జి వద్దకు కేసు వచ్చేలా చేయడం, కేసు రాకుండా చేయడం)కు పాల్పడడం ఎంతమాత్రం సరికాదంది. తమ ముందున్న కేసులో కక్షిదారులు వ్యవహరించిన తీరు విస్మయకరమంటూ ఘాటుగా వ్యాఖ్యానించింది. ఫోరం షాపింగ్‌కు పాల్పడినందుకు ఆ కక్షిదారులకు రూ.50వేల జరిమానా విధించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్.ఓకా, జస్టిస్ పంకజ్ మిత్తల్ ఇటీవల తీర్పు వెలువరించారు.

మొదటక్వాష్.. పనికాకపోవడంతో రిట్ పిటిషన్..

ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజస్థాన్‌కు చెందిన నలుగురు వ్యక్తులపై వేర్వేరుగా ఆరు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. మరికొందరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మరో రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఈ రెండు ఎఫ్ఐఆర్‌లను కొట్టేయాలంటూ నలుగురు వ్యక్తులు రాజస్థాన్ హైకోర్టులో సీఆర్‌పీసీ సెక్షన్–482 కింద క్వాష్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై ఈ ఏడాది ఏప్రిల్ 23న విచారణ జరిపిన న్యాయమూర్తి ఆ నలుగురు వ్యక్తులు కోరిన విధంగా ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేదు. దీంతో ఆ నలుగురు వ్యూహం మార్చి ఆరు ఎఫ్ఐఆర్‌లను కలిపేసి, వాటన్నింటినీ ఒకే ఎఫ్ఐఆర్‌గా పరిగణించాలని కోరుతూ 8 మే 2023న సివిల్ రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన మరో న్యాయమూర్తి ఆ నలుగురు వ్యక్తులపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దంటూ మధ్యంతర ఉత్తర్వులిచ్చారు. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ ఫిర్యాదుదారు అంబలాల్ పరిహార్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ అభయ్ ఓకా నేతృత్వంలోని ధర్మాసనం ఇటీవల విచారణ జరిపింది. ఆ నలుగురు వ్యక్తులు కూడా గతంలో తమకు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి నిరాకరించిన న్యాయమూర్తి ముందు తిరిగి తమ కేసు రాకుండా చేసేందుకే ఎఫ్ఐఆర్‌లన్నింటినీ కలపాలంటూ పిటిషన్ దాఖలు చేశారని అంబలాల్ తన పిటిషన్‌లో ఆరోపించారు. అంతేకాక.. ఎనిమిది ఎఫ్ఐఆర్‌లలో తమపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని కూడా కోరారని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. పైపెచ్చు ఫిర్యాదుదారులను అసలు ప్రతివాదులుగా చేర్చలేదని వివరించారు.

ఫోరం షాపింగ్‌కు ఈ కేసు ఓ ఉదాహరణ..

వాదనలు విన్న సుప్రీంకోర్టు ధర్మాసనం.. గతంలో ఎఫ్ఐఆర్‌లను కొట్టేయాలంటూ క్రిమినల్ పిటిషన్ దాఖలు చేసిన న్యాయవాది, ఎఫ్ఐఆర్‌లన్నింటినీ కలిపేయాలంటూ సివిల్ పిటిషన్ దాఖలు చేసిన న్యాయవాది ఒకరేనని గుర్తించింది. ఫోరం షాపింగ్‌కు ఈ కేసు ఓ ప్రామాణిక ఉదాహరణని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టంచేసింది. అంతేగాక.. న్యాయ ప్రక్రియ దుర్వినియోగానికి ఈ కేసు ఓ మచ్చుతునకని కూడా తెలిపింది. ఎఫ్ఐఆర్‌లన్నింటినీ కలిపేయాలంటూ దాఖలు చేసిన సివిల్ రిట్ పిటిషన్‌ను అసలు ఎలా విచారించారంటూ విస్మయం వ్యక్తంచేసింది. క్రిమినల్ కేసులను విచారించేందుకు సీజే నిర్దిష్ట రోస్టర్‌ను ఖరారు చేశారని.. ఈ కేసులో నలుగురు నిందితులు దాఖలు చేసినటువంటి పిటిషన్లను న్యాయస్థానాలు అనుమతిస్తూ వెళ్తే సీజే నిర్దేశించే రోస్టర్‌కు ఎంతమాత్రం విలువ ఉండదని తేల్చిచెప్పింది. ఆ నలుగురు వ్యక్తులు మరో న్యాయమూర్తి ముందు దాఖలు చేసిన సివిల్ రిట్ పిటిషన్‌ను కొట్టేస్తున్నట్లు తెలిపింది. ఈ నలుగురు వ్యక్తుల వ్యవహారశైలిని సెక్షన్–482 కింద వీరి పిటిషన్లను విచారిస్తున్న న్యాయమూర్తి దృష్టికి తీసుకురావాలని స్పష్టంచేసింది.

'ఫోరం షాపింగ్' బాబు బ్యాచ్‌కు కొట్టిన పిండి..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టుతో పాటు విభజిత ఏపీ హైకోర్టులో కూడా ఫోరం షాపింగ్, నాట్ బిఫోర్ అనగానే వెంటనే గుర్తొచ్చేది చంద్రబాబు అండ్ కోనే. గతంలో ఎన్నడూ వినని, తెలియని ఫోరం షాపింగ్, నాట్ బిఫోర్ వంటి వాటిని సామాన్య జనానికి తెలిసేలా చేసింది ఆ బ్యాచే. గతంలో చంద్రబాబు ఈ 'ఫోరం షాపింగ్' ను అడ్డంపెట్టుకుని ఎన్నో కేసుల నుంచి బయటపడ్డ ఉదంతాలున్నాయి.

- అక్రమాస్తులకు సంబంధించి లక్ష్మీపార్వతి దాఖలు చేసిన పిటిషన్‌లో చంద్రబాబు ఏ రకంగా వ్యవహరించారో రాష్ట్ర ప్రజలందరూ చూశారు.
- రామోజీ, చంద్రబాబు తదితరుల అక్రమార్జనపై వైఎస్ విజయమ్మ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంలోనూ చంద్రబాబు అండ్ కో వేసిన నాట్ బిఫోర్ నాటకాలతో న్యాయవ్యవస్థే విస్మయం చెందింది.
- ఫలానా న్యాయమూర్తి తమకు అనుకూలంగా ఉత్తర్వులివ్వరని భావిస్తే, అతనిపైకి కొందరు న్యాయవాదులను ఉసిగొల్పి, ఆ న్యాయమూర్తితో ఉద్దేశపూర్వకంగా గొడవ పెట్టుకుని ఆ కేసు విచారణ నుంచి ఆ న్యాయమూర్తులు తప్పుకునేలా చేసిన కేసులూ ఎన్నో.
- ఇలా న్యాయమూర్తులతో గొడవలు పెట్టుకున్నందుకు ఆ న్యాయవాదులకు పెద్ద మొత్తాల్లో డబ్బు ముట్టజెప్పిన సంగతి న్యాయవర్గాల్లో అందరికీ తెలుసు.
- తాజాగా.. ఓ కేసులో కూడా చంద్రబాబు బృందం ఇలానే ఫోరం షాపింగ్‌కు పాల్పడింది. దీనిపై ప్రస్తుతం న్యాయవర్గాల్లో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది.

"వరి ధాన్యం సేకరణకు ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లిస్తున్న ధరలు ఎంత ఆకర్షణీయంగా ఉన్నాయంటే, బీజేపీ ప్రచార సారథి, మాజీ సీఎం రమణ్‌సింగ్ తన పంటను సైతం ఐదు సంవత్సరాలుగా ప్రభుత్వానికే విక్రయిస్తూ వస్తున్నారు...!"

- నవంబర్ 7న తొలి దశ పోలింగ్ జరగనున్న వేళ రాష్ట్రంలో వినిపిస్తున్న జోక్ ఇది. ఇది అతిశయోక్తేమీ కాదని బీజేపీ నేతలు, కార్యకర్తలు కూడా అంటుండటం విశేషం! ఎలాంటి వివక్షా లేకుండా అర్హులైన రైతులందరికీ పథకాన్ని వర్తింపజేస్తుండటం భూపేశ్ బఘేల్ ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో అతి పెద్ద సానుకూలాంశం కానుందని వారూ పరోక్షంగా ఒప్పుకుంటున్నారు...

పంచతంత్రం

వరి బోనసే గట్టెక్కిస్తుంది..!



ఛత్తీస్‌గఢ్‌లో సీఎం బఘేల్ ధీమా

రైతుల్లో కాంగ్రెస్ పట్ల సానుకూలత

పథకం ప్రభావంపై బీజేపీలో గుబులు

ఛత్తీస్‌గఢ్‌లో తొలి దశ పోలింగ్‌కు ఇంకా పది రోజులే ఉంది. అధికార కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీ ప్రచారంతో హోరెత్తిస్తున్నాయి. సీఎం భూపేశ్ బఘేల్ మాత్రం 2018 నుంచీ వరి పంటకు తాము అందిస్తూ వస్తున్న రూ.600 బోనస్ ఈసారి తమను సునాయాసంగా ఎన్నికల గండాన్ని గట్టెక్కిస్తుందని ధీమాగా ఉన్నారు. రైతుల స్పందన ఆయన నమ్మకాన్ని గట్టిపరిచేదిగానే ఉండటం విశేషం!

రైతుకు బోనస్ భరోసా...

విత్తు దశ నుంచి ధాన్యం చేతికొచ్చి అమ్ముడయ్యే దాకా అడుగడుగునా దైవాధీనంగానే సాగే సాగుకు బఘేల్ ప్రభుత్వం ఒక భరోసా కల్పించిందన్నది ఛత్తీస్‌గఢ్ రైతుల నోట వినిపిస్తున్న మాట. నిజానికి క్వింటా వరికి రూ.300 చొప్పున బోనస్ చెల్లిస్తామని 2013 అసెంబ్లీ ఎన్నికల వేళ బీజేపీ వాగ్దానం చేసింది. కానీ గెలిచి అధికారంలోకి వచ్చాక రెండేళ్లు చెల్లించి చేతులెత్తేసింది. ఇది 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అవకాశాలను బాగా దెబ్బ తీసింది. అందుకే, బఘేల్ హయాంలో రైతులకు మంచి రోజులొచ్చాయని బస్నా గ్రామానికి చెందిన హేమ్‌సింగ్ నిషాద్ అనే రైతు అభిప్రాయపడ్డాడు. 'రమణ్‌సింగ్ సర్కారు ఎన్నికల హామీల అమలులో విఫలమైంది. కాంగ్రెస్ అలా కాకుండా ఇచ్చిన మాట నిలబెట్టుకుంది' అన్నాడతను. 'భూపేశ్‌తో మాకు లబ్ధి చేకూరింది. రమణ్‌సింగ్ మాటిచ్చి తప్పారు' అంటూ జుడా గ్రామానికి చెందిన శోభారాం భరద్వాజ్ అనే రైతు నిష్టూరమాడాడు. తన 18 ఎకరాలకు ప్రభుత్వం నుంచి ఏటా రూ.1.5 లక్షలకు పైగా బోనస్ అందుతోందని దుర్గ్ జిల్లాలోని పటన్ ప్రాంత రైతు ఖేమ్‌రాజ్ చందార్కర్ చెప్పుకొచ్చాడు. వరి రైతులందరిలోనూ చందార్కర్ తరహా స్పందనే కనిపిస్తోంది.

పార్టీలకతీతంగా...

పార్టీలు, రాజకీయాలతో నిమిత్తం లేకుండా ప్రతి రైతుకూ బోనస్ పథకాన్ని వర్తింపజేస్తుండటం బఘేల్ సర్కారు విశ్వసనీయతను మరింత పెంచిన అంశం. తాను బీజేపీ కార్యకర్తనని, అయినా తనకూ ఠంచనుగా బోనస్ అందుతోందని నద్వాయ్ గ్రామానికి చెందిన గులాబ్ వర్మ చెప్పాడు. కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి తమకు ఎంతో సాయం అందుతోందని బెమెటరా జిల్లాలోని ఉమారియా గ్రామానికి చెందిన ఖైర్దిన్ సాహు అనే మహిళా రైతు సంతోషం వెలిబుచ్చారు. బఘేల్ హయాంలో రైతులకు చాలా మేలు జరిగిందన్నది వాస్తవమని మాజీ సీఎం రమణ్‌సింగ్ స్వగ్రామం రాంపూర్‌కు చెందిన తులారాం అనే రైతు చెప్పుకొచ్చారు.

కోటి మంది ఓటర్లపై ప్రభావం.

వరికి బోనస్ పథకంతో దాదాపు 26 లక్షల మంది రైతులు నేరుగా లబ్ధి పొందుతున్నారు. వారి కుటుంబాల్లో వారందరినీ కలిపితే కనీసం కోటి మంది ఓటర్లు ఈ పథకం తాలూకు లబ్ధిదారులన్నమాట! ఇది రాష్ట్రంలోని మొత్తం ఓటర్ల సంఖ్యలో ఏకంగా సగం కావడం విశేషం. ఈ అంశమే కాంగ్రెస్‌కు ధీమాను కల్పిస్తూ బీజేపీకి గుబులు పుట్టిస్తోంది. 'ఒక్క రైతులనే కాదు, అన్ని వర్గాలూ బఘేల్ పాలన పట్ల ఎంతో కొంత సంతృప్తిగా కనిపిస్తున్నాయి. ఎవరిని కదిలించినా ఆయనకు మరో అవకాశం ఇద్దామన్న ధోరణే కనిపిస్తోంది' అని గులాబ్ వర్మ వంటి బీజేపీ కార్యకర్తే చెబుతుండటం పరిస్థితికి అద్దంపడుతోంది!

- కౌలు రైతులు మాత్రం బఘేల్ తీరుపై పెదవి విరుస్తున్నారు. ఆయన అందిస్తున్న బోనస్ కామందులకే అందుతోంది తప్ప తమకు ఒరుగుతున్నదేమీ లేదన్నది వారి ఆవేదన. 'ప్రభుత్వం నుంచి అందుతున్న నగదును వాళ్లు మాకైతే ఇవ్వరుగా. ఏడు గంటలు పొలాల్లో కష్టపడితే మాకు దక్కేది కేవలం రూ.110. ఈ తలరాత అయితే మారదుగా' అన్న వారి అసంతృప్తిపై బీజేపీ ఆశలు పెట్టుకుంది. ఈ పథకం కేవలం ధనిక రైతులకే లబ్ధి చేకూరుస్తోందంటూ జోరుగా ప్రచారం చేస్తోంది.

ఏమిటీ పథకం...?

- బఘేల్ సర్కారు 2018లో అధికారంలోకి రాగానే రాజీవ్‌గాంధీ కిసాన్ న్యాయ యోజనను అమల్లోకి తెచ్చింది.
- దీనికింద ప్రతి ఎకరాకు 15 క్వింటాళ్ల చొప్పున వరిని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వమే రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేస్తుంది.
- అలా కొనుగోలు చేసే ప్రతి క్వింటాలుకు కనీస మద్దతు ధరకు అదనంగా రూ.600 చొప్పున చెల్లిస్తోంది.
- అలా ప్రతి రైతుకు ఎకరాకు రూ.9,000 చొప్పున నేరుగా అందిస్తూ వస్తోంది.
- ఈ ఖరీఫ్‌లో వరికి కేంద్రం నిర్ణయించిన కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.2,040 కాగా బఘేల్ సర్కారు రైతులకు రూ.2,640 చెల్లించింది.
- ఇది దేశంలోనే అత్యధికం!
- పంట నష్టపోయినా ప్రభుత్వం నుంచి ఈ బోనస్‌కు ఢోకా ఉండదు. ప్రకృతి విపత్తులు తదితర కారణాలతో పంట చేతికిరాని సందర్భాల్లో ఇది రైతులకు ఎంతో ఊరటగా నిలిచింది.
- ఇలా సేకరించిన ధాన్యాన్ని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు ప్రభుత్వమే విక్రయిస్తుంది.
- ఈ పథకం వల్ల ఛత్తీస్‌గఢ్‌లో దాదాపు 26 లక్షల మంది రైతులు నేరుగా లబ్ధి పొందుతున్నారు.
- వచ్చే సీజన్ నుంచి ఒక్కో రైతు నుంచి ప్రతి ఎకరాకు వరి సేకరణను 20 క్వింటాళ్లకు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది.
- దాంతో ఎకరాకు అందే బోనస్ రూ.12,000కు పెరగనుంది.
- గెలిస్తే క్వింటాకు రూ.3,600కు పెంచుతామని మంత్రి చెప్పారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

గెహ్లోత్ కుమారుడికి ఈడీ సమన్లు

- ఫెమా కేసులో నేడు విచారణకు రావాలంటూ వైభవ్‌కు నోటీసు
- రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు సహా పలువురి నివాసాల్లో సోదాలు
- పరీక్ష పేపర్ లీకేజీ కేసులో దర్యాప్తు చేస్తున్న ఈడీ
- కేంద్రం గూండాగిరీకి పాల్పడుతోందన్న సీఎం అశోక్ గెహ్లోత్

జైపూర్: రాజస్తాన్‌లో ఎన్నికల వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. పరీక్ష పేపర్ లీకేజీ కేసులో మనీ ల్యాండరింగ్ ఆరోపణలపై రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు, పాఠశాల విద్యాశాఖ మాజీ మంత్రి గోవింద్ సింగ్ దోతాస్రా ఇళ్లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దాడులు జరిపింది. అదేవిధంగా, విదేశీ కరెన్సీ నిబంధనల ఉల్లంఘన కేసులో సీఎం అశోక్ గెహ్లోత్ కుమారుడు వైభవ్‌కు సమన్లు జారీ చేసింది. శుక్రవారం ఢిల్లీలోని తమ ప్రధాన కార్యాలయంలో జరిగే విచారణకు హాజరు కావాలని ఆయన్ను కోరింది. సీఆర్‌పీఎఫ్ బలగాల బందోబస్తు నడుమ గురువారం ఈడీ అధికారుల బృందం జైపూర్, సికార్‌లలోని గోవింద్ సింగ్ ఇళ్లలో సోదాలు చేపట్టారు. వచ్చే నెలలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఈయన సికార్ జిల్లాలోని లచ్చమన్‌గఢ్ నుంచి పోటీలో ఉన్నారు. అదేవిధంగా, దౌసా జిల్లాలోని మహువా సీటుకు పోటీలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి ఓం ప్రకాశ్ హుడ్లా, మరికొందరి ఇళ్లలో కూడా సోదాలు చేపట్టినట్లు ఈడీ వర్గాలు తెలిపాయి. 2022 డిసెంబర్‌లో రాజస్తాన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన సీనియర్ టీచర్ గ్రేడ్-2 పరీక్షలో జనరల్ నాలెడ్జి ప్రశ్నపత్రం లీకైంది. అప్పటి విద్యాశాఖ మంత్రి గోవింద్‌సింగ్ తదితరులు కలిసి ఒక్కో అభ్యర్థి నుంచి రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వసూలు చేసి, ఈ దందాకు పాల్పడినట్లు ఈడీ ఆరోపిస్తోంది.



వైభవ్‌పై ఆరోపణలేంటీ?

సీఎం గెహ్లోత్ కుమారుడు వైభవ్ విదేశీ మారక ద్రవ్య మార్పిడి చట్టం కేసును ఎదుర్కొంటున్నారు. 2011 నుంచి ఈ కేసుకు సంబంధించిన పత్రాలను సమకూర్చుకోవాల్సి ఉన్నందున వైభవ్ శుక్రవారం విచారణకు హాజరుకాకపోవచ్చని ఈడీ అంటోంది. విచారణ వాయిదా కోరవచ్చని భావిస్తోంది. రాజస్తాన్‌కు చెందిన ట్రిటాన్ హోటల్స్ అండ్ రిసార్ట్స్, వార్ధా ఎంటర్ ప్రైజెస్ సంస్థల ప్రమోటర్లకు చెందిన జైపూర్, ఉదయ్‌పూర్, ఢిల్లీల్లోని పలు ప్రాంతాల్లో ఆగస్టులో ఈడీ సోదాలు జరిపింది. వీరికి వైభవ్ గెహ్లోత్‌తో సంబంధాలున్నట్లు ఈడీ అనుమానిస్తోంది. దాడుల్లో రూ.1.2 కోట్ల లెక్కల్లో చూపని నగదును గుర్తించింది.

కేంద్రం గూండాగిరీ: సీఎం గెహ్లోత్

ఎన్నికల వేళ తాజా పరిణామాలపై సీఎం అశోక్ గెహ్లోత్ స్పందించారు. ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ ప్రకటిస్తున్న హామీలను చూసి భయపడే గూండాగిరీకి బీజేపీ తెరతీసిందని సీఎం అశోక్ గెహ్లోత్ ఆరోపించారు. 'ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని తేలడంతో ఈడీని అడ్డుపెట్టుకుని భయోత్పాతం సృష్టించేందుకు ప్రయత్నిస్తోంది. బీజేపీ బెదిరింపులకు తాము లొంగేది లేదు'అని గెహ్లోత్ స్పష్టం చేశారు. ఈడీ అనే మిడతల దండుతో చివరికి నష్టపోయేది బీజేపీయేనని వ్యాఖ్యానించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఈడీ, ఐటీ, సీబీఐలను కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యకర్తలుగా మార్చేసుకుందని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. రాజస్తాన్‌లో ఓటమి ఖాయమని తెలిసే, చివరి ప్రయత్నంగా ఇటువంటి చర్యలకు దిగిందన్నారు. మోదీ ప్రభుత్వం నియంతృత్వ ధోరణ ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని ఆయన వ్యాఖ్యానించారు. కాగా, సీఎం గెహ్లోత్‌తో పొసగని మాజీ డిప్యూటీ సీఎం సచిన్ పైలట్ కూడా ఈడీ చర్యలపై స్పందించారు. సీఎం గెహ్లోత్‌కు మద్దతు పలికారు. బీజేపీ ఇలాంటి జిమ్మిక్కులతో తమ నేతలను భయపెట్టలేదని వ్యాఖ్యానించారు. 2020లో తన ప్రభుత్వంపై పైలట్ సారథ్యంలో జరిగిన తిరుగుబాటు యత్నం విఫలమైందంటూ తాజాగా గెహ్లోత్ వ్యాఖ్యానించడం గమనార్హం.

కాంగ్రెస్ రాజకీయం చేస్తోంది: బీజేపీ

ఈడీ సోదాలను రాజకీయం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తోందని బీజేపీ ఎదురుదాడికి దిగింది. ఈ శతాబ్దంలోనే అత్యంత అవినీతి ప్రభుత్వం సీఎం గెహ్లోత్ ప్రభుత్వమని సొంతపార్టీ నేతలే విమర్శిస్తున్నారని బీజేపీ నేత, కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతల ఆరోపణలు పూర్తిగా నిరాధారాలంటూ ఆయన కొట్టిపారేశారు. అవినీతి వ్యవహారంలో పెద్ద చేపలను పట్టుకునేందుకే ఈడీ చర్యలు ప్రారంభించిందని మంత్రి షెకావత్ చెప్పారు. రాష్ట్ర అసెంబ్లీలోని 200 సీట్లకు నవంబర్ 25న ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే.

'నిజం గెలవాలి'తో బాబు మరింత ఇరుక్కుంటారు..

మంత్రి అంబటి రాంబాబు



రాజమహేంద్రవరం రూరల్: టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి 'నిజం గెలవాలి' అని యాత్ర మొదలు పెట్టారని... అయితే నిజం గెలవాలని ఉద్యమం చేస్తే చంద్రబాబు మరింత ఇరుక్కుంటారని ఏపీ జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. నిజం గెలిచింది కాబట్టే చంద్రబాబు ఇవాళ జైల్లో ఉన్నారని ఆయన చెప్పారు. రాజమహేంద్రవరంలోని ఓ హోటల్లో గురువారం అంబటి రాంబాబు విలేకరులతో మాట్లాడుతూ భువనేశ్వరి 'నిజం గెలవాలి' అని యాత్ర చేపట్టారని, అలా కాకుండా అవినీతి గెలవాలి, అబద్ధం గెలవాలి, అన్యాయం గెలవాలి.. అని ఉద్యమం చేస్తే అప్పుడు చంద్రబాబుకు ఉపయోగం ఉండవచ్చని అన్నారు. 'సానుభూతి కోసమే భువనేశ్వరి యాత్ర చేస్తున్నారు. మీ ఆస్తులపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో మీరు విచారణకు ఆహ్వానిస్తే అప్పుడు నిజం గెలుస్తుంది. ప్రజల కోసం చంద్రబాబు అహర్నిశలూ కష్టపడ్డారని భువనేశ్వరి చెబుతున్నారు.. మరి 2019లో ప్రజలు ఎందుకు ఆయన్ను తిరస్కరించారు. చంద్రబాబు ఎప్పుడు నిజం చెప్పారు? కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు చెప్పారా? ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచినప్పుడు నిజం చెప్పారా? తెలంగాణలో ఓటుకు నోటు కేసులో నిజం చెప్పారా? రాజధాని భూముల కేసులో నిజం చెప్పారా? అధికారం, ధనబలంతో నిజాన్ని ఇంతకాలం తొక్కిపెట్టారు..' అని అన్నారు.

మధ్యవర్తిగా పురందేశ్వరి

చెల్లెలి భర్త, మరిది అయిన చంద్రబాబును, లోకేశ్‌ను కాపాడేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నారని మంత్రి అంబటి పేర్కొన్నారు. ఆమె లోకేశ్‌ను తీసుకెళ్లి అమిత్‌షాతో అపాయింట్‌మెంట్ ఇప్పించారని, ఆ సమావేశం కోసం లోకేశ్ ఏమి చేశారో కూడా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టంగా చెప్పారన్నారు. రాష్ట్రంలో లిక్కర్ స్కామ్ జరుగుతోందంటూ వచ్చిన పేపర్ కథనాలపై కేంద్రం విచారణ చేయాలని పురందేశ్వరి కోరడం దారుణమన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మద్యం అమ్మకాలు తగ్గాయన్నారు.

కేంద్ర జలసంఘం నిర్ణయం మేరకే డయాఫ్రం వాల్ నిర్మాణం

పోలవరం ప్రాజెక్టులో దెబ్బతిన్న డయాఫ్రం వాల్‌కు మరమ్మతులు చేపట్టడమా, సమాంతరంగా మరొకటి నిర్మించడమా.. అనే విషయాలపై కేంద్ర జలసంఘం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ నిర్ణయం తీసుకోవాల్సి ఉందని మంత్రి అంబటి చెప్పారు. కేంద్ర జలసంఘం దేనికి అనుమతిస్తే దానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణం చేపడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పాల్గొన్నారు.

● సక్సెస్ స్టోరీ

ఆసక్తే అతడి శక్తి


జె కపూర్

తెలుసుకోవాలనే ఆసక్తి ఆ తరువాత శక్తిగా మారుతుంది. శక్తిమంతులు ఊరకే ఉంటారా! కొత్త ద్వారాలు తెరుస్తారు. గర్వ పడేలా ఘన విజయాలు సాధిస్తారు. ఢిల్లీకి చెందిన జె కపూర్ టెక్నో యూనివర్శిటీలలో చదువుకోలేదు. 'ఎందుకు? ఏమిటి? ఎలా?' అంటూ గ్యాడ్జెట్ల పుట్టుపుర్వోత్తరాల గురించి ఆసక్తి చూపించేవాడు. ఆ ఆసక్తి అంతులేని శక్తిని ఇచ్చింది. 'డిజిటల్ స్టార్' హోదాలో హుందాగా కూర్చోబెట్టింది. తాజాగా... ఫోర్బ్స్ ఇండియా 'టాప్ డిజిటల్ స్టార్స్' జాబితాలో చోటు సంపాదించాడు జె కపూర్...

మొబైల్, ల్యాప్‌టాప్, కంప్యూటర్‌లకు సంబంధించి సాంకేతిక సమస్య తలెత్తితే జే కపూర్‌ను వెదుక్కుంటూ వచ్చే వాళ్లు ఫ్రెండ్స్. నిమిషాల వ్యవధిలోనే వాళ్లు పట్టుకొచ్చిన సమస్యకు పరిష్కారం చూపేవాడు కపూర్. కొంతకాలం తరువాత సుపరిచితులే కాదు అపరిచితులు కూడా కపూర్‌ను వెదుక్కుంటూ రావడం మొదలైంది. ఈ నేపథ్యంలోనే 'తరచుగా ఎదురయ్యే కొన్ని సాంకేతిక సమస్యలకు పరిష్కారాలు' పేరుతో ఒక వీడియో చేసి యూట్యూబ్‌లో పెట్టాడు.

అలా డిజిటల్ ప్రపంచంలో తొలి అడుగు వేశాడు.

2011లో తన పేరుతోనే యూట్యూబ్ చానల్ ప్రారంభించాడు. అయితే చాలా మంది యూట్యూబర్‌లకు ఎదురైనట్లే ఖరీదైన కెమెరా ఎక్విప్‌మెంట్స్ కొనడానికి ఆర్థిక సమస్యలు ఎదురయ్యాయి. అయినా సరే వెనక్కి తగ్గలేదు. ఎలాగో కష్టపడి తనకు కావాల్సిన సాంకేతిక పరికరాలు సమకూర్చుకున్నాడు.

లేటెస్ట్ టిప్స్, ట్రిక్స్, ట్యుటోరియల్స్, ట్రెండింగ్ టాపిక్స్‌తో తన యూట్యూబ్ చానల్ దూసుకుపోయింది.



కష్టం కనిపిస్తేనే విజయం కనిపిస్తుంది

స్ఫూర్తి అనేది ఎక్కడి నుంచి, ఎవరి నుంచి అయినా తీసుకోవచ్చు. స్ఫూర్తి తీసుకోవడానికి పెద్దగా కష్టం అక్కర్లేదు. అయితే ఆ స్ఫూర్తిని మన విజయంగా మలుచుకోవడానికి మాత్రం బాగా కష్టపడాలి. కష్టం కనబడని చోట విజయం కూడా కనిపించదు.

– జే కపూర్

సక్సెస్‌కు 'ఐడియా అండ్ రిసెర్చ్' ముఖ్యమైనవి అంటాడు కపూర్. ట్విట్టర్ నుంచి దినపత్రికలలో వచ్చే ఆర్టికల్స్ వరకు ఎక్కడో ఒక చోట తనకు ఐడియా దొరుకుతుంది. ఆ తరువాత అన్ని కోణాల్లో దాని మీద రిసెర్చ్ మొదలుపెడతాడు.

'కొన్నిసార్లు మూడు గంటల్లో చేసిన వీడియోలకు లక్షలాది వ్యూస్ వస్తాయి. కొన్నిసార్లు రోజుల తరబడి చేసిన వీడియోలు ఫ్లాప్ అవుతుంటాయి' నవ్వుతూ అంటాడు కపూర్.

19 సంవత్సరాల వయసులోనే మన దేశంలోని 'టాప్ 6 టెక్ యూట్యూబర్స్'లో ఒకరిగా నిలిచిన జే కపూర్ ఆండ్రాయిడ్ డెవలపర్ కూడా. 'ఫ్లాష్ సేల్ హెల్పర్' అతడి తొలి యాప్. ఆ తరువాత స్మార్ట్‌ఫోన్ యూజర్‌లకు ఉపయోగపడే 'వోల్ట్ చెకర్' యాప్ క్రియేట్ చేశాడు.

'విజయం సాధించాలనే దృష్టితో పెద్ద వాళ్ళ ఇంటర్వ్యూలు అదేపనిగా చదవడం నుంచి కాన్ఫరెన్స్‌లకు హాజరు కావడం వరకు ఎన్నో చేస్తుంటాం. అయితే మన జయాపజయాలను నిర్ణయించేది మాత్రం మన కష్టమే' అంటాడు జే కపూర్.

టెక్ ఇన్‌ఫ్లూయెన్సర్‌గా సుపరిచితుడైన కపూర్ 'మనీ మిసెక్స్' పేరుతో చేసే వీడియోలతో ఫైనాన్స్ ఇన్‌ఫ్లూయెన్సర్‌గా కూడా మంచి మార్కులు కొట్టేశాడు.

● టెక్.. టాక్



కిండిల్ వోయాసిస్ ఈ-బుక్ రీడర్

- స్టైల్ నేమ్: షాంపైన్ గోల్డ్
- వాటర్ ప్రూఫ్ ● 32 జీబి స్టోరేజ్
- ప్రైమ్ మెంబర్స్ ఉచితంగా ఎన్నో పుస్తకాలు చదువుకోవచ్చు.
- కొత్త రిలీజ్‌లతో ఇన్‌స్టంట్ యాక్సెస్ కావచ్చు.

లాంగ్ పీడీఎఫ్‌లను క్లాడ్ ఏఐతో క్విక్‌గా సమరైజ్ చేయడానికి...

1. క్లాడ్ ఏఐలో ఇమెయిల్ అడ్రస్ ఎంటర్ చేయాలి
2. వెరిఫికేషన్ కోడ్‌ను ఎంటర్ చేయాలి.
3. పేరు ఎంటర్ చేయాలి 4. యూజ్ అండ్ ప్రైవసీ పాలసీ అంగీకరించిన తరువాత...ఫోన్ నెంబర్ మరో వెరిఫికేషన్ కోడ్ ఎంటర్ చేయాలి
5. ఫైల్ అప్‌లోడ్ చేయడానికి చాట్‌బాక్స్‌కు కుడివైపున ఉన్న పేపర్ క్లిక్ ఐకాన్‌ను నొక్కాలి 6. అప్‌లోడ్ చేయదల్చుకున్న ఫైల్‌ను సెలెక్ట్ చేసుకోవాలి.
7. 'సమరైజ్ పీడీఎఫ్' అని టైప్ చేసి ఎంటర్ నొక్కాలి. సెర్చ్‌బార్ పైన ఉన్న ఏరోప్లేన్ ఐకాన్‌ను కూడా నొక్కవచ్చు.



వన్ ప్లస్ ఓపెన్



డిస్‌ప్లే: 7.82 అంగుళాలు
రిజల్యూషన్: 2,440×2,268 పిక్సెల్స్
రిఫ్రెష్‌రేట్: 120 హెచ్‌జడ్
వోఎస్: ఆండ్రాయిడ్ 13
బ్యాటరీ: 4,800 ఎంఏహెచ్; కనెక్టివిటీ: 5జీ

గూగుల్ పిక్సెల్ 8



డిస్‌ప్లే: 6.20 అంగుళాలు; వోఎస్: ఆండ్రాయిడ్ 14;
మెమోరీ: 128జీబి 8జీబి ర్యామ్ 256జీబి 8జీబి ర్యామ్
రిజల్యూషన్: 1080×2400 పిక్సెల్స్;
బ్యాటరీ: 4,575 ఎంఏహెచ్

● అవును... ఇది నిజమే!

- టోలెడో మ్యూజియం ఆఫ్ ఆర్ట్ గ్యాలరీ(యూఎస్)లో కనిపించే ఇండోర్ రెయిన్‌బో ప్రేక్షకులకు ప్రత్యేక ఆకర్షణ. ఇది సహజమైనది కాదు. వేలాది కలర్ థ్రెడ్స్‌తో సృష్టించారు.
- మెయిల్ అడ్రస్ ఉన్న ప్రపంచంలోని ఏకైక చెట్టు జర్మనీలో ఉంది. వైటిన్ పట్టణానికి సమీపంలో ఉన్న అడవిలోని బ్రైడ్‌గ్రూమ్ ఓక్‌కు ప్రతి సంవత్సరం వెయ్యి ఉత్తరాలు వస్తాయి. ఈ ఉత్తరాలను ఎవరైనా తీసుకొని బదులు ఇవ్వవచ్చు.



● ఇంగ్లిష్ ఇడియమ్స్

డ్రెస్‌డ్ అప్ టు ది నైన్స్

ఉత్సవాలు, వేడుకలు... మొదలైన ప్రత్యేక సందర్భాలలో స్మార్ట్, ఫ్యాషనబుల్‌గా కనిపించే దుస్తులను ధరించినప్పుడు ఉపయోగించే మాట...డ్రెస్‌డ్ అప్ టు ది నైన్స్.

ఉదా: ఎవ్రీవన్ వాజ్ డ్రెస్‌డ్ అప్ టు ది నైన్స్ ఫర్ ది అకాడమీ అవార్డ్స్

ఆఫ్ ది కఫ్

ప్రిపరేషన్ లేకుండా ఒక పని చేయడం, ఉపన్యాసం ఇవ్వడం... మొదలైన సందర్భాలలో ఉపయోగించే మాట... ఆఫ్ ది కఫ్

ఉదా: ఐ హ్యాడ్ నాట్ ప్రిపేర్‌డ్ ఏ స్పీచ్ సో ఐ జస్ట్ సెడ్ ఏ ఫ్యూ వర్డ్స్ ఆఫ్ ది కఫ్

● గేమింగ్



దూసుకుపోవాల్సిందే!

యాక్షన్ వీడియో గేమ్ 'ఘోస్ట్ రన్నర్-2' విడుదలైంది. 2020లో వచ్చిన 'ఘోస్ట్ రన్నర్'కు సీక్వెల్‌గా వచ్చిన గేమ్ ఇది. ఫస్ట్-పర్సన్ పర్‌స్పెక్టివ్ నుంచి ఆడే ఈ గేమ్‌లో జాక్ అనే ప్లేబుల్ క్యారెక్టర్ చురుకుదనానికి మరో పేరు. డాషింగ్, జంపింగ్, వాల్-రన్నింగ్...మొదలైన వాటిలో అతడికి ఎదురులేదు.

'గ్రాప్లింగ్ హుక్' 'సెన్సరీబూస్ట్' అతడి ఆయుధాలు. వెహిక్యులర్ కంబాట్, స్టమిన మీటర్‌లను ఈ గేమ్‌లో కొత్తగా చూడవచ్చు. కొత్త ప్లేయర్స్‌ను కూడా ఆకట్టుకునే అంశాలను ఈ గేమ్‌లోకి తీసుకువచ్చారు. గేమ్ ఫాస్ట్ మూమెంట్ సిస్టమ్‌తో స్ట్రగుల్ అయ్యే ప్లేయర్స్ కోసం 'యాక్టివ్ బ్లాకింగ్ మెకానిక్'ను తీసుకువచ్చారు.

ప్లాట్‌ఫామ్స్: ప్లేస్టేషన్ 5/ విండోస్/ ఎక్స్ బాక్స్ సిరిస్ ఎక్స్/ఎస్
మోడ్స్: సింగిల్-ప్లేయర్
జానర్స్: యాక్షన్

● మ్యూజిక్ వరల్డ్

మెలోడి మెరుపు


ఫ్రిజెల్ డిసోజా

బెంగళూరుకు చెందిన సింగర్, సాంగ్ రైటర్ ఫ్రిజెల్ డిసోజా. ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లలో రకరకాల పాటల గురించి పోస్ట్‌లు, వీడియోలు పెట్టడం ద్వారా ఇండియన్ ఇండీ మ్యూజిక్ ప్రపంచంలోకి వచ్చింది.

లాక్‌డౌన్ కాలంలో ఫ్రెండ్‌తో మాట్లాడుతున్నప్పుడు 'సమ్‌థింగ్ న్యూ' పాట ఐడియా వచ్చింది. ఈ డెబ్యూ సాంగ్ ద్వారా డిసోజా మెలోడియస్ వాయిస్‌కు మంచి పేరు వచ్చింది.

సోషల్ మీడియాలో కనిపించి, వినిపించే డిసోజా లైవ్ ప్రోగ్రామ్స్‌లో కూడా పాల్గొంది. ఫస్ట్ టూర్‌లో వచ్చిన పాజిటివ్ ఫీడ్‌బ్యాక్ ఆమెకు ఎంతో బలాన్ని ఇచ్చింది. ఇక రచన విషయానికి వస్తే...లవ్, హార్ట్‌బ్రేక్‌కు సంబంధించిన అంశాలపై పాటలు రాయడం డిసోజాకు ఇష్టం.

'వ్యక్తిగత అనుభవాల నుంచి చూసిన, విన్న విషయాల ఆధారంగా పాటలు రాయడం నాకు సులభం' అంటుంది.

మొదట్లో తన పాటల్లో ఎలక్ట్రిక్ గిటార్, డ్రమ్‌ల శబ్దం లిరిక్స్‌ను డామినేట్ చేసేది. ఇప్పుడు మాత్రం లిరిక్స్ కూడా స్పష్టంగా వినబడే ఈజీ-టు-లిజెన్ వైబ్‌కు ప్రాధాన్యత ఇస్తోంది. ఆర్కిటెక్చర్‌లో గ్రాడ్యుయేట్ అయిన డిసోజా ఫుల్-టైమ్ మ్యూజిషియన్‌గా ఉండడమే తనకు ఇష్టం అంటుంది.

సినిమా

హిట్ కాంబినేషన్ రిపీట్


● సూర్య


● సుధా కొంగర

'సూరరై పోట్రు' (తెలుగులో 'ఆకాశం నీ హద్దురా!') వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో సూర్య, దర్శకురాలు సుధా కొంగర కాంబినేషన్‌లో తెరకెక్కనున్న కొత్త సినిమా ప్రకటన గురువారం వెల్లడైంది. సూర్య కెరీర్‌లో 43వ సినిమాగా తెరకెక్కనున్న ఈ చిత్రంలో మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్, నటి నజ్రియా ఫాహద్, నటుడు విజయ్ వర్మ కీలక పాత్రల్లో నటించనున్నారు. 2డీ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై జ్యోతిక, సూర్య, రాజశేఖర్, కర్పూర సుందరపాండియన్ ఈ సినిమాను నిర్మించనున్నారు. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కనుంది. ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ స్వరకర్త. అతనికి సంగీత దర్శకుడిగా ఇది నూరవ చిత్రం కావడం విశేషం. ఇదిలా ఉంటే.. 68వ జాతీయ అవార్డ్స్‌లో ఉత్తమ నటుడు, ఉత్తమ నేపథ్య సంగీతం, ఉత్తమ నటి, ఉత్తమ స్క్రీన్‌ప్లే, ఉత్తమ చిత్రం విభాగాల్లో 'సూరరై పోట్రు' సినిమా అవార్డులు సాధించింది. తాజా చిత్రంతో సూర్య-సుధల హిట్ కాంబో రిపీట్ అవుతోంది.

కొత్త క్యారెక్టర్‌కి క్లాప్


● ఇందూజ రవిచంద్రన్, సెల్వ రాఘవన్, రవితేజ, వీవీ వినాయక్

హీరో రవితేజ కెరీర్‌లో కొత్త చిత్రం ప్రారంభమైంది. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవి శంకర్ ఈ సినిమాను నిర్మించనున్నారు. వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కనున్న ఈ సినిమా ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి అన్మోల్ శర్మ కెమెరా స్విచాన్ చేయగా, దర్శకుడు వీవీ వినాయక్ క్లాప్ ఇచ్చారు. దర్శకుడు కె. రాఘవేంద్రరావు గౌరవ దర్శకత్వం వహించగా, నిర్మాత అల్లు అరవింద్ మేకర్స్‌కు స్క్రిప్ట్‌ను అందించారు. ''ఒక పవర్‌ఫుల్ కథాంశంతో రూపొందించనున్న ఈ చిత్రంలో ఇప్పటివరకూ చూడని ఒక కొత్త పాత్రలో ప్రేక్షకులు రవితేజను చూస్తారు'' అని యూనిట్ పేర్కొంది. సెల్వ రాఘవన్, ఇందూజ రవిచంద్రన్ కీ రోల్స్ చేయనున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమెరా: జీకే విష్ణు.

పెళ్లికి ఎస్

హీరోయిన్ అమలా పాల్ తన జీవితంలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టనున్నారు. ఈవెంట్ మేనేజర్ జగత్ దేశాయ్‌ను పెళ్లాడనున్నారు అమలా పాల్. గురువారం (అక్టోబరు 26) ఆమె బర్త్ డే. ఈ సందర్భంగా అమలా పాల్‌కు తాను ప్రపోజ్ చేసిన వీడియోను సోషల్ మీడియా వేదికగా షేర్ చేసి, ''నా కలల రాణి నాకు 'ఎస్' చెప్పింది. వెడ్డింగ్ బెల్స్, హ్యాపీ బర్త్ డే మై లవ్' అని పేర్కొన్నారు జగత్ దేశాయ్. సో.. జగత్ దేశాయ్, అమలా పాల్ ఒకింటివారు కానున్నారని స్పష్టమవుతోంది. ఇక 2014లో తమిళ దర్శక-నిర్మాత ఏఎల్ విజయ్‌తో అమలా పాల్ వివాహం జరిగిన విషయం గుర్తుండే ఉంటుంది. అయితే ఈ ఇద్దరూ 2017లో విడాకులు తీసుకున్నారు.


● అమలాపాల్, జగత్ దేశాయ్


● నితిన్

నితిన్, శ్రీ లీల జంటగా వక్కంతం వంశీ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'ఎక్స్‌ట్రా: ఆర్డినరీ మేన్'. సుధాకర్ రెడ్డి, నికితా రెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమా డిసెంబరు 8న విడుదల కానుంది. ఈ సినిమా టీజర్‌ను ఈ నెల 30న విడుదల చేయనున్నట్లు వెల్లడించి, కొత్త పోస్టర్స్‌ను విడుదల చేశారు మేకర్స్.

భావోద్వేగ దీపావళి

తాతా-మనవడి అనుబంధం నేపథ్యంలో తెరకెక్కిన తమిళ చిత్రం 'కీడా'. పూ రాము, కాళీ వెంకట్ ముఖ్య తారలుగా దీపన్, పాండియమ్మ, విజయ, కమలి కీలక పాత్రల్లో నటించారు. 'స్రవంతి' రవికిశోర్ నిర్మించిన ఈ తమిళ చిత్రం తెలుగులో 'దీపావళి'గా రిలీజ్ కానుంది. పలు జాతీయ, అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో ప్రశంసలు అందుకుంది. తెలుగు, తమిళ భాషల్లో నవంబరు 11న రిలీజ్ కానున్న ఈ సినిమా ట్రైలర్‌ను హీరో రామ్ షేర్ చేశారు. దీపావళి పండక్కి మనవడికి కొత్త డ్రెస్ కొనాలని ఓ మేకను అమ్మకానికి పెడతాడు తాత. కానీ అది మొక్కుబడి మేక కావడంతో ఊర్లో ఎవరూ కొనరు. చివరికి మటన్‌షాప్ పెట్టుకోవాలనుకునే వీర బాబు కొంటాడు. ఆ తర్వాత ఏం జరిగింది? అన్నదే ఈ చిత్రం ప్రధానాంశం. మేక పాత్ర అబ్బులుకు నటుడు సప్తగిరి వాయిస్ ఓవర్ ఇచ్చారు. ''ఈ చిత్రంలో తాత-మనవడు-మేక మధ్య అనుబంధం, వారి భావోద్వేగాలు ప్రేక్షకుల హృదయాలను కదిలిస్తాయి'' అని యూనిట్ పేర్కొంది.


● పూ రాము

అడవి అందంగా ఉంటుంది


● రామ్‌గోపాల్ వర్మ, అప్సరా రాణి, శ్రీధర్ రెడ్డి, నగేశ్ నారదాసి

- రామ్‌గోపాల్ వర్మ

అప్సరా రాణి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'తలకోన'. నగేశ్ నారదాసి దర్శకత్వంలో స్వప్నా శ్రీధర్ రెడ్డి సమర్పణలో దేవర శ్రీధర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం నవంబరు రెండో వారంలో విడుదల కానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకు దర్శక-నిర్మాత రామ్‌గోపాల్ వర్మ, నటుడు శివాజీ రాజా, నిర్మాత రామారావు అతిథులుగా హాజరై పాటలు, ట్రైలర్‌ను విడుదల చేశారు. రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ– ''నాకు అందమంటే చాలా ఇష్టం. అడవి కూడా చాలా అందంగా ఉంటుంది. అందమైన అడవిలో అప్సరా రాణి డ్యాన్స్, ఫైట్లు చేస్తుంటే చూడటానికి అద్భుతంగా ఉంటుంది. ఈ సినిమా విజయం సాధించాలి'' అన్నారు. ''నటనకు స్కోప్ ఉన్న 'తలకోన'లాంటి సినిమా చేయడం నా అదృష్టం'' అన్నారు అప్సరా రాణి. ''ప్రకృతిలో ఏం జరుగుతుందో ఈ సినిమాలో చూపించే ప్రయత్నం చేశాం'' అన్నారు నగేశ్. ''చాలా రిస్క్ చేసి, ఈ సినిమా చిత్రీకరణను పూర్తి చేశాం'' అన్నారు దేవర శ్రీధర్ రెడ్డి.

మెలోడీ మోగెనా...

''ఉన్నట్టుండి మదిలోన ఏదో మెలోడీ మోగెనా..' అంటూ మొదలయ్యే 'ప్లాంట్ మ్యాన్' చిత్రంలోని 'కన్నమ్మ' పాట లిరికల్ వీడియో విడుదలైంది. పన్నా రాయల్ నిర్మించిన చిత్రం ఇది. ఆనంద బాలాజీ స్వరపరచిన ఈ పాటకు ఈశ్వర్ హేమ కాంత్ సాహిత్యం అందించగా, రోహిత్ శ్రీనివాసన్, కుమార వాగ్దేవి పాడారు. పన్నా రాయల్ దర్శకత్వ పర్యవేక్షణలో సంతోషి బాబు తెరకెక్కించిన ఈ చిత్రంలో చంద్రశేఖర్, సోనాలి పాణిగ్రాహి, అశోక్ వర్ధన్ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రం త్వరలో రిలీజ్ కానుంది.


● సోనాలి

ప్రయోగాత్మక ప్లాట్


● భాను భవతారక, వేణు ఊడుగుల, గాయత్రి, వికాస్

వికాస్ ముప్పాల, గాయత్రీ గుప్తా, సాజ్వి పసల, సంతోష్ నందివాడ, కిశోర్ ప్రధాన పాత్రధారులుగా భాను భవతారక దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ప్లాట్'. కార్తీక్ సేపురు, తరుణ్ విఘ్నేశ్వర్ సేరుపు, భాను భవ తారక ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి అతిథిగా హాజరై, ట్రైలర్‌ను రిలీజ్ చేసిన దర్శకుడు వేణు ఊడుగుల మాట్లాడుతూ– ''ట్రైలర్ చూస్తే కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లినట్టుగా అనిపిస్తోంది. ఇదొక ప్రయోగాత్మక చిత్రం. దర్శక-నిర్మాతలు ఈ తరహా సినిమాలను తీయాలంటే ప్రేక్షకులు ఇలాంటి చిత్రాలను ప్రోత్సహించాలి'' అన్నారు. ''నా కెరీర్‌కు ఈ సినిమా టర్నింగ్ పాయింట్ అవుతుందనుకుంటున్నాను'' అన్నారు వికాస్ ముప్పల. ''ఈ సినిమాను చూసి ప్రేక్షకులు కొత్త అనుభూతికి లోనవుతారు'' అన్నారు భాను భవతారక, తరుణ్ విఘ్నేశ్వర్.

అమ్మాయిల అంతరాత్మ


● మనోజ్, రాంభూపాల్ రెడ్డి, అలీ, నాగ రాజశేఖర్, సురేందర్

ఎలీనా, లాస్య స్మైలీ, తన్వీ, శశిరేఖ ముఖ్య తారలుగా, జయక్రిష్, సమీర్, అర్జున్, మల్లిక్ బాబు కీలక పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'అంతరాత్మ'. ఎమ్. నాగ రాజశేఖర్ రెడ్డి దర్శకత్వంలో తుమ్మల మనోజ్ యాదవ్, రావూరు సురేందర్ రెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమా పూజా కార్యక్రమాలు హైదరాబాద్‌లో జరిగాయి. తొలి సన్నివేశానికి ఏసీపీ బాలకృష్ణా రెడ్డి కెమెరా స్విచ్చాన్ చేయగా, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి క్లాప్ ఇచ్చారు. నటుడు అలీ స్క్రిప్ట్‌ను మేకర్స్‌కు అందించారు. ''నలుగురు అమ్మాయిల మధ్య సాగే సస్పెన్స్ థ్రిల్లర్ ఫిల్మ్ ఇది. సింగిల్ షెడ్యూల్‌లో షూటింగ్ పూర్తి చేస్తాం'' అన్నారు నాగ రాజశేఖర్. ఐఏఎస్ ఆఫీసర్ మురళీ మోహన్ ఓ అతిథిగా పాల్గొన్న ఈ చిత్రానికి సంగీతం: జీఎమ్ సతీష్, కెమెరా: నాగరాజు.

యాక్షన్.. థ్రిల్

రజత్ రాఘవ్, ఐశ్వర్యా రాజ్ బకుని జంటగా రాజు గుడిగుంట్ల దర్శకత్వంలో తెరకెక్కుతున్న సోషల్ థ్రిల్లర్ అండ్ ఫ్యాంటసీ యాక్షన్ ఫిల్మ్ 'మహర్ యోధ్ 1818'. సువర్ణ రాజు దాసరి నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ గురువారం హైదరాబాద్‌లో జరిగిన పూజా కార్యక్రమాలతో మొదలైంది. భద్రకాళీ పీఠం పీఠాధీశ్వరి డా. సింధు మాతాజీ ఆధ్వర్యంలో ప్రారంభోత్సవం జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి ఏపీయస్‌సీ సెల్ కమీషనర్ విక్టర్ ప్రసాద్ క్లాప్ కొట్టారు. దర్శకుడు నక్కిన త్రినాథ రావు గౌరవ దర్శకత్వం వహించారు. ''చక్కని కథతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. అన్ని వర్గాలవారికీ నచ్చే విధంగా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది.


● రజత్, ఐశ్వర్యా రాజ్

సాక్షి బిజినెస్
శుక్రవారం
27-10-2023

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్‌ ▽	నిఫ్టీ ▽
901	265
63,148	18,857

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ప్లస్‌' చూడండి

విదేశీ సూచీలు (తెలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ		మార్పు
నాస్‌డాక్‌	12,557	▽ 264
డోజోన్స్‌	32,782	▽ 254
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,378	▽ 37
డాక్స్‌	14,731	▽ 161
షాంఘై	2,988	△ 14
నికాయ్‌	30,602	▽ 668

•అమెరికా •బ్రిటన్‌ •జర్మనీ •చైనా •జపాన్‌

బులియన్‌ రూ.లలో

ముంబై


బంగారం (99.9 స్వచ్ఛత)	60,984
బంగారం (99.5 స్వచ్ఛత)	60,740
వెండి (కేజీ)	71,560

ఫారెక్స్‌ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్‌ డాలర్‌	ఒకటి	82.45	84.12
£	బ్రిటన్‌ పౌండ్‌	ఒకటి	98.97	102.27
€	యూరో	ఒకటి	86.27	89.36
¥	జపాన్‌ ఎన్‌ (100)	ఒకటి	54.51	56.21
AUS	ఆస్ట్రేలియా డాలర్‌	ఒకటి	51.20	53.51
S$	సింగపూర్‌ డాలర్‌	ఒకటి	59.72	61.64
SAR	సౌదీ రియాల్‌	[illegible]	21.24	22.86
UAE D	యూఏఈ దిర్హామ్‌	[illegible]	21.76	23.56
¥	చైనా యువాన్‌	[illegible]	10.25	12.32

ఆరో రోజూ 'బేర్‌ కల్లోలం'

- కొనసాగిన నష్టాల పరంపర
- 64 వేల దిగువకు సెన్సెక్స్‌
- 19,000 స్థాయిని కోల్పోయిన నిఫ్టీ
- 4 నెలల కనిష్టానికి సూచీలు



ముంబై: స్టాక్‌ మార్కెట్‌ 'బేర్‌ కల్లోలం' ఆరో రోజూ కొనసాగింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రం కావడం, అమెరికా ట్రెజరీ బాండ్లపై రాబడులు ఐదు శాతానికి చేరుకోవడం ఈక్విటీ మార్కెట్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఎఫ్‌అండ్‌ఓ ఎక్స్‌పైరీ కూడా మార్కెట్లపై ప్రభావం చూపింది. మిశ్రమ కార్పొరేట్‌ క్యూ2 ఆర్థిక ఫలితాలు, విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాల పరంపర, క్రూడాయిల్‌ పెరుగుదల, రూపాయి రికార్డు కనిష్టానికి చేరుకోవడం బేర్‌ కల్లోలానికి తమ ప్రభావాన్ని జోడించాయి. అస్థిరతను సూచించే వీఐఎక్స్‌ ఇండెక్స్‌ 3.69 శాతానికి పైగా పెరిగి 11.73 స్థాయికి చేరింది. అన్ని రంగాల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో ఈక్విటీ సూచీలు నాలుగు నెలల కనిష్ట స్థాయికి దిగివచ్చాయి. సెన్సెక్స్‌ 901 పాయింట్లు నష్టపోయి 64 వేల స్థాయి దిగువన 63,148 వద్ద స్థిరపడింది. నిఫ్టీ జూన్‌ 27 తర్వాత తొలిసారి 19 వేల స్థాయిని కోల్పోయింది. మొత్తంగా 265 పాయింట్లు క్షీణించి 18,857 వద్ద నిలిచింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో నెలకొన్న బలహీన సంకేతాల ప్రభావంతో ఉదయం నష్టాలతో మొదలైన సూచీలు రోజంతా బలహీనంగా ట్రేడయ్యాయి. ఎఫ్‌అండ్‌ఓ ఎక్స్‌పైరీ నేపథ్యంలో ఇన్వెస్టర్లు అమ్మకాలకే ఆసక్తి చూపారు. ఒక దశలో సెన్సెక్స్‌ 956 పాయింట్లు క్షీణించి 63,093 వద్ద, నిఫ్టీ 284 పాయింట్లు పతనమై 18,838 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. విదేశీ ఇన్వెస్టర్లు ఈ ఏడాదిలోనే ఒకరోజులో అత్యధికంగా రూ.7,703 కోట్ల ఈక్విటీ షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.6,558 కోట్ల షేర్లను కొన్నారు. ఈసీబీ సమావేశం, అమెరికా సెప్టెంబర్‌ క్వార్టర్‌ జీడీపీ డేటా వెల్లడి ముందు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా కదలాడుతున్నాయి. ఆసియా, యూరప్‌ మార్కెట్లు అర శాతం నుంచి ఒకశాతం నష్టపోయాయి. కాగా అమెరికా మార్కెట్లు అరశాతానికి పైగా నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

› నష్టాల మార్కెట్లోనూ యాక్సిస్‌ బ్యాంక్‌ రాణించింది. మెరుగైన సెప్టెంబర్‌ క్వార్టర్‌ ఫలితాల ప్రకటన ఇందుకు నేపథ్యం. క్యూ2లో నికర లాభం 10% రెట్ల వృద్ధిని సాధించడంతో ఈ ప్రైవేట్‌ రంగ బ్యాంక్‌ షేరు 2% లాభపడి రూ.971 వద్ద స్థిరపడింది. షేరు ర్యాలీతో కంపెనీ మార్కెట్‌ క్యాప్‌ రూ.5,144 కోట్లు పెరిగి రూ.3 లక్షల కోట్లకు చేరింది.

› రెండో క్వార్టర్‌ ఫలితాలు నిరాశపరచడంతో టెక్‌ మహీంద్రా షేరు 2% నష్టపోయి రూ.1,116 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో నాలుగున్నర శాతం నష్టపోయి రూ.1,089 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. షేరు పతనంతో కంపెనీ మార్కెట్‌ క్యాప్‌ రూ.2,501 కోట్లు తగ్గి రూ.1.09 లక్షల కోట్లకు దిగివచ్చింది.

› సెన్సెక్స్‌ సూచీ ఆరు ట్రేడింగ్‌ సెషన్లలో 3,280 పాయింట్లు(5%) క్షీణించడంతో బీఎస్‌ఈలో రూ.17.77 లక్షల కోట్లు ఆవిరియ్యాయి. ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ కంపెనీల మొత్తం మార్కెట్‌ విలువ రూ.306 లక్షల కోట్లకు దిగివచ్చింది. గురువారం ఒక్కరోజే రూ.2.95 లక్షల కోట్లు మాయమయ్యాయి.

› సెన్సెక్స్‌ సూచీలో 30 షేర్లలో యాక్సిస్‌ బ్యాంక్‌ 2%, ఐటీసీ 0.35%, హెచ్‌సీఎల్‌ టెక్‌ 0.20%, ఇండస్‌ ఇండ్‌ 0.10% షేర్లు మాత్రమే లాభపడ్డాయి. రంగాల వారీగా అత్యధికంగా ఆటో ఇండెక్స్‌ 2% నష్టపోయింది. ఆయిల్‌అండ్‌గ్యాస్‌, మెటల్‌, ఫైనాన్షియల్‌ సర్వీసెస్‌, వినిమయ రంగాల సూచీలు 1.50% క్షీణించాయి. కాగా టెలి కమ్యూనికేషన్‌, రియల్టీ, ఐటీ ఇండెక్సులు ఒకశాతానికి పైగా నష్టపోయాయి.

› గ్యాస్‌ పంపిణీ కంపెనీ ఐఆర్‌ఎం ఎనర్జీ షేరు లిస్టింగ్‌ రోజే నిరాశపరిచింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.505)తో పోలిస్తే 5.49% డిస్కౌంట్‌తో రూ.479 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో మరింత అమ్మకాల ఒత్తిడికి లోనైంది. ట్రేడింగ్‌లో 11% క్షీణించి రూ.450 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. చివరికి 6.34% నష్టపోయి రూ.472 వద్ద నిలిచింది.

వొడాఫోన్‌ ఐడియా నష్టాలు అప్‌

క్యూ2లో రూ. 8,738 కోట్లు



న్యూఢిల్లీ: మొబైల్‌ టెలికం రంగ దిగ్గజం వొడాఫోన్‌ ఐడియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్‌ ప్రాతిపదికన నికర నష్టం పెరిగి రూ. 8,738 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది(2022–23) ఇదే కాలంలో రూ. 7,596 కోట్ల నష్టం నమోదైంది. పన్ను లయబిలిటీ కింద రూ. 822 కోట్ల ప్రొవిజనింగ్‌ చేపట్టింది. మొత్తం ఆదాయం రూ. 10,656 కోట్ల నుంచి నామమాత్ర వృద్ధితో రూ. 10,716 కోట్లను తాకింది. ఒక్కో వినియోగదారుపై సగటు ఆదాయం(ఏఆర్‌పీయూ) 2 శాతం మెరుగుపడి రూ. 142కు చేరింది. ఆదాయం, ఏఆర్‌పీయూలలో మరోసారి వృద్ధిని అందుకున్నట్లు కంపెనీ సీఈవో అక్షయ మూంద్రా తెలియజేశారు. మొత్తం వినియోగదారుల సంఖ్య 6 శాతం క్షీణించి 21.98 కోట్లకు పరిమితమైంది. అయితే 4జీ సబ్‌స్క్రయిబర్లు 12 కోట్ల నుంచి 12.47 కోట్లకు పెరిగినట్లు కంపెనీ వెల్లడించింది. వీరి డేటా సగటు వినియోగం 15 జీబీ నుంచి 15.8 జీబీకి వృద్ధి చెందింది. సెప్టెంబర్‌కల్లా మొత్తం రుణ భారం రూ. 2,12,785 కోట్లకు చేరింది.

ఫలితాల నేపథ్యంలో ఈ షేరు ఎన్‌ఎస్‌ఈలో 1.4% క్షీణించి రూ. 10.7 వద్ద ముగిసింది.

అమెరికా ఎకానమీ పటిష్టం

మూడో త్రైమాసికంలో 4.9 శాతం వృద్ధి

వాషింగ్టన్‌: ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అమెరికా మూడవ త్రైమాసికంలో (జూలై–సెప్టెంబర్‌) పటిష్ట స్థాయిలో 4.9 శాతం వృద్ధి రేటును సాధించింది. 4.2 శాతం అంచనాలకు మించి వృద్ధి నమోదుకావడం విశేషం. అధిక ధరలు, పెరుగుతున్న వడ్డీరేట్లు నేపథ్యంలో అమెరికా ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి జారుతోందన్న వార్తలను తోసిపుచ్చుతూ ఎకానమీ వృద్ధి పటిష్టంగా నమోదుకావడం గమనార్హం. రెండవ త్రైమాసికంలో ఎకానమీ 2.1 శాతం వృద్ధిని నమోదుచేసుకుంది. కాగా, భారీ వృద్ధి రేటుకు లోబేస్‌ ఎఫెక్ట్‌ కారణంగా కొన్ని వర్గాలు పేర్కొంటున్నాయి.

పీఎన్‌బీ లాభం హైజంప్‌

క్యూ2లో రూ. 1,756 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం పంజాబ్‌ నేషనల్‌ బ్యాంక్‌(పీఎన్‌బీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్‌(క్యూ2)లో నికర లాభం నాలుగురెట్లు ఎగసి రూ. 1,756 కోట్లను అధిగమించింది. ఇది గత 14 త్రైమాసికాలలోనే అత్యధికంకాగా.. వడ్డీ ఆదాయం పుంజుకోవడం, ప్రొవిజన్లు తగ్గడం, రుణ నాణ్యత మెరుగుపడటం ఇందుకు తోడ్పాటునిచ్చాయి. గతేడాది(2022–23) ఇదే కాలంలో కేవలం రూ. 411 కోట్లు ఆర్జించింది. ఈ కాలంలో నికర వడ్డీ ఆదాయం 20 శాతం వృద్ధితో రూ. 9,923 కోట్లను తాకింది. రానున్న త్రైమాసికాలలో రుణ వ్యయాలు తగ్గనుండటంతో లాభదాయకత మరింత పుంజుకోనున్నట్లు బ్యాంక్‌ ఎండీ, సీఈవో అతుల్‌ కుమార్‌ గోయెల్‌ పేర్కొన్నారు.

ఎన్‌పీఏలు డౌన్‌

ప్రస్తుత సమీక్షా కాలంలో పీఎన్‌బీ స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 10.48 శాతం నుంచి రూ. 6.96 శాతానికి దిగివచ్చాయి. నికర ఎన్‌పీఏలు సైతం 1.47 శాతం నుంచి 1 శాతానికి తగ్గాయి. ప్రొవిజన్లు రూ. 4,906 కోట్ల నుంచి భారీగా క్షీణించి రూ. 3,444 కోట్లకు పరిమితమయ్యాయి.

ఫలితాల నేపథ్యంలో పీఎన్‌బీ షేరు బీఎస్‌ఈలో 0.5 శాతం బలపడి రూ. 70 వద్ద ముగిసింది.

కెనరా బ్యాంక్‌ లాభం జూమ్‌

క్యూ2లో రూ. 3,606 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం కెనరా బ్యాంక్‌ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023– 24) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్‌(క్యూ2)లో నికర లాభం 43 శాతం జంప్‌చేసి రూ. 3,606 కోట్లను తాకింది. వడ్డీ ఆదాయం పుంజుకోవడం, ప్రొవిజన్లు తగ్గడం ఇందుకు సహకరించాయి. గతేడాది(2022–23) ఇదే కాలంలో కేవలం రూ. 2,525 కోట్లు మాత్రమే ఆర్జించింది. నికర వడ్డీ ఆదాయం సైతం 20 శాతం వృద్ధితో రూ. 8,903 కోట్లకు చేరింది. మొత్తం ప్రొవిజన్లు రూ. 3,637 కోట్ల నుంచి భారీగా క్షీణించి రూ. 2,608 కోట్లకు పరిమితమయ్యాయి. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 6.37 శాతం నుంచి రూ. 4.76 శాతానికి దిగివచ్చాయి.

ఫలితాల నేపథ్యంలో ఈ షేరు ఎన్‌ఎస్‌ఈలో 3 శాతం బలపడి రూ. 360 వద్ద ముగిసింది.

5జీ వినియోగంలో మార్గదర్శిగా భారత్‌

ఎరిక్సన్‌ ఇండియా ఎండీ నితిన్‌ బన్సల్‌



న్యూఢిల్లీ: ఇతర మార్కెట్ల అడుగుజాడల్లో నడవకుండా, 5జీ టెక్నాలజీని వివిధ అవసరాల కోసం వినూత్న రీతుల్లో వినియోగించుకోవడంలో ప్రపంచానికి భారత్‌ మార్గదర్శకత్వం వహించగలదని స్వీడన్‌ టెలికం పరికరాల దిగ్గజం ఎరిక్సన్‌ ఇండియా విభాగం ఎండీ నితిన్‌ బన్సల్‌ అభిప్రాయపడ్డారు. ఇతరత్రా ఏ దేశంలోనూ జరగనంత వేగంగా 5జీ నెట్‌వర్క్‌ను భారత్‌ విస్తరించిందని ఆయన పేర్కొన్నారు. బ్యాంకింగ్‌తో పాటు వివిధ రంగాల సంస్థల అప్లికేషన్లకు డేటా కీలకంగా ఉంటున్న నేపథ్యంలో టెలికం నెట్‌వర్క్‌లు సురక్షితమైనవిగా ఉండటం చాలా ముఖ్యమని బన్సల్‌ చెప్పారు. 5జీ సేవలకు సంబంధించి ఇటు వినియోగదారులు, అటు సంస్థల నుంచి గణనీయంగా ఆసక్తి వ్యక్తమవుతోందని ఆయన పేర్కొన్నారు. డిజిటలైజేషన్‌ పెరగడం, వినియోగదారుల నుంచి డిమాండ్‌, ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టడం తదితర అంశాల కారణంగా ఈ సేవల వినియోగం వేగవంతం అవుతోందని బన్సల్‌ వివరించారు. క్రీడలు, ఆరోగ్య సంరక్షణ, విద్య వంటి విభాగాల్లో టెక్నాలజీని మరింత సమర్థంగా వినియోగించుకోవడంపై మొత్తం వ్యవస్థ కసరత్తు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. 5జీ సాంకేతికతతో నాణ్యత మెరుగుపడటంతో పాటు నెట్‌వర్క్‌లపై భారం కూడా తగ్గగలదని బన్సల్‌ చెప్పారు.

రికవరీ ఏజెంట్లు సమయాలు పాటించాలి!

- రుణ గ్రహీతలతో సంప్రదింపుల విషయంలో ఆర్‌బీఐ ప్రతిపాదనలు
- ఉదయం 8 గంటల ముందు చర్యలు నిషిద్ధం
- రాత్రి 7 తర్వాతా ఇదే వర్తిస్తుంది



ముంబై: రుణ గ్రహీతలు, గ్యారంటర్లపై ఫైనాన్షియల్‌ సంస్థలు, వారి రికవరీ ఏజెంట్ల ఒత్తిళ్లు, వేధింపులు పెరిగిపోతున్నాయన్న ఆందోళనల నేపథ్యంలో వీటి నియంత్రణకు బ్యాంకింగ్‌ రెగ్యులేటర్‌ రిజర్వ్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా (ఆర్‌బీఐ) కీలక ప్రతిపాదనలతో ముందుకు వచ్చింది. రాత్రి 7 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 8 గంటల వరకూ రుణ గ్రహీతలతో రికవరీ ఏజెంట్లు ఎటువంటి సంప్రదింపులూ జరపరాదన్న నిబంధన ఇందులో ఒకటి. ఆయా ప్రతిపాదనలపై సంబంధిత వర్గాలు నవంబర్‌ 28వ తేదీలోపు తన అభిప్రాయాలను తెలియజేయాలని ఆర్‌బీఐ సూచించింది. బ్యాంకులు, బ్యాంకింగ్‌యేతర ఫైనాన్షియల్‌ సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీ) వంటి నియంత్రిత సంస్థలు కోర్‌ మేనేజ్‌మెంట్‌ కార్యకలాపాలను అవుట్‌సోర్స్‌కు అప్పగించకూడదు. విధాన రూపకల్పన, కేవైసీ నిబంధనలకు అనుగుణంగా నిర్ణయాలు, రుణాల మంజూరు వంటి అంశాలు ఇందులో ఉన్నాయి. ఫైనాన్షియల్‌ సంస్థలు, వాటి రికవరీ ఏజెంట్లు తమ రుణ సేకరణ ప్రయత్నాలలో ఏ వ్యక్తిపైనైనా ఎలాంటి బెదిరింపులు లేదా వేధింపులకు పాల్పడకూడదు. అలాగే రుణగ్రహీతలు, వారి హామీదారులు వారి కుటుంబ సభ్యుల గోప్యతను బహిరంగ పరచకూడదు. బహిరంగంగా అవమానపరచడం, గోప్యతాంశాల్లోకి చొరబాట్లు కూడదు. మొబైల్‌లో లేదా సోషల్‌ మీడియా ద్వారా అనుచిత సందేశాలను పంపకూడదు.

డిపాజిట్ల ముందస్తు ఉపసంహరణకు అనుమతి

కాగా అన్ని రకాల టర్మ్‌ డిపాజిట్లు (రూ. కోటి వరకు) వాటి గడువు కంటే ముందుగానే ఉపసంహరించుకునే అవకాశాన్ని కల్పించాలని బ్యాంకులను ఆర్‌బీఐ ఆదేశించింది. ప్రస్తుతం రూ.15 లక్షల వరకు టర్మ్‌ డిపాజిట్లు వాటి గడువు ముగియకుండా, ఎప్పుడు కావాలన్నా ఉపసంహరించుకునే అవకాశం ఉంది. ఈ పరిమితిని ఆర్‌బీఐ రూ. కోటికి పెంచింది. తాజా ఆదేశాలు ఎన్‌ఆర్‌/ఎన్‌ఆర్‌వో టర్మ్‌ డిపాజిట్లకు సైతం వర్తిస్తుంది.

సాక్షి స్పోర్ట్స్‌



నేటి నుంచి ఆసియా మహిళల హాకీ చాంపియన్స్‌ ట్రోఫీ

స్వదేశంలో తొలిసారి జరుగుతున్న ఆసియా మహిళల హాకీ చాంపియన్స్‌ ట్రోఫీలో టైటిల్‌ నెగ్గడమే లక్ష్యంగా భారత జట్టు బరిలోకి దిగనుంది. ఆరు జట్ల మధ్య జరిగే ఈ టోర్నీ నేడు రాంచీలో మొదలవుతుంది. తొలి రోజు థాయ్‌లాండ్‌ జట్టుతో సవితా పూనియా కెప్టెన్సీలోని భారత జట్టు ఆడనుంది. మ్యాచ్‌ రాత్రి గం. 8:30 నుంచి జరుగుతుంది. చైనా, జపాన్‌, కొరియా, మలేసియా జట్లు కూడా ఈ టోర్నీలో పోటీపడుతున్నాయి. థాయ్‌లాండ్‌తో మ్యాచ్‌ తర్వాత భారత్‌ 28న మలేసియాతో, 30న చైనాతో, 31న జపాన్‌తో, నవంబర్‌ 2న కొరియాతో ఆడుతుంది. లీగ్‌ దశ ముగిశాక టాప్‌–4లో నిలిచిన జట్లు నవంబర్‌ 4న సెమీఫైనల్లో తలపడతాయి. నవంబర్‌ 5న ఫైనల్‌తో టోర్నీ ముగుస్తుంది. ఈ టోర్నీ మ్యాచ్‌లను సోనీ స్పోర్ట్స్‌ టెన్‌–5 చానెల్‌లో, సోనీ లివ్‌ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

ఇంగ్లండ్‌ మళ్లీ బోల్తా

- శ్రీలంక చేతిలో 8 వికెట్ల తేడాతో ఓడిన డిఫెండింగ్‌ చాంపియన్‌
- ఇక సెమీస్‌ చేరడం చాలా కష్టం
- దెబ్బతీసిన లహిరు, మాథ్యూస్‌
- నిసాంక, సమరవిక్రమ అర్ధ సెంచరీలు



విజయానంతరం శ్రీలంక బ్యాటర్లు నిసాంక, సమరవిక్రమ... నిరాశలో బెయిర్‌స్టో, మొయిన్‌ అలీ, కెప్టెన్‌ బట్లర్‌

బెంగళూరు: గత మెగా ఈవెంట్‌ ఫైనల్లో న్యూజిలాండ్‌తో సూపర్‌ ఓవర్‌దాకా పోరాడి మరీ పుట్టింటికి ప్రపంచకప్‌ను పట్టుకెళ్లిన ఇంగ్లండ్‌ ఈసారి మాత్రం లీగ్‌ దశలోనే ఇంటికెళ్లే ప్రమాదంలో పడింది. సగం మ్యాచ్‌లు పూర్తయినా ఒక్కటి మాత్రమే గెలిచి నాలుగు మ్యాచ్‌ల్లో ఓడింది. ఇకపై ఆడాల్సిన నాలుగు వరుసబెట్టి గెలిచినా... రేసులో నిలవడమైతే అసాధ్యమే! ఇప్పటికే అఫ్గానిస్తాన్‌ జట్టు చేతిలో అనూహ్యంగా ఓడిన ఇంగ్లండ్‌ జట్టును గురువారం జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక చేతిలో 8 వికెట్ల తేడాతో బోల్తా కొట్టించింది. టాస్‌ గెలిచి బ్యాటింగ్‌ ఎంచుకున్న బట్లర్‌ బృందం 33.2 ఓవర్లలో 156 పరుగులకే కుప్పకూలింది. బెంగళూరులాంటి చిన్నస్వామి స్టేడియంలో ఇది టి20లకు సైతం చిన్న స్కోరు. అలాంటిది వన్డేలకు ఏం సరిపోతుంది. బెన్‌ స్టోక్స్‌ (73 బంతుల్లో 43; 6 ఫోర్లు) చేసిందే టాప్‌ స్కోర్‌! ఇంకో ఇద్దరు ఓపెనర్లు బెయిర్‌స్టో (31 బంతుల్లో 30; 3 ఫోర్లు), మలాన్‌ (25 బంతుల్లో 28; 6 ఫోర్లు)లవి చెప్పుకోదగ్గ స్కోర్లే తప్ప జట్టుకు ఉపయోగపడే పరుగులేమీ కావు. 'ప్లేయర్‌ ఆఫ్‌ ద మ్యాచ్‌' లహిరు కుమార 3, మాథ్యూస్‌, కసున్‌ రజిత చెరో 2 వికెట్లు తీసి ఇంగ్లండ్‌ను కట్టడి చేశారు. అనంతరం శ్రీలంక 25.4 ఓవర్లలోనే రెండే వికెట్లు కోల్పోయి 160 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్‌ నిసాంక (83 బంతుల్లో 77 నాటౌట్‌; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), సమరవిక్రమ (54 బంతుల్లో 65 నాటౌట్‌; 7 ఫోర్లు, 1 సిక్స్‌) గెలిపించారు. నిసాంక 54 బంతుల్లో, సమరవిక్రమ 44 బంతుల్లో అర్ధసెంచరీలు పూర్తిచేశారు. శ్రీలంక 23 పరుగులకు 2 వికెట్లు కోల్పోయిన దశలో వీరిద్దరు కుదురుగా ఆడి అబేధ్యమైన మూడో వికెట్‌కు 137 పరుగులు జోడించి జట్టును విజయతీరానికి చేర్చారు.

నిర్లక్ష్యమే నిండా ముంచింది!

ఈ మెగా టోర్నీలో దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, పాకిస్తాన్‌, శ్రీలంకలాంటి గట్టి జట్లు 400, 350 పైచిలుకు స్కోర్లను అవలీలగా చేసేస్తుంటే చిన్నస్వామి స్టేడియంలో డిఫెండింగ్‌ చాంపియన్‌ ఇంగ్లండ్‌ కనీసం 160 పరుగులైనా చేయలేకపోయింది. ఓపెనర్‌ బెయిర్‌స్టో నుంచి లోయర్‌ ఆర్డర్‌లో ఎనిమిదో స్థానం వోక్స్‌ (0) దాకా బ్యాటింగ్‌ సామర్థ్యమున్న జట్టు... మేం ఆడేది వరల్డ్‌కప్‌ మ్యాచ్‌ కాదన్నట్లు, మాకేం పట్టనట్లు ఆద్యంతం నిర్లక్ష్యం కనబరిచింది. స్టోక్స్‌ ముందు, తర్వాత ఇంకెవరూ అసలు చెప్పుకోదగ్గ స్కోర్లే చేయలేదు. రూట్‌ (3), కెప్టెన్‌ బట్లర్‌ (8), లివింగ్‌స్టోన్‌ (1), మొయిన్‌ అలీ (15) అంతా లంక బౌలింగ్‌కు దాసోహమయ్యారు.

స్కోరు వివరాలు

ఇంగ్లండ్‌ ఇన్నింగ్స్‌: బెయిర్‌స్టో (సి) ధనంజయ (బి) రజిత 30; మలాన్‌ (సి) కుశాల్‌ మెండిస్‌ (బి) మాథ్యూస్‌ 28; జో రూట్‌ (రనౌట్‌) 3; స్టోక్స్‌ (సి) హేమంత (సబ్‌) (బి) లహిరు 43; బట్లర్‌ (సి) కుశాల్‌ మెండిస్‌ (బి) లహిరు 8; లివింగ్‌స్టోన్‌ (ఎల్బీడబ్ల్యూ) (బి) లహిరు 1; అలీ (సి) పెరీరా (బి) మాథ్యూస్‌ 15; వోక్స్‌ (సి) సమరవిక్రమ (బి) రజిత 0; విల్లే (నాటౌట్‌) 14; ఆదిల్‌ రషీద్‌ (రనౌట్‌) 2; వుడ్‌ (స్టంప్డ్‌) కుశాల్‌ మెండిస్‌ (బి) తీక్షణ 5; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (33.2 ఓవర్లలో ఆలౌట్‌)** 156. **వికెట్ల పతనం:** 1–45, 2–57, 3–68, 4–77, 5–85, 6–122, 7–123, 8–137, 9–147, 10–156. **బౌలింగ్‌:** మదుషంక 5–0–37–0, కసున్‌ రజిత 7–0–36–2, తీక్షణ 8.2–1–21–1, మాథ్యూస్‌ 5–1–14–2, లహిరు కుమార 7–0–35–3, ధనంజయ 1–0–10–0.

శ్రీలంక ఇన్నింగ్స్‌: నిసాంక (నాటౌట్‌) 77; కుశాల్‌ పెరీరా (సి) స్టోక్స్‌ (బి) విల్లే 4; కుశాల్‌ మెండిస్‌ (సి) బట్లర్‌ (బి) విల్లే 11; సమరవిక్రమ (నాటౌట్‌) 65; ఎక్స్‌ట్రాలు 3, **మొత్తం (25.4 ఓవర్లలో 2 వికెట్లకు)** 160. **వికెట్ల పతనం:** 1–9, 2–23. **బౌలింగ్‌:** వోక్స్‌ 6–0–30–0, డేవిడ్‌ విల్లే 5–0–30–2, ఆదిల్‌ రషీద్‌ 4.4–0–39–0, మార్క్‌ వుడ్‌ 4–0–23–0, లివింగ్‌స్టోన్‌ 3–0–17–0, మొయిన్‌ అలీ 3–0–21–0.

ప్రపంచకప్‌లో నేడు

పాకిస్తాన్‌ X దక్షిణాఫ్రికా

వేదిక: చెన్నై

మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్‌ స్పోర్ట్స్‌, హాట్‌స్టార్‌ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ప్రపంచకప్‌ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్‌	5	5	0	10	1.353
దక్షిణాఫ్రికా	5	4	1	8	2.370
న్యూజిలాండ్‌	5	4	1	8	1.481
ఆస్ట్రేలియా	5	3	2	6	1.193
శ్రీలంక	5	2	3	4	-0.025
పాకిస్తాన్‌	5	2	3	4	-0.400
అఫ్గానిస్తాన్‌	5	2	3	4	-0.969
బంగ్లాదేశ్‌	5	1	4	2	-1.253
ఇంగ్లండ్‌	5	1	4	2	-1.634
నెదర్లాండ్స్‌	5	1	4	2	-1.902

నోట్‌: ఆ–ఆడినవి, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, పా–పాయింట్లు, నె.ర.రే–నెట్‌ రన్‌రేట్‌



ఆదిల్‌ ఆదమరుపు కీపర్‌ డైరెక్ట్‌ త్రో మెరుపు

ఇంగ్లండ్‌ ప్లేయర్‌ ఆదిల్‌ రషీద్‌ తన నిర్లక్ష్యంతో నాన్‌స్ట్రయిక్‌ ఎండ్‌లో వికెట్‌ను పారేసుకున్నాడు. 32వ ఓవర్లో తీక్షణ వేసిన ఐదో బంతి లెగ్‌సైడ్‌ దిశగా నేరుగా కీపర్‌ కుశాల్‌ మెండిస్‌ చేతుల్లో పడింది. అవతలి వైపున్న రషీద్‌ క్రీజు వెలుపల ఉన్నాడు. ఇది గమనించిన మెండిస్‌ గ్లౌజ్‌ తీసి బుల్లెట్‌ వేగంతో నాన్‌స్ట్రయిక్‌ ఎండ్‌ వికెట్లను గిరాటే వేయడంతో రషీద్‌ రనౌటయ్యాడు. రషీద్‌ అవుటయ్యాక మరో తొమ్మిది బంతులకు ఇంగ్లండ్‌ ఇన్నింగ్స్‌ ముగిసింది.

భారత్‌ కొత్త చరిత్ర

ఆసియా పారా క్రీడల్లో అత్యధిక పతకాలు సొంతం



స్వర్ణ పతకాలతో శీతల్‌ దేవి, రాకేశ్‌ కుమార్‌

హంగ్జౌ: వరుసగా నాలుగో రోజు తమ పతకాల వేటను కొనసాగిస్తూ ఆసియా పారా క్రీడల్లో భారత బృందం కొత్త చరిత్ర సృష్టించింది. ఈ క్రీడల చరిత్రలో అత్యధిక పతకాలను సొంతం చేసుకుంది. 2018 జకార్తా ఆసియా పారా క్రీడల్లో భారత్‌ అత్యధికంగా 72 పతకాలను దక్కించుకోగా... హంగ్జౌలో నాలుగో రోజు పోటీలు ముగిసేసరికి భారత బృందం 18 స్వర్ణాలు, 23 రజతాలు, 41 కాంస్యాలతో కలిపి 82 పతకాలతో ఎనిమిదో స్థానంలో ఉంది. మరో రెండు రోజులపాటు కొనసాగే ఈ క్రీడల్లో ఈసారి భారత్‌ పతకాల్లో 'సెంచరీ'ని దాటే అవకాశముంది. గురువారం భారత్‌కు మూడు స్వర్ణాలు, మూడు రజతాలు, 12 కాంస్యాలతో కలిపి మొత్తం 18 పతకాలు వచ్చాయి. అథ్లెటిక్స్‌లో పురుషుల ఎఫ్‌46 కేటగిరీ షాట్‌పుట్‌ ఈవెంట్‌లో సచిన్‌ సర్జేరావు ఖిలారి ఇనుప గుండును 16.03 మీటర్ల దూరం విసిరి స్వర్ణ పతకాన్ని గెల్చుకున్నాడు. అనంతరం ఆర్‌6 మిక్స్‌డ్‌ 50 మీటర్ల రైఫిల్‌ ప్రోన్‌ ఎస్‌హెచ్‌1 విభాగంలో భారత షూటర్‌ సిద్ధార్థ బాబు 247.7 పాయింట్లు స్కోరు పసిడి పతకాన్ని సాధించాడు. ఆర్చరీలో శీతల్‌ దేవి–రాకేశ్‌ కుమార్‌ జోడీ కాంపౌండ్‌ మిక్స్‌డ్‌ ఈవెంట్‌లో 151–149తో లిన్‌ యుషాన్‌–అయ్‌ జిన్‌లియాంగ్‌ (చైనా) జంటపై నెగ్గి బంగారు పతకాన్ని దక్కించుకుంది.

ఒలింపిక్స్‌ నిర్వహణకు భారత్‌ సిద్ధం: ప్రధాని మోదీ

- గోవాలో జాతీయ క్రీడలు షురూ
- వచ్చే నెల 9 దాకా ఆటల పండగ



పనాజీ: జాతీయ ఆటల పండగ గోవాలో అట్టహాసంగా మొదలైంది. గురువారం భారత ప్రధాని నరేంద్ర మోదీ 37వ జాతీయ క్రీడలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'భారత క్రీడాకారులు అంతర్జాతీయ క్రీడల్లో విశేష ప్రతిభ కనబరుస్తున్నారు. మేం వచ్చాక ప్రత్యేకించి క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధి కోసం ప్రత్యేక పథకాలు అమలు చేశాం. ప్రతిభావంతుల్ని గుర్తించి ఆర్థిక అండదండలు అందజేస్తూనే ఉన్నాం. ఈ ఏడాది క్రీడల బడ్జెట్‌ను భారీగా పెంచాం. గత తొమ్మిదేళ్ల బడ్జెట్‌తో పోల్చితే ఇది మూడు రెట్లు ఎక్కువ. ఆచరణ, అమలు తీరుతెన్నులతో భారత క్రీడల ముఖచిత్రం మారుతోంది. మన దేశంలో ప్రతిభకు కొదవలేదు. చాంపియన్లతో అది ఎప్పుడో నిరూపితమైంది. ఒలింపిక్‌, ఆసియా, కామన్వెల్త్‌ క్రీడల చాంపియన్లు ఎందరో దేశప్రతిష్టను పెంచారు. ఇక మిగిలింది విశ్వక్రీడల ఆతిథ్యమే! 2036 ఒలింపిక్స్‌ క్రీడలకు ఆతిథ్యమిచ్చేందుకు భారత్‌ సిద్ధంగా ఉంది' అని ఆయన అన్నారు. జాతీయ క్రీడలను వచ్చేనెల 9 వరకు 15 రోజుల పాటు 28 వేదికల్లో 43 క్రీడాంశాల్లో నిర్వహిస్తారు. రాష్ట్రాలు, సర్వీసెస్‌లకు చెందిన 37 జట్లు బరిలో ఉన్నాయి. 10 వేల పైచిలుకు అథ్లెట్లు పతకాల కోసం శ్రమించనున్నారు. ప్రారంభోత్సం కంటే ముందుగానే వెయిట్‌లిఫ్టింగ్‌, బ్యాడ్మింటన్‌, నెట్‌బాల్‌, జిమ్నాస్టిక్స్‌, ఫెన్సింగ్‌, బాస్కెట్‌బాల్‌ క్రీడాంశాల్లో పోటీలు మొదలయ్యాయి.

సాత్విక్‌–చిరాగ్‌ జోడీకి షాక్‌



పారిస్‌: ఫ్రెంచ్‌ ఓపెన్‌ వరల్డ్‌ టూర్‌ సూపర్‌–750 బ్యాడ్మింటన్‌ టోర్నమెంట్‌లో భారత క్రీడాకారుల కథ ముగిసింది. పురుషుల డబుల్స్‌ విభాగంలో డిఫెండింగ్‌ చాంపియన్స్‌ సాత్విక్‌ సాయిరాజ్‌–చిరాగ్‌ శెట్టి జోడీకి ప్రిక్వార్టర్‌ ఫైనల్లో చుక్కెదురైంది. మహిళల సింగిల్స్‌ ప్రిక్వార్టర్‌ ఫైనల్లో భారత స్టార్‌ పీవీ సింధు గాయం కారణంగా మ్యాచ్‌ మధ్యలో వైదొలిగింది. డబుల్స్‌ ప్రిక్వార్టర్‌ ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్‌ ర్యాంక్‌లో ఉన్న సాత్విక్‌ సాయిరాజ్‌–చిరాగ్‌ శెట్టి ద్వయం 23–25, 21–19, 19–21తో మొహమ్మద్‌ అహసాన్‌–హెంద్రా సెతియవాన్‌ (ఇండోనేసియా) జోడీ చేతిలో పోరాడి ఓడిపోయింది. సుపనిద కటెథోంగ్‌ (థాయ్‌లాండ్‌)తో జరిగిన మ్యాచ్‌లో సింధు తొలి గేమ్‌ను 21–18తో సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లో స్కోరు 1–1 వద్ద సింధు మోకాలికి గాయం కావడంతో ఆమె మ్యాచ్‌ నుంచి వైదొలిగింది.

జపాన్‌ చేతిలో భారత్‌ పరాజయం

తాష్కెంట్‌: ఆసియా ఫుట్‌బాల్‌ కాన్ఫెడరేషన్‌ (ఏఎఫ్‌సీ) మహిళల 2024 పారిస్‌ ఒలింపిక్స్‌ క్వాలిఫయింగ్‌ టోర్నమెంట్‌ను భారత జట్టు భారీ ఓటమితో ప్రారంభించింది. తాష్కెంట్‌లో గురువారం జరిగిన గ్రూప్‌ 'సి' తొలి లీగ్‌ మ్యాచ్‌లో భారత్‌ 0–7 గోల్స్‌ తేడాతో ప్రపంచ మాజీ చాంపియన్‌ జపాన్‌ జట్టు చేతిలో ఓడిపోయింది. తొలి అర్ధభాగం ముగిసే సమయానికి జపాన్‌కు ఒక్క గోల్‌ మాత్రమే ఇచ్చిన భారత్‌ రెండో అర్ధభాగంలో ఏకంగా ఆరు గోల్స్‌ను సమర్పించుకుంది. తెలంగాణ అమ్మాయి సౌమ్య గుగులోత్‌ 46వ నిమిషంలో స్ట్రయికర్‌ బాలాదేవి స్థానంలో సబ్‌స్టిట్యూట్‌గా బరిలోకి దిగింది. ఈ నెల 29న జరిగే రెండో లీగ్‌ మ్యాచ్‌లో వియత్నాంతో భారత్‌ ఆడుతుంది.

క్లుప్తంగా...

రాకాసి ఉడుము



కర్ణాటకలోని కుంద గ్రామంలో రాకాసి ఉడుము గురువారం ప్రత్యక్షమైంది. ఆరు అడుగుల పొడవు ఉన్న ఈ ఉడుము కొడెందెర దిలీప్ అనే వ్యక్తి ఇంటి ప్రహరీ వద్ద తిరుగుతుండగా చూసి అటవీశాఖ అధికారులకు గ్రామస్తులు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే అక్కడకు చేరుకుని ఆ ఉడుమును పట్టుకుని అడవిలో వదిలిపెట్టారు. దీన్ని జెయింట్ ఇండియన్ మానిటర్ లిజార్డ్ అంటారని, ఇది చాలా అరుదుగా కనిపిస్తుందని జీవశాస్త్ర నిపుణులు తెలిపారు.

-మైసూరు

రాష్ట్రస్థాయి స్కూల్ బ్యాండ్ పోటీలకు ఆహ్వానం

సాక్షి, అమరావతి: నవంబర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి స్కూల్ బ్యాండ్ పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి గల బృందాలు దరఖాస్తు చేసుకోవాలని సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు గురువారం కోరారు. ఆసక్తి గల అన్ని మేనేజ్‌మెంట్లలోని పాఠశాలలు నవంబర్ 5లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ పోటీలు నవంబర్ 14న అన్నమయ్య జిల్లా పుల్లంపేట ఎస్పీవీడీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తామన్నారు. ఇందులో బ్రాస్ బ్యాండ్ (బాలికలు, బాలురు), పైప్ బ్యాండ్ (బాలురు, బాలికలు)లో 4 కేటగిరీలు ఉంటాయని, విజేతలను కేరళలో జరిగే సదరన్ రీజియన్ జోనల్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులు 25–33 మంది బృందంగా, ఇద్దరు ఎస్కార్టులు ఉండేలా చూసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 94401 29593 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఉద్యోగాంధ్రప్రదేశ్‌గా మార్చడమే లక్ష్యం

ఏపీఎస్ఎస్‌డీసీ చైర్మన్ అజయ్ రెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎక్కడా నిరుద్యోగమనేది లేకుండా అందరికీ ఉపాధి కల్పించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, దానికి అనుగుణంగా ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ప్రత్యేకంగా ఒక ఎకోసిస్టమ్ అభివృద్ధి చేసిందని ఏపీఎస్ఎస్‌డీసీ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి తెలిపారు. గురువారం ఏపీఎస్ఎస్‌డీసీ ప్రధాన కార్యాలయంలో నైపుణ్య శిక్షణపై అజయ్ రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా యువతీ యువకులకు స్కిల్ హబ్స్, స్కిల్ కాలేజీల్లో స్థానిక పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టుగా, ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకొని వారికి కావాల్సిన మెళకువలు, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇతర కంప్యూటర్ స్కిల్స్ నేర్పించి వంద శాతం ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో మరింత విస్తృతమైన ఉపాధి అవకాశాలను కల్పించే విధంగా కృషి చేసి, ఆంధ్రప్రదేశ్‌ను ఉద్యోగ ఆంధ్రప్రదేశ్‌గా మార్చాలన్నారు. ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ సీఈవో వినోద్ కుమార్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

తెలంగాణ

రూ.6.85 కోట్ల నగదు, వస్తువుల స్వాధీనం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ శాసనసభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు గురువారం రూ.6.85 కోట్ల విలువ చేసే నగదు, మద్యం, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఇప్పటివరకు స్వాధీనం చేసుకున్న నగదు, ఇతర వస్తువుల మొత్తం విలువ రూ.347.16 కోట్లకు పెరిగింది. గురువారం రూ.3.17 కోట్ల నగదును పట్టుకోగా, ఇప్పటి వరకు స్వాధీనం చేసుకున్న మొత్తం నగదు రూ.122.62 కోట్లకు చేరింది. ఈ మేరకు గురువారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ వెల్లడించారు.

త్రిపుర గవర్నర్‌గా ఇంద్రసేనారెడ్డి బాధ్యతలు

సాక్షి, హైదరాబాద్: త్రిపుర గవర్నర్‌గా నల్లు ఇంద్రసేనారెడ్డి గురువారం ఉదయం అగర్తలాలో బాధ్యతలు స్వీకరించారు. ఇంద్రసేనారెడ్డితో త్రిపుర హైకోర్టు ప్రధానన్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం రాజభవన్‌లో ఆ సీఎం డాక్టర్ మాణిక్ సాహా, సీనియర్ అధికారులతో ఇంద్రసేనారెడ్డి భేటీ అయ్యారు. అక్కడ అమలవుతున్న వివిధ పథకాలు, కార్యక్రమాల గురించి సీఎం వివరించారు. అధికారులు పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలని ఇంద్రసేనారెడ్డి సూచించారు. సాధారణ పౌరులు సైతం సాధికారత సాధించేలా అంతా కృషి చేయాలని కోరారు. తెలుగు రాష్ట్రాల నుంచి వెళ్లిన అభిమానులు పూలదండలతో ఇంద్రసేనారెడ్డిని సత్కరించారు. అనంతరం రాజ్‌భవన్‌లో గవర్నర్ దంపతులు తేనేటి విందు ఇచ్చారు. కార్యక్రమానికి సీఎం మాణిక్ సాహా, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, న్యాయమూర్తులు హాజరయ్యారు.

సాగునీటి సమస్యను అధిగమించేలా..

2 నుంచి విశాఖలో ప్రతిష్టాత్మక ఐసీఐడీ 25వ ఇంటర్నేషనల్ కాంగ్రెస్

- 57 ఏళ్ల తర్వాత భారత్‌లో ఈ సదస్సు నిర్వహణ
- ఆతిథ్యమిస్తున్న సెంట్రల్ వాటర్ కమిషన్, ఏపీ జలవనరుల శాఖ
- ప్రారంభించనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- హాజరుకానున్న 74 దేశాలకు చెందిన 1,200 మంది ప్రతినిధులు
- నీటిపారుదల, వరదనీటి నిర్వహణపై అంతర్జాతీయ వర్క్‌షాప్‌లు

ICID•CIID

సాక్షి, విశాఖపట్నం: మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సదస్సుకు విశాఖ మహా నగరం వేదికకానుంది. ఐదున్నర దశాబ్దాల తర్వాత భారత్ ఆతిథ్యమిస్తున్న ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్ ఇంటర్నేషనల్ కమిషన్(ఐసీఐడీ) 25వ అంతర్జాతీయ కాంగ్రెస్‌ను నవంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు విశాఖ రిషికొండలోని రాడిసస్ బ్లూ హోటల్‌లో నిర్వహించనున్నారు. 'వ్యవసాయంలో నీటి కొరతను అధిగమించడం' అనే థీమ్‌తో నిర్వహిస్తున్న ఈ సదస్సుకు 74 దేశాలకు చెందిన 1,200 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. సెంట్రల్ వాటర్ కమిషన్, ఏపీ జలవనరులశాఖ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సును రెండో తేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తారు. కేంద్ర జలవనరులశాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, ఐసీఐడీ అధ్యక్షుడు డాక్టర్ రాగబ్, ఏపీ జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు,



వివిధ దేశాల అంబాసిడర్లు, మంత్రులు పాల్గొంటారు. సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీగా జలవనరుల శాఖ ప్రత్యేక అధికారి ఎల్లారెడ్డి వ్యవహరిస్తున్నారు. అదేవిధంగా ఐసీఐడీ 25వ అంతర్జాతీయ కాంగ్రెస్‌తోపాటు 74వ అంతర్జాతీయ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఐఈసీ) సదస్సు కూడా ఇదే వేదికపై జరగనుంది.



లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు

విశాఖలో జరగనున్న 25వ అంతర్జాతీయ కాంగ్రెస్, 74వ ఐఈసీ సదస్సుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోపాటు 74 దేశాల నుంచి సభ్యులు, ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. ఏర్పాట్లపై సమీక్షించి భద్రత, నిర్వహణపరంగా ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించాం. సదస్సుకు హాజరయ్యే అతిథుల్లో సుమారు 300మంది స్థానిక పర్యాటక ప్రాంతాలతోపాటు అరకు, తాటిపూడి రిజర్వాయర్లను సందర్శించనున్నారు.

– డాక్టర్ మల్లికార్జున, విశాఖపట్నం జిల్లా కలెక్టర్

కార్యక్రమం ఇలా...

- ఐసీఐడీ ఏర్పాటైన తర్వాత తొలి సదస్సు 1951లో భారత్‌లో నిర్వహించారు. ఆ తర్వాత 1966లో 6వ అంతర్జాతీయ కాంగ్రెస్‌ను ఢిల్లీలో నిర్వహించారు. మళ్లీ 57 ఏళ్ల తర్వాత విశాఖలో నిర్వహించనున్నారు.
- విశాఖ సదస్సులో వ్యవసాయం కోసం ప్రత్యామ్నాయ నీటి వనరులు ఎలా వినియోగించుకోవాలనే అంశంపై ఐసీఐడీలోని 54 సభ్యదేశాలు, మరో 20 అసోసియేట్ మెంబర్ సభ్యదేశాల ప్రతినిధులు చర్చించనున్నారు.
- సంప్రదాయ నీటివనరులను అభివృద్ధి చేయడం, నీటిపారుదల వ్యవస్థను మెరుగుపరచడం, వర్షపునీటి సంరక్షణ, పొలాల్లో వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు మార్గాలు, భూగర్భ జలాల పెంపు, మురుగునీటిని శుద్ధి చేసి సాగునీటిగా వినియోగించేందుకు ఉన్న మార్గాలు, అధిక దిగుబడుల కోసం శుద్ధజలాల వినియోగం తదితర అంశాలపై తొలి రెండు రోజులు సెషన్స్ నడుస్తాయి.
- రైతు సాధికారత అంశంపై సహకార సంస్థలు, నీటి వినియోగదారుల సంఘాల పాత్ర, వ్యవసాయ విస్తరణ సేవలు, రైతులకు ఉపయోగపడే సమాచార వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడం, వ్యవసాయ రంగంలో సాంకేతికతను పెంపొందించడం, వ్యవసాయ పరిశోధనలు, ఆవిష్కరణలు, స్కాడా తదితర అంశాలపై ప్యానెల్ డిస్కషన్లు జరగనున్నాయి.
- 2 నుంచి 4వ తేదీ వరకు వ్యవసాయ రంగంలో ఆవిష్కరణలు, ఆధునిక పద్ధతులు, కొత్త పరికరాలతో కూడిన 128 స్టాల్స్‌తో ఎగ్జిబిషన్ నిర్వహించనున్నారు.
- భారత్ నుంచి 300 మంది ప్రతినిధులు, ఇతర దేశాల నుంచి 900 మందికిపైగా ఈ సదస్సులో భాగస్వామ్యం కానున్నారు.

ఫోర్టిఫైడ్ బియ్యంతో 'ఆరోగ్యం'

ఏపీలో సమర్థంగా ఫుడ్ ఫోర్టిఫికేషన్ వ్యవస్థ

- పీడీఎస్ లబ్ధిదారుల్లో రక్తహీనత, పోషకాహార లోపం తగ్గుదల
- ఏపీ నుంచి విదేశాలు, ఆఫ్రికాకు ఫోర్టిఫైడ్ బియ్యం ఎగుమతి
- ఫుడ్ ఫోర్టిఫికేషన్‌పై ప్రాంతీయ వర్క్‌షాప్‌లో అధికారుల వెల్లడి



10 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రతినిధుల ప్రాంతీయ వర్క్ షాప్‌లో పాల్గొన్న అధికారులు

సాక్షి, అమరావతి: దేశంలోనే సమర్థవంతమైన 'ఫుడ్ ఫోర్టిఫికేషన్' వ్యవస్థ ఆంధ్రప్రదేశ్‌లో ఉందని, తత్ఫలితంగా పోషకాహార లోపం, రక్తహీనత సమస్యను అధిగమించగలుగుతున్నామని పలువురు అధికారులు పేర్కొన్నారు. గురువారం మంగళగిరిలో 'ఫుడ్ ఫోర్టిఫికేషన్'పై 10 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రతినిధులతో 'ప్రాంతీయ వర్క్‌షాప్' నిర్వహించారు. ఈ సందర్భంగా పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఏడాది పొడవునా ఏపీలో వరి సాగవుతుండడంతో బియ్యం నిల్వల్లో మిగులు రాష్ట్రంగా ఉందన్నారు. అవసరమైతే విదేశాలకు, ముఖ్యంగా ఆఫ్రికా దేశాలకు సైతం ఏపీ నుంచి ఫోర్టిఫైడ్ బియ్యం ఎగుమతి చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 1.48 కోట్ల బియ్యం కార్డుదారులతో పాటు మధ్యాహ్న భోజనం పథకం, ఐసీడీఎస్ పథకాలకు ఫోర్టిఫైడ్ బియ్యాన్నే పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. విటమిన్లతో కూడిన ఈ బియ్యాన్ని ప్రజలు ప్లాస్టిక్/చైనా బియ్యంగా అపోహపడే అవకాశం ఎక్కువగా ఉందని.. ముందుగా వినియోగదారుల్లో ఫోర్టిఫైడ్ బియ్యంపై చైతన్యం తీసుకురావాలని సూచించారు. పౌరసరఫరాల సంస్థ ఎండీ వీరపాండియన్ మాట్లాడుతూ.. దేశంలోనే ఫోర్టిఫైడ్ రైస్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ వ్యవస్థను కలిగిన ఏకైక రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తున్నదన్నారు. ప్రతి దశలోనూ పరిశీలించిన తర్వాతే ఫోర్టిఫైడ్ రైస్ పంపిణీకి అనుమతులు ఇస్తున్నామని స్పష్టం చేశారు. లిక్విడ్ టెస్టింగ్ ద్వారా మోతాదు ప్రకారం విటమిన్ల శాతం లేకుంటే ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్‌ను అప్పటికప్పుడే తిరస్కరిస్తున్నట్లు తెలిపారు. భారతీ ఆహార, ప్రజా పంపిణీ శాఖ ఉప కార్యదర్శి ఎస్‌హెచ్.లలన్ ప్రసాద్ శర్మ మాట్లాడుతూ..దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న రక్తహీనత మహమ్మారిని అరికట్టడంలో భాగంగా 2019లో 11 రాష్ట్రాల్లో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన ఫోర్టిఫైడ్ రైస్ పంపిణీ.. ప్రస్తుతం 27 రాష్ట్రాలకు విస్తరించిందని వివరించారు. 2024 నాటికి దేశవ్యాప్తంగా ఫోర్టిఫైడ్ బియ్యాన్ని పంపిణీ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతున్నదన్నారు. మైక్రోసేవ్ కన్సల్టింగ్ సంస్థ (ఎంఎస్‌సీ) ఆధ్వర్యంలో జరిగిన జాతీయ వర్క్‌షాప్‌లో ఎంఎస్‌సీ సహవ్యవస్థాపకుడు కుంజ్ బిహారీ, ఢిల్లీ ఎయిమ్స్ వైద్యుడు తేజస్‌ఆచారీ, ఆహార భద్రత–ప్రమాణాల సంస్థ జేడీ కె.బాలసుబ్రహ్మణ్యం, అండమాన్ అండ్ నికోబార్, ఢిల్లీ, హరియాణా, గోవా, గుజరాత్, కర్ణాటక, కేరళ, లద్దాఖ్, లక్షద్వీప్, మహారాష్ట్ర, పంజాబ్, రాజస్థాన్, తమిళనాడు, తెలంగాణ, ఉత్తరాఖండ్ ప్రతినిధులు హాజరయ్యారు.

వధూవరులకు సీఎం జగన్ ఆశీస్సులు



ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సోదరుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు జక్కంపూడి గణేశ్ వివాహ రిసెప్షన్ గురువారం రాజానగరం మండలం దివాన్‌చెరువులోని డీబీవీ రాజు లేఅవుట్‌లో జరిగింది. సీఎం వైఎస్ జగన్ హాజరై వధూవరులు గణేశ్, సుకీర్తిలకు ఆశీస్సులు అందజేశారు. - రాజానగరం

అభయమిచ్చారు.. ఆదుకున్నారు

- పలువురు అర్జీదారులకు సీఎం జగన్ ఆపన్న హస్తం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): సీఎం వైఎస్ జగన్ మరోసారి తన పెద్ద మనస్సు చాటుకున్నారు. అభాగ్యులకు ఆపన్నహస్తం అందించారు. గురువారం తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువు గ్రామంలో జక్కంపూడి గణేశ్ వివాహ వేడుకల్లో పాల్గొనడానికి వచ్చిన సీఎం వైఎస్ జగన్‌కు పలువురు తమ సమస్యలు తెలియజేశారు. వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. సీఎం ఆదేశించిన మూడు గంటల్లోనే కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మొత్తం ఆరుగురు అర్జీదారులకు రూ.5.50 లక్షల ఆర్థిక సహాయాన్ని కలెక్టర్ మాధవీలత అందించారు. ధవళేశ్వరానికి చెందిన ఆర్‌జీ బాలకృష్ణ డిసెంబర్‌లో మలేసియాలో జరిగే వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు వెళ్లేందుకు ప్రయాణఖర్చుల నిమిత్తం రూ.2.50 లక్షల చెక్కు అందజేసినట్లు తెలిపారు. అలాగే వివిధ సమస్యలతో ఇబ్బంది పడుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అన్నవరానికి చెందిన పెయ్యాల బాబురావుకు రూ.లక్ష, రాపాక వెంకట సూర్యనారాయణకు రూ.25 వేలు, వాడపల్లికి చెందిన దాకే చంద్ర ఫణికుమార్‌కి



సీఎం జగన్‌కు వినతి పత్రం అందిస్తున్న బాలకృష్ణ

రూ.లక్ష, పోతవరానికి చెందిన షేక్ అబ్దుల్ ఖాదర్‌కు రూ.25 వేలు చెక్కు అందజేశామన్నారు. తండ్రిని కోల్పోయి ఇబ్బందుల్లో ఉన్న పెనుగొండకు చెందిన కె.లక్ష్మీకుమారికి రూ.50 వేలు చెక్కు అందజేయడంతో పాటు ఉద్యోగం కోసం పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌కు సిఫారసు చేసినట్లు తెలిపారు. పోతవరానికి చెందిన తోట ఇంద్రకుమారి ఇంటి స్థలం పట్టా కోసం సీఎంను కలిశారని.. ఈ విషయమై తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు.



బాలకృష్ణకు చెక్ అందజేస్తున్న కలెక్టర్

ఫ్రాన్స్, బెల్జియం చాక్లెట్లలో ఆంధ్రా రుచులు

- ఫర్మంటేషన్ చేసిన కోకో బీన్స్ ఉత్పత్తి
- డార్క్ చాక్లెట్ల తయారీలో వినియోగం
- విజయవంతమైన పైలట్ ప్రాజెక్టు
- కొత్తగా 5 ఎఫ్‌పీవోలకు 35 శాతం సబ్సిడీతో ఆర్థిక చేయూత
- డిసెంబర్ నుంచి 100 టన్నుల ఎగుమతికి సన్నాహాలు



సాక్షి, అమరావతి: ఆంధ్ర 'కోకో'కు ప్రపంచ స్థాయి బ్రాండింగ్ తెచ్చేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషి సత్ఫలితాలనిస్తున్నాయి. పైలట్ ప్రాజెక్టుగా రైతు ఉత్పత్తిదారుల సంఘం(ఎఫ్‌పీవో) ఉత్పత్తి చేసిన ప్రీమియం కోకో గింజలను ఫ్రాన్స్‌కు ఎగుమతి చేయడం విజయవంతం కావడంతో మరో ఐదు ఎఫ్‌పీవోల ద్వారా చెన్నై, ముంబై, కేరళతో పాటు ఫ్రాన్స్, బెల్జియం దేశాలకు ఎగుమతి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. నాలుగేళ్ల కిందట 21 వేల హెక్టార్లలో కోకో సాగవగా, ప్రభుత్వ ప్రోత్సాహంతో ప్రస్తుతం 40 వేల హెక్టార్లకు విస్తరించింది. ఏటా 38 వేల టన్నుల కాయలు దిగుబడి వస్తుండగా.. వాటి నుంచి 11 వేల టన్నుల గింజలొస్తాయి. దిగుబడిలో 80 శాతం క్యాడ్బరీ, మిగిలింది నెస్లే, క్యాంప్కో, లోటస్ వంటి కంపెనీలు సేకరిస్తున్నాయి. సాధారణంగా గుజ్జుతో కూడిన గింజలను 1–2 రోజులు ఎండబెట్టి కంపెనీలకు అమ్ముతుంటారు. వీటికి కిలో రూ.180–210 చొప్పున చెల్లిస్తుంటారు. కోకో రైతులకు అదనపు ఆదాయం సమకూర్చడమే లక్ష్యంగా ప్రీమియం చాక్లెట్ల తయారీలో ఉపయోగించే ఫైన్ ఫ్లావర్డ్ బీన్స్ ఉత్పత్తిపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా 35 శాతం సబ్సిడీపై రూ.28 లక్షల వరకు ఆర్థిక చేయూతనిస్తోంది. ప్రీమియం కోకో గింజల ఉత్పత్తి కోసం బాక్స్ పర్మంటేషన్‌పై అవసరమైన సాంకేతిక శిక్షణనిస్తోంది. పైలట్ ప్రాజెక్ట్‌గా కృష్ణా జిల్లా నూజివీడు మండలం తడికలపూడిలోని సాయిరాగ్ ఫుడ్స్ అండ్ బేవరేజ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి సబ్సిడీపై ఆర్థిక చేయూతనివ్వగా.. గడిచిన ఏడాదిలో 25 టన్నుల ప్రీమియం కోకో గింజలను ముంబై నుంచి ఫ్రాన్స్‌కు ఎగుమతి చేశారు. ఫలితంగా కంపెనీ పరిధిలోని 300 మందికి పైగా రైతులు కిలోకు రూ.80 అదనంగా లబ్ధి పొందారు.

35 శాతం సబ్సిడీపై రుణాలు

పైలట్ ప్రాజెక్టు విజయవంతం కావడంతో ఇదే రీతిలో ప్రోత్సహించేందుకు 25 రైతు ఉత్పత్తిదారుల సంఘాలను గుర్తించారు. తొలి విడతగా ద్వారకా పామ్ ఆయిల్‌ఫెడ్, చింతలపూడి ఫార్మర్స్ ఫెడ్, తీగలవంచ నర్సాపురం ఫెడ్, మద్ది ఆంజనేయ, టి.కృష్ణారెడ్డి ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్‌లకు ఒక్కో ఎఫ్‌పీవోకు రూ.10 లక్షల సబ్సిడీ(35 శాతం)తో రూ.28 లక్షల ఆర్థిక చేయూతనిచ్చారు. ఈ ఎఫ్‌పీవోల పరిధిలో 1500 మంది రైతులు 5 వేల ఎకరాల్లో కోకో సాగు చేస్తున్నారు. వీరికి ఫైన్ ఫ్లావర్డ్ కోకో గింజల ఉత్పత్తిపై శిక్షణ కూడా ఇచ్చారు. డిసెంబర్ నుంచి ఇవి 16 టన్నుల చొప్పున చెన్నై, ముంబై కంపెనీల ద్వారా ఫ్రాన్స్, బెల్జియం దేశాలకు ఎగుమతి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఫర్మంటేషన్ చేస్తారిలా..

గుజ్జుతో కూడిన కోకో గింజలను గాలి తగలకుండా 3 రోజులు, గాలి తగిలేలా 3 రోజులు ఫర్మంటేషన్ చేస్తారు. ఆ తర్వాత గుజ్జు నుంచి వేరు చేసిన గింజలను వేరు డ్రయింగ్ ప్లాట్ ఫారమ్స్‌పై ఐదు రోజుల పాటు ఎండబెడతారు. సార్టింగ్, గ్రేడింగ్ తర్వాత క్వాలిటీ గింజలను 5, 20 కిలోల చొప్పున ప్యాకింగ్ చేస్తారు. ఇలా తయారైన ఫ్లావర్డ్ బీన్స్‌కు మార్కెట్ రేటు కంటే 30 శాతం అదనపు ధర లభిస్తుంది. అదే సేంద్రియ పద్ధతిలో సాగు చేసి, శాస్త్రీయ పద్ధతిలో ఫర్మంటేషన్ చేస్తే మరో 15 శాతం అదనంగా చెల్లిస్తామంటున్నాయి.

ఒక్కో రైతుకు రూ.20 వేలు అదనపు ఆదాయం



కంపెనీ పరిధిలో 223 మంది రైతులు 557 ఎకరాల్లో కోకో సాగు చేస్తున్నారు. ఎకరాకు 400 కిలోల కోకో గింజలు ఉత్పత్తి చేస్తున్నారు. స్థానిక మార్కెట్‌లో కిలోకు రూ.180 లోపే వస్తున్నాయి. ఫర్మంటేషన్ చేసి కేరళకు చెందిన కంపెనీ ద్వారా విదేశాలకు ఎగుమతి చేస్తున్నాం. కిలోకు రూ.50–80 చొప్పున.. ఒక్కో రైతుకు రూ.20 వేలు అదనంగా ఆదాయం వస్తోంది. తొలి దశలో 16 టన్నులు ప్రాసెస్ చేసి ఎగుమతి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

– నల్లజర్ల పవన్‌కుమార్, ఎండీ, ద్వారకా తిరుమల పామ్ ఆయిల్ ఫెడ్ ప్రొడ్యూసర్స్ కంపెనీ

సబ్సిడీతో ఆర్థిక చేయూత

కోకో రైతులకు అదనపు ఆదాయం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళుతోంది. ఎఫ్‌పీవోలుగా ఏర్పడి ముందుకొచ్చే రైతులకు 35 శాతం సబ్సిడీపై ఆర్థిక చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అవసరమైన శిక్షణ కూడా ఇస్తాం. మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తాం.

– ఎల్.శ్రీధర్‌రెడ్డి, సీఈవో, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ

రాష్ట్రానికి విజన్ – 2047

- నీతి ఆయోగ్ వర్క్‌షాపులో సమగ్ర చర్చ
- పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు

సాక్షి, అమరావతి: వికసిత్ భారత్–2047లో భాగంగా నీతి ఆయోగ్ సహకారంతో రాష్ట్ర విజన్ ప్రణాళిక–2047ను రూపొందించేందుకు సచివాలయంలో నిర్వహిస్తున్న వర్క్‌షాప్ రెండో రోజైన గురువారం కూడా కొనసాగింది. నీతి ఆయోగ్ అదనపు కార్యదర్శి వి.రాధ అధ్యక్షతన జరిగిన వర్క్‌షాప్‌లో ఇంధనం, రవాణ, ఐటీ, ఎలక్ట్రానిక్స్–కమ్యూనికేషన్స్, పర్యాటకం, పరిశ్రమలు, మౌలిక వసతులు, పెట్టుబడులు, ఏపీఐఐసీ, ఈడీబీ, ఏపీజీడీసీ, ఫుడ్ ప్రాసెసింగ్, మైనింగ్, ఏపీఎండీసీ, చేనేత, గృహ, టిడ్కో తదితర అంశాలపై సుదీర్ఘ చర్చ జరిగింది. రాష్ట్రంలో ఆయా రంగాల వారీగా ఉన్న బలాలు, బలహీనతలు, అవకాశాలు, సవాళ్లను సంబంధిత శాఖల అధికారులు నీతి ఆయోగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రంగాల వారీగా సవాళ్లను ఎదుర్కొనేందుకు, అవకాశాలను సద్వినియోగం చేసుకునేందుకు అనుగుణంగా రాష్ట్ర విజన్ ప్రణాళిక–2047ను రూపొందించేందుకు అవసరమైన మార్గదర్శకాలు, సూచనలను రాష్ట్ర అధికారులకు నీతి ఆయోగ్ అధికారులు అందజేశారు. వర్క్‌షాప్‌లో ఉన్నతాధికారులు ఎం.గిరిజాశంకర్, కె.విజయానంద్, ఎస్.యువరాజ్, కె.వి.ఎస్.చక్రధర్ బాబు, ఎస్.రమణారెడ్డి, సీహెచ్.రాజేశ్వరరెడ్డి, నీతి ఆయోగ్ సలహాదారు సీహెచ్ పార్థసారథిరెడ్డి, పబ్లిక్ పాలసీ నిపుణులు అమ్రిత్ పాల్ కౌర్, సీనియర్ కన్సల్టెంట్ శైలి మణికర్, పర్యవేక్షణ–మూల్యాంకన నిపుణులు బిప్లప్ నంది, బోస్టన్ కన్సల్టెంట్ గ్రూప్ ప్రతినిధి అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.